# ఆకాశ వీధిలో

# అపరంజి బొమ్మ




వి. శ్రీనివాస చక్రవర్తి

1. "విశాల విశ్వం"

"ఈ  విశాల విశ్వంలో..." గొంతు సవరించుకుంటూ పాఠం మొదలెట్టింది భ్రమరాంబా టీచర్.

అంతలో ఎదురుగా బల్ల మీద వున్న సెల్ ఫోన్ మ్రోగింది. మెళ్లో వేలాడుతున్న కళ్ల జోడు మళ్లీ తగిలించుకుని మొబైల్ లో క్షణం క్రితమే వచ్చిన ఓ వాట్ సాప్ సందేశాన్ని ఆత్రంగా చదివి "హహ్హా... హహ్హా" అని ఒళ్లంతా ఊగిపోయేలా కాసేపు తీరిగ్గా నవ్వింది.

మొదటి వరుసలో కూర్చున్న రెండుజళ్ల కవిత టిచరు కేసి రెప్పవేయకుండా చూస్తోంది. ఇంతేసి ఆ పిల్ల కళ్లలో  టీచరు పట్ల ఆరాధనాభావం బాదొచ్చినట్టు కనపడుతోంది.  టీచర్ నవ్వినా, దగ్గినా, ఛోకొట్టినా, చాక్ పీస్ రువ్వినా  కవితకి ఇష్టమే. ఏనాడైనా ఆమెలా కావాలని ఆ పసి మనసులో ఓ చిన్ని ఆశ.

ఆ క్లాసులో రెప్పవేయకుండా చూసేది ఒక్క కవిత మాత్రమే కాదు. ఇంకా ఉన్నారు. అయితే వాళ్లు చూస్తున్నది టీచర్ని కాదు. కిటికీ పక్కనే కూర్చున్న నిశాంత్ కిటికీలో పైనుండి దిగొస్తున్న ఓ బుల్లి బల్లినే రెప్పవేయకుండా చూస్తున్నాడు. ప్రతీ క్లాసులోను ఆ బాలబల్లి ఎప్పుడు వచ్చి పలకరిస్తుందా వేయి కళ్లతో ఎదురు చూస్తుంటాడు. ఇక శంకర్రావు...  మల్లె పూలో, మల్లె దండలో కాదు... ఏకంగా మల్లె చెట్టుని తలలో తురుముకుని తన ముందు కూర్చున్న సీతామాలక్ష్మి తల కేసి ధ్యానంగా చుస్తున్నాడు. అది మల్లె గంధానికి ఊపిరాడక, తల దిమ్మెక్కగా ఏర్పడ్డ ధ్యాన స్థితి కూడా కావచ్చు. ఉన్నది ఏడో క్లాసైనా ఏ పదిహేడో క్లాసులోనో ఉండాల్సినంత భారీ కాయం గల ప్రతాప్ తన ముందు కూర్చున్న పెర్సీ జుట్టుకి దారంతో ఓ చిట్టి కోతి బొమ్మ కట్టడానికి 'విశ్వ'ప్రయత్నం చేస్తున్నాడు.

అసలు ఆ విశ్వభారత్ పబ్లిక్ స్కూల్లో, ఏడో క్లాసులో, ఏ సెక్షన్  తరగతే ఓ చిన్నారి విశ్వం  అంటే అతిశయోక్తి కాదు.

"అమ్మయ్య! అమ్మోరు నవ్వేరు!"

కవిత తలలో మోగుతున్న ఆరాధనా గీతికని పటాపంచలు చేస్తూ వెనుక నుండి గుసగుసగా అంది శ్రావ్య.

టీచరు గారికి పిల్లలు పెట్టుకున్న ముద్దు పేర్లలో 'అమ్మోరు' ఒకటి. దాన్ని కాస్త పొడిగించి కొంతమంది అదేదో జబ్బుని తలపించేలా 'పెద్ద అమ్మవారు' అని కూడా పిలుచుకుంటారు. మరో పేరు చిచ్చుబుడ్డి. కేవలం దీపావళి సీజను లో మాత్రమే ఆ పేరుతో తలచుకుంటారు. ఎవరి అభిమానం కొద్దీ వాళ్లు రకరకాలుగా పిలుచుకుంటారు. అయితే అందరి ఆదరాభిమానాలని చూరగొన్న బహుచక్కని పేరొకటి వుంది. అది "విశాలమైన విశ్వం." దేశభక్తులు 'జైహింద్' అన్నట్టు ఈవిడ నిముషనిముషానికి "విశాలమైన విశ్వం" అన్న పదజాలాన్ని సైన్స్ పాఠం మధ్యలో విరివిగా ప్రయోగిస్తూ ఉంటుంది. సగటు క్లాసులో ఆవిడ ఆ పదజాలాన్ని 11.2 సార్లు ప్రయోగిస్తుందని ఆ క్లాసులో పిల్లలు సేకరించిన గణాంకాల సారాంశం.

"ఈ విశ్వం చాలా విశాలమైంది కదూ?" మొబైల్ కింద పెట్టి, కళ్ల జోడు కిందకి వేలాడేసుకుని మళ్లీ పాఠం మొదలెట్టింది భ్రమరాంబ. "ఏం అంతేనా కవీ?" అంది ముందు బెంచిలో తన కృపాకటాక్షాల కోసం అనుక్షణం పరితపించే తన ప్రియతమ విద్యార్థిని 'కవి'త ని చూసి.

అవునవునన్నట్టుగా తల ఉధృతంగా ఊపింది కవిత.

'మరీ అంత ఊపక్కర్లేదే పిలకల చిలకా!" వెనుక నుండి మళ్లీ తగ్గు స్వరంలో అంది శ్రావ్య.

ఒడుపుగా కాలు వెనక్కి చాచి శ్రావ్య కాలిని తన్నబోతే, అది కుర్చీ కాలికి తగిలింది. నరాలు జివ్వుమన్నాయి. నోట్లోంచి కెవ్వున రాబోయిన కేకని గొంతులోనే అణిచేసుకుంది కవిత.

"ఈ విశ్వం ఎంత పెద్దదో ఈ రోజు ఎవరు చెప్తారు?" రోజు అడిగే సమాచారాన్నే ఆ రోజు కాస్త కొత్తగా అడగడానికి ప్రయత్నించింది టిచరు.

"ఇంత పెద్దది," చేతులు బార్లా చాచి అన్నాడు ముందు వరుసలో కూర్చున్న ప్రసాదు.

క్లాసు గొల్లుమంది.

“ప్రసాదూ! నువ్వు ఇక్కడ ఉండాల్సినోడివి కాదయ్యా. ఏ ఒకటో క్లాసులోనో ఉండాల్సినోడివి,” అంది భ్రమరాంబ కాస్త వ్యంగ్యం చిలకరిస్తూ.

ప్రసాదు చేతులు దించేశాడు.

కవిత చెయ్యెత్తి టీచరు ఆనతి కోసం ఆగకుండానే గడగడా చెప్పేసింది,

“విశ్వం వ్యాసం కొన్ని కోట్ల కోట్ల కాంతిసంవత్సరాలు.”

“వెరీ గుడ్! చక్కగా చెప్పావ్ కవీ!” టీచరు మెచ్చుకోలుకి నవనీతంలా కరిగిపోయింది కవిత.

“మరి ఈ విశ్వంలో ఏముంటాయ్?” టీచర్ మళ్లీ ప్రశ్న వేసింది. మళ్ళీ బావుటాలా పైకి లేచిన కవిత చెయ్యిని పట్టించుకోకుండా “నువ్వు చెప్పు శ్రావ్యా?” అని అడిగింది భ్రమరాంబ. క్లాసులో కనీకనిపించని అల్లరి చేసే పిల్లల మీద తన అధిపత్యం నిరూపించుకోడానికి భ్రమరాంబకి ఈ ‘అవధానం’ ఓ వీలైన అవకాశం.

విశ్వం పాఠం నుండి ఏ ప్రశ్న వేసినా సమాధానంలో ఎక్కడో అక్కడ ‘కోటానుకోట్ల’ అన్న పదం ఉంటే కనీసం సగం మార్కులైనా కోట్టేయొచ్చని ఆ క్లాసులో పిల్లలకి ఓ గట్టి నమ్మకం. ఆ నమ్మకాన్నే ఇక్కడ వాడుకుంది శ్రావ్య.

“తారలు... కోటానుకోట్ల తారలు” మనసులో కాస్త సందేహంగానే వున్న పైకి మాత్రం ధీమాగా మొహం పెట్టి లేచి నించుని అంది శ్రావ్య.

“ఊc! ఫరవాలేదే. కూర్చో,”

నిట్టూరుస్తూ కూర్చుంది శ్రావ్య. తన దృష్టిలో బళ్లో పాఠాలన్నీ అర్థం లేని ఆటలు. ఇష్టం లేని పోరాటాలు. వాటికి తన చిన్నారి జీవనానుభూతికి మధ్య ఎక్కడా పొంతన ఉండదు. అయినా పోరాడాలి. ఆ పోరాటంలో ఎలాగైనా నెగ్గాలి. విజేతగా బయటకు రావాలి.

“విశ్వంలో ఇంకా ఏమేం ఉన్నాయో ఎవరు చెప్తారు?” అంటూ సెకన్ల ముల్లులా తన చూపుడు వేలిని క్లాసంతా తిప్పింది భ్రమరాంబ. ఆ వేలు ఏం ఖర్మమోగాని పాపం శర్మ దిశలో ఆగింది.

“ఏదీ, నువ్వు చెప్పు.”

“గ్రహణాలండి టీచరు గారు!” లేచి నించుని తల వంచుకుని చేతులు కట్టుకుని సమాధానం చెప్పాడు శర్మ.

క్లాసంతా నవ్వులు విరిసాయి.

“బాగా చెప్పావు, నువ్వు మా క్లాసుకి పట్టినట్టు.” మళ్లీ నవ్వులు. “ఏయ్ నువ్వు చెప్పు,” వేలు శర్మ పక్కనే ఉన్న పెర్సీ మీద ఆగింది.

గ్రహణాలు అన్న పదంలో మన వాడికి అసలు సమాధానం స్ఫురించింది.

“గ్ర... గ్రహాలు” అన్నాడు పెర్సీ కాస్త తత్తరపడుతూ.

“గుడ్. నువ్వు గాని ఈ రోజు తప్పుడు సమాధనం చెప్పుంటే నాకు ఆగ్ర...గ్రహం వచ్చేది,” అంది భ్రమరాంబ హహ్హా అని తన జోక్ తనే నవ్వేసుకుంటూ.

“సరే బావుందర్రా! ఇవాళ బానే సమాధానాలు చెప్తున్నారు. ఇక గ్రహాల దాకా వచ్చేశాం గనక వరుసగా గ్రహాల పేర్లు ఎవరు చెప్తారు?”

“మెర్క్యురీ, వీనస్...” అడిగిందే ఆలస్యంగా కవిత దండకం అందుకుంది.

“నువ్వు ఉండవమ్మా. తక్కిన వాళ్ళనీ చెప్పనీ,” అంది భ్రమరాంబ కాస్త ఆప్యాయంగా కసుర్తూ.

భ్రమరాంబ చూపుడు వేలు క్లాసులో అక్కడక్కడ పిల్లల మీద ఆగుతుంటే, ఎంపికైన శాల్తీ లేచి వరుసగా చెప్పుకుంటూ వచ్చారు.
“మెర్క్యురీ”, “వీనస్”, “ఎర్త్ అంటే భూమి”, “మార్స్”, “జూపిటర్,” “శాటర్న్”, “యురేనస్,” “నెప్ట్యూన్”...

“నెప్ట్యూన్ కి అవతల ఇంకేవైనా గ్రహాలు ఉన్నాయా?” ఎర వేసి చేప కోసం ఎదురు చూసే బేస్తవాడిలా కొన్ని క్షణాలు ఎదురుచూసింది భ్రమరాంబ.

“లేవు... లేవు,” క్లాసంతా కోలాహలంగా అంది.

“ప్లూటో ఒకప్పుడు గ్రహం గాని ఇప్పుడు కాదుగా!” అంది కవిత తెలివిగా.

“ఉన్నాయి…” క్లాసులో ఓ మూల నుండి ఓ గొంతిక వినిపించింది. “నెప్ట్యూన్ కి అవతల కూడా గ్రహాలు ఉన్నాయి.”

“ఎవరు? ఎవరది? లేచి నించుని చెప్పండి. ఎవరా అన్నది?” గదమాయించింది భ్రమరాంబ.

ఒక్క నిముషం క్రితం  వరకు, చివరి వరుసలో, ఎదుట బల్ల మీద తల వాల్చి కునుకుతీస్తున్న అమోఘ్ లేచి నించున్నాడు.

“ఓహ్! నువ్వా? అనుకున్నాలే. ఇలాంటి తలతిక్క సమాధానాలు నీ దగ్గర్నుండే వస్తాయి. అయినా ప్లూటో ఇప్పుడు గ్రహం కాదని, 2006 లో దాన్ని లఘుగ్రహం స్థాయికి దించేశారని తెలీదూ?”

“తెలుసు టీచర్. అయితే అలా ఎందుకు దించేశారో తెలుసా టీచర్?”

“చిన్నది కనుక. అది కూడా తెలీదా నీకు?” సమాధానం సకాలంలో స్ఫురించినందుకు లోలోపల పొంగిపోయింది భ్రమరాంబ.

“కాని ప్లూటో చిన్నదని ఎంతో కాలంగా తెలుసే. మరి 2006 ఉన్నట్లుండి ఏం జరిగిందో తెలుసా టీచర్?” రెట్టించాడు అమోఘ్.

భ్రమరాంబకి ముచ్చెమటలు పోశాయి. ఇక లాభం లేదు. ప్రతాపం చూపించాల్సిందే. శివంగిలా ఎదురుతిరిగింది.

“ఏయ్ః! ఏంటి నన్నే తిరుగు ప్రశ్నలు అడుగుతున్నావా? ఒళ్లెలా వుంది? మీ నాయన ఏదో సైంటిస్టని ఒళ్లుపొగరా ఏంటి?”

“అలా ఎందుకు జరిగిందో నేను చెప్తాను.” టీచరు బెదిరింపులకి జడవ కుండా గడగడా చెప్పుకుపోయాడు అమోఘ్. "అసలు 1992 నుంచే ప్లూటో కి దీటుగా ఉండే కొత్త కొత్త ఖగోళ వస్తువులని కనుక్కున్నారు. ఎరిస్, హౌమియా, మాకేమాకే, సెరిస్ ఇలా ఎన్నో కొత్త వస్తువులని కనిపించాయి. అదే ప్రాంతంలో  అంత పెద్ద వస్తువులు తమకి తెలియనివి కొన్ని డజన్ల కొద్దీ ఉండొచ్చని అనిపించింది. డజన్ల కొద్ది గ్రహాలు ఉండడం కొంత మందికి నచ్చలేదు. అందుకే ఏదో వంక పెట్టి వాటన్నిటినీ గ్రహాలు అన్న హోదా నుండి తొలగించేశారు. లఘుగ్రహాలు అని ముద్ర వేశారు.”

“పిచ్చి పిచ్చిగా వాగకు. ఇంకొక్క మాట మాట్లాడావంటే ప్రిన్సిపాలుగారితో చెప్పి స్కూల్ నుండి డిబారు చెయ్యిస్తాను జాగ్రత్త,” గర్జించింది భ్రమరాంబ.

“అవును టీచర్. ఫ్లూట్ విషయంలో కూడా సరిగ్గా అదే జరిగింది అంటున్నా. క్లాసులో టీచరుకు నచ్చిన పిల్లలకే మంచి విద్యార్థులు అన్న హోదా. తక్కిన వాళ్లని డిబార్ చెయ్యడం, ఫెయిల్ చెయ్యడం … ఇదే వాళ్ల గతి.”

ఇంతవరకు అమోఘ్ చెప్పింది అర్థమైనా కాకపోయినా ఈ ఆఖరి ముక్క మాత్రం క్లాసులో చాలా మందికి అర్థమయ్యింది. ఆమోద ముద్రగా పిల్లలంతా బల్లల మీద దబదబా బాదారు.

“ఒరేయ్ నిన్నూ…” అని వేదిక దిగి అమోఘ్ మీదకి లంఘించబోయింది భ్రమరాంబ.

పిల్లల మీద చెయ్యి చేసుకోబోయిన లెక్కల టీచరు జోగులాంబకి గత నెల ఏం జరిగిందో అంతలో గుర్తొచ్చింది. లేచిన చెయ్యి ఠక్కున్న గాల్లో ఆగిపోయింది.

నీ సంగతి ఇలా కాదు. నీకు హెడ్ మాస్టారుగారే మందు,” అంటూ చాక్ పీసు, డస్టరు కింద విసిరేసి, తన ప్రాణంలో ప్రాణమైన మొబైల్ ని తీసుకెళ్లడం మాత్రం మర్చిపోకుండా క్లాస్ లోంచి విసవిసా బయటికి నడిచింది భ్రమరాంబ.

టీచర్ వెళ్లిపోయినా పాఠం కొనసాగింది.

పిల్లలంతా తమ కొత్త ‘టీచర్’ చుట్టూ మూగారు. టీచర్ వెళ్లడమే ఆలస్యం శ్రావ్య పరుగెత్తి వెళ్లి అమోఘ్ పక్కన కూర్చుంది. ప్రతాప్ మెచ్చుకోలుగా అమోఘ్ వీపు మీద చరిచాడు. ఆ దెబ్బకి తన లావుపాటి, నల్ల ఫ్రేము వున్న కళ్లజోడు ఊడి కిందపడినంత పనయ్యింది.

“టీచర్ కి అలా ఎదురు మాట్లాడావు. నీకు భయం వెయ్యదా?” బింకంగా అడిగాడు శర్మ.

“నిజమని తెలిసింది చెప్పడానికి భయం ఎందుకు?” తడుముకోకుండా అన్నాడు అమోఘ్.

“నీకు ఇన్ని విషయాలు ఎలా తెలుసు అమోఘ్,” ఆశ్చర్యంగా అడిగాడు సుల్తాన్.

“మా నాన్నగారు చెప్తారు. నేను కూడా బోలెడు పుస్తకాలు చదువుతాను,” అన్నాడు అమోఘ్ కళ్లజోడు వెనక్కు తోసుకుంటూ.

“నిజంగానే మరి నెప్ట్యూన్ కి అవతల గ్రహాలు ఉన్నాయా?” అడిగింది శ్రావ్య. అప్పటికే ఆ అమ్మాయికి అంతవరకు తనకి అమోఘ్ పట్ల వున్న గౌరవం రెండితలు అయింది.

“నెప్ట్యూన్ కి అవతల ప్లూటో, ఎరిస్ మొదలైన లఘు గ్రహాలన్నీ ఉన్న ప్రాంతాన్ని కైపర్ బెల్ట్ అంటారు. అక్కడ బోలెడు ...”

“కోటానుకోట్లు...” నవ్వుతూ అందించింది శ్రావ్య.

“అవును కోటానుకోట్ల వస్తువులు ఉన్నాయి. అందులో కొన్ని బాగా పెద్ద వస్తువులు కూడా ఉండి ఉంటాయని శాస్త్రవేత్తలు అనుకుంటున్నారు,” అన్నాడు అమోఘ్.

“ఉండాలని అనుకోడానికి, ఉన్నాయని నిరూపించడానికి తేడా వుందిగా,” మళ్లీ అడిగింది శ్రావ్య.

“నిజమే. అయితే ఈ ఏడాది జనవరి 20 నాడు నెప్ట్యూన్ కి చాలా అవతల ఓ పెద్ద వస్తువుని కనుక్కున్నారు. అది భూమి కన్నా 10 రెట్లు పెద్దదట! అది సూర్యుడి చుట్టూ 15,000 ఏళ్లకి ఒకసారి ప్రదక్షిణ చేస్తుందట.”

“పదిహేను వేల ఏళ్లే!” కళ్లింత చేస్తూ అంది అఖిలాండేశ్వరి. “అప్పటికైనా నేనీ బడి నుండి బయటపడతానో లేదో?”

“సూర్యుడి నుండి నెప్ట్యూన్ దూరం కన్నా ఏడు రెట్లు ఎక్కువ దూరంలో సూర్యుడి చుట్టూ తిరుగుతుందట ఆ గ్రహం.”

“అంటే అప్పుడది మన తొమ్మిదో గ్రహం అన్నమాట,” ఉత్సాహంగా అన్నాడు శర్మ.

“అమోఘ్ బాబూ!” ప్యూన్ వీరాస్వామి పిలిచిన కేకకి అమోఘ్ కిటికీ వైపు చూశాడు. “మిమ్మల్ని హెచ్.ఎమ్. గారు రమ్మంటున్నారు.”

”తొమ్మిదో గ్రహం పిలుస్తోంది వెళ్లు మరి!” నవ్వుతూ అన్నాడు శర్మ.

శర్మ కేసి ఓ సారి కొరకొర చూసి వీరాస్వామి వెంట బయల్దేరాడు అమోఘ్.



అమోఘ్ కి ఈ వర్తమానాలు కొత్తేం కాదు. నెలకోసారైనా ఈ తంతు జరక్క మానదు. భ్రమరాంబ చాడీలు చెప్పడం, హెచ్.ఎమ్. గారు పిలిచి చెడామడా అక్షింతలు వెయ్యడం ఇవన్నీ అమోఘ్ కి పరిపాటే.

వీరాస్వామి వెంట కారిడార్ లో వడిగా నడుస్తూ వెళ్తున్న అమోఘ్ కి పక్కనే ఉన్న క్లాస్ లోంచి

"ఏయ్ అమోఘ్!" అన్న కేక వినిపించింది.

మూడవ క్లాసు C  సెక్షన్ క్లాసది. తాన్యా టీచర్ హడావుడిగా బయటికి వచ్చింది.

"ఇంకా నేనే మీ క్లాస్ కి వచ్చి చెప్దామని అనుకుంటున్నాను. మీ అమ్మ ఇప్పటికే మూడు సార్లు ఫోన్ చేసింది నీకు గుర్తు చెయ్యమని. ఈ రోజు మీ కార్ రాదు. నువ్వు మీ చెల్లాయి అనూహ్యని తీసుకుని స్కూల్ బస్ లో వెళ్లాలి. గుర్తుందిగా?"

అవునన్నట్టు తల ఊపాడు అమోఘ్. తన దృష్టి క్లాసులో కిటికీ పక్కనే కూర్చున్న ఓ పాప మీద పడింది.

ఆ పాపే తన చెల్లెలు అనూహ్య. బంగారు జరీ అంచుగల ఎర్రని పరికిణీ జాకెట్ వేసుకుంది. (స్కూల్లో అందరికీ తెల్ల చొక్కా, కాఖీ నిక్కరు యూనీఫామ్ వేసుకోవాలనే నియమం వున్నా ఆ నియమం అనూహ్యకి వర్తించదు.) మరిగించిన పాలలో కుంకుమ పువ్వు కలిపినట్టుండే చక్కని మైఛాయ. ఆ చిన్నారి నుదుటి మీద పెద్ద ఎర్రటి బొట్టు. వన్నెలో ఆ బొట్టుని తలదన్నే ఎర్రని చిట్టి పెదాలు.

పెద్ద పెద్ద బొమ్మల పుస్తకం ఏదో కాళ్ల మీద పరుచుకుని కూర్చుంది. అందులో ఏం నచ్చిందో ఏమో, సంతోషంగా చప్పట్లు చరుస్తోంది.

"గుర్తుంది టీచర్. అలాగే వచ్చి తీసుకెళ్తాను," అంటూ అక్కడి నుండీ కదలబోయాడు అమోఘ్.

అంతలో "అన్నయ్యా!" అని మరో కేక తనని ఆపింది.

“అనూహ్య నేకీదో చూపించాలనుకుంటోంది కాబోలు,” అంది తాన్యా టీచర్ అనూహ్య వైపు చూసి నవ్వుతూ.

“ఏం కావాలి?”  అన్నాడు అమోఘ్ కాస్త విసుగ్గా కిటికీ దగ్గరికి రెండు అడుగులు వేస్తూ.

“చందమామ...” అంది ఆ పాప తన చేతులోని భారీ పుస్తకాన్ని ఎత్తి పట్టుకోడానికి విశ్వప్రయత్నం చేస్తూ.

“పుస్తకంలో చందమామ బొమ్మ కనిపించిందా?” అడిగాడు అమోఘ్.

కాదన్నట్టు తల అడ్డుగా ఊపింది.

“మబ్బుల్లో... చందమామ,” అంది అనూ, కుడి చెయ్యి పైకి చాచుతూ. “మబ్బుల్లో ... మరో చందమామ.”

అర్థం కానట్టు ఓ సారి చూశాడు అమోఘ్. ఆ చూపులో విస్మయం, విసుగు రెండూ కలిశాయి.

“నేనిక వెళ్లాలి టీచర్. హెచ్. ఎమ్. గారు పిలుస్తున్నారు,” అంటూ తాన్యా టీచర్ దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాడు.



హెచ్. ఎమ్. గారి గదిలో భ్రమరాంబ చేస్తున్న ఏకపాత్రాభినయానికి హెచ్.  ఒంటరి ప్రేక్షకుడై నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

“”మొన్నగాక మొన్న యూనిట్ టెస్టుల్లో ‘కాంతి సరళరేఖలో ప్రయాణించును అని నిరూపించుటకు ఒక ప్రయోగమును వర్ణించుము,’ అన్న ప్రశ్నకి అదేంటబ్బా... ఓ ప్లాస్టిక్ డబ్బా, కుంకుమ నీళ్లు,...అయినా సైన్స్ ప్రయోగంలో కుంకుమ నీళ్లు ఎందుకండీ చెప్పండి? ఇదేమైనా పేరంటమా?... అది చాలనట్టు ఓ లేజర్ పాయింటరు ... వీటన్నిటితో ఏదో ప్రయోగం చేయొచ్చని రాశాడు. అక్కడితో అయ్యిందా? ఆ

మధ్యన బాయిల్ నియమం గురించి రాయవయ్యా పెద్ద మనిషీ అంటే 'సబ్బు బుడగల' గురించి పది పేజీల పురాణం రాశాడు."

ఒక్క సారి లోతుగా శ్వాస తీసుకుని, హెచ్. ఎమ్. గారి బల్ల మీద ఉన్న గ్లాసుడు నీళ్లు గడగడా తాగేసి ప్రసంగం కొనసాగించింది భ్రమరాంబ.

"ఇందాక క్లాసులో ... చాలా మామూలు ప్రశ్న...'గ్రహాలు ఎన్ని? అవి ఏవి?' అనడిగా నంతే. ఈ రోజుల్లో మూడో క్లాసు వాడిక్కూడా తెలిసిన విషయం. గ్రహాలు ఎనిమిది. ప్లూటో గ్రహం కాదు. ఈ కుర్ర కుంక కాదంటాడే. తొమ్మిదో గ్రహం కొత్తగా వచ్చిందని వాదిస్తాడే? నేను క్లాసులో చెప్పిన పాఠం వినడు, పుస్తకం లో వున్నది తలకెక్కించుకోడు. అక్కడితో ఆగక తన పైత్యం అంతా తక్కిన పిల్లలకి నూరి పోస్తాడు. అతితెలివి ప్రశ్నలు అడక్క నోరు మూసుకు పడి వుండమంటే, అలాగే నని హాయిగా వెనక బెంచీలో కూర్చుని నిద్దరోతాడు. అసలే మన స్కూల్లో సైన్స్ లో నూటికి 50% మించి మార్కులు వచ్చిన విక్రమార్కులు తక్కువ. ఇక తక్కిన పిల్లలు వీడి తలతిక్క పాఠాలు విని, తికమక పడి ఆ ముక్కలే రేపు ఫైనల్స్ లో కూడా రాస్తే... నా పరువేంగాను, మీ పరువేం గాను, ఈ స్కూలు పరువేం గాను? ఇక లాభం లేదు మాస్టారూ? ఈ రోజు వాడి సంగతేంటో తేలిపోవాలి."

అంటూ హెచ్. ఎమ్. గారి అనుమతి కూడా అడక్కుండానే ఆయన ఎదురుగా కూర్చీలో చతికిలబడి తన విశాలమైన మొబైల్ తో తన విశాలమైన ముఖం మీద చెమట విసురుకోవడం మొదలెట్టింది భ్రమరాంబ.

భ్రమరాంబ అంతసేపు ఘోషించిన 'వాడు' అంటే ఎవడో పేరు చెప్పకపోయినా హెడ్ మాస్టారు నరసింహ మూర్తికి అర్థమైపోయింది. భ్రమరాంబకి, అమోఘ్ కి మధ్య తగవు తీర్చడం ఇప్పటికే తనకొక వ్యాపకం అయిపోయింది. నాటకంలో తన వంతు పాత్ర పోషించడానికి సిద్ధం అయ్యాడు.

అంతలో అమోఘ్ హెచ్.ఎమ్. గదిలోకి బెదుర్తూ అడుగు పెట్టాడు. తనని చూడగానే నరసింహమూర్తి ముఖంలో రక్తం చివ్వున పొంగింది. కోపం కేకగా తన్నుకొచ్చింది.

"గెట్ అవుట్!"

ఆ కేకకి ఉలిక్కి పడ్డ భ్రమరాంబ చేతిలోని సెల్ ఫోన్ జారిపడింది. "ఆకాశంబు నందుండి శంభుని శిరం..." అనే పద్యంలో గంగ దివి నుండి అంచెలంచెలుగా భువికి జారినట్టు ఆ సెల్ ఫోన్ ఆమె చేతుల్లోంచి ఒళ్లో పడి తరువాత నేల మీద పడింది.

“ఫో అవతలికి! నీ మొహం చూడాలంటేనే చిరాగ్గా ఉంది నాకు. నెలనెలా ఏంటీ తల నొప్పి నాకు? పోనీ కదా అని ఊరుకుంటున్నాననేగా పేట్రేగిపోతున్నావ్?...”

హెచ్.ఎమ్. గారి తిట్లు, బెదిరింపులు వడగళ్ల వానలా కురుస్తున్నా నిబ్బరంగా తల వంచుకుని నిలబడ్డాడు అమోఘ్. లోపలి నుండీ తన్నుకొస్తున్న ఏడుపుని బలవంతంగా ఆపుకున్నాడు.

అయితే ఆ తిట్లు ఎడారిలో తొలకరి జల్లులా భ్రమరాంబకి ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. తను వచ్చిన పని అయిపోయింది. తనిక ఆనందంగా బయటికి వెళ్లిపోవచ్చు. తనకి ఆనందాన్ని ఇచ్చిన మరో విషయం కూడా వుంది. ఆఖరి చూపులు కూడా దక్కవనుకున్న సెల్ ఫోన్ ఇంకా కొన ఊపిరితో ఉంది. దాన్ని చట్టుకున పైకి తీసి, నెమ్మదిగా తలుపు తీసుకుని ఆ గదిలోంచి బయట పడింది. తలుపు మళ్లీ మూసుకుంది.

తలుపు మూసుకోగానే గది లోపల వడగళ్ల వాన ఎవరో స్విచ్ ఆఫ్ చేసినట్టు ఆగిపోయింది.

ఒక క్షణం క్రితమే నరసింహావతారంలా కనిపించిన హెచ్.ఎమ్. ఇప్పుడు ప్రహ్లాదుడి స్తుతి విన్న నారసింహుడిలా ప్రసన్నంగా మారిపోయాడు. దండకం ఆగిపోయిందేంటని తలెత్తి చూసిన అమోఘ్ తనని చూసి నవ్వుతున్న నరసింహమూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు.

“సారీ అమోఘ్! మీ టీచర్ ముందు చిన్న నాటకం ఆడాల్సి వచ్చింది. మీ టీచరుకి నువ్వు అర్థం కావని తెలుసు. అసలు నాకూ చాలా కాలం నువ్వు అర్థం కాలేదు అనుకో. కాని ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నావు. మా మోటు పద్ధతి చదువులతో నువ్వు ఎలా ఇబ్బంది పడుతున్నావో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.”

అమోఘ్ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. కళ్లజోడు తీసి కళ్లు తుడుచుకున్నాడు. టీచర్ల నుండి తనకి ఎక్కువగా తిట్లు, చీవాట్లు తినడమే అలవాటు. మంచి మాటలు, మెచ్చుకోలు మాటలు వినడం తనకి కొత్తగా వుంది.

“నోనో! బాధపడకు. బళ్లో నీ అనుభవం పూర్తిగా మారిపోయేలా నేను ఏర్పాటు చేస్తాను. మీ టీచర్ కి నెమ్మదిగా నేను బోధపరుస్తాను. కాని అంతవరకు... ఇదుగో ఈ చిన్న బహుమతి నీకోసం...” డ్రాయర్ లోంచి రంగురంగుల కాగితం చుట్టిన ఓ చిన్న పెట్టె పైకి తీశాడు.

“ఏముంది అందులో?” మళ్లీ ఉత్సాహంగా అడిగాడు అమోఘ్.

“నువ్వే తీసి చూడు ఏవుందో.”

చకచకా కాగితం చించి పెట్టెలో వున్న వస్తువుని పైకి తీశాడు అమోఘ్. చూడడానికి అదేదో పెండులమ్ లా వుంది. ఓ కొక్కెం నుండి వేలాడుతోంది. కాని పెండులమ్ లో ఒకే కడ్డీ చివరి ఒక ఇనుప గుండు వేలాడుతుంటుంది. ఇందులో రెండు కడ్డీలు ఒకదానికొకటి తగిలించి వున్నాయి. కింద వున్న కడ్డీ చివర ఇనుప గుండు తగిలించి వుంది.

ఓ సారి ఇనుప గుండుని కదిలించి చూశాడు అమోఘ్. మారని లయతో ఓ పిండిమర లాగా కదిలే పెండులమ్ కి దీనికి మధ్య చాలా తేడా వుంది. ప్రాణం వున్నట్టు చిందులు వేస్తోంది. ఆటవెలదిలా ఆటలాడుతోంది. తకధిమితోం అంటూ తైతక్కలాడుతోంది. దాన్నే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు అమోఘ్.

"ఇదేంటో తెలుసా?" అడిగాడు నరసింహముర్తి.

"ఊహు! ఇలాంటిది ఎక్కడా చూళ్లేదు."

"దీన్ని డబుల్ పెండులమ్ అంటారు. నీకు పెండులమ్ తెలుసుగా?"

"తెలీకేం? మా పాఠంలో వుంది. దాన్ని మొట్టమొదట గెలీలియో కనుక్కున్నాడు."

గెలీలియో గురించి తెలిసిన ఏడో క్లాసు పిల్లవాణ్ణి తన సర్వీసులో ఇదే మొదటి సారి చుస్తున్నాడు ఆ హెడ్ మాస్టరు. ఈ పిల్లవాణ్ని తగిన విధంగా ప్రోత్సహిస్తే స్కూలుకి మంచి పేరు తెస్తాడు.

"దీన్ని మీ క్లాసులో పిల్లలకి చూపించకు. కావాలని ఎగబడతారు. ఇంట్లో నువ్వు చదువుకునే బల్ల మీద పెట్టుకో. ఏదైనా సమస్య వచ్చినప్పుడు దీని వైపు కాసేపు చూడు. బోలెడు ఐడియాలు వస్తాయి."

"థాంక్యూ సర్! థాంక్యూ!"

తన బహుమతిని చొక్కాలో దాచుకుని, క్లాసుకి వెళ్లి ఎవరూ చూడకుండా తన బాక్ ప్యాక్ లో భద్రంగా దాచుకున్నాడు. క్లాసంతా ఖాళీగా ఉండడం వల్ల తన పని సులభం అయ్యింది.

అప్పుడు గుర్తొచ్చింది.

వెంటనే బాక్ ప్యాక్ తీసుకుని మైదానం వైపు పరుగు అందుకున్నాడు.



ఏడో క్లాసు పిల్లలకి లాంగ్ జంప్ పోటీ ఎంపికలు జరుగుతున్నాయి. అందులో ఎంపిక చెయ్యబడ్డ వారిని జిల్లా స్థాయి ఇంటర్ స్కూల్ లాంగ్ జంప్ పోటీలకి పంపుతారు. ఆటల విషయానికి వచ్చేసరికి ఆ క్లాసులో ప్రతాప్ మకుటం వున్న మారాజు. గత మూడేళ్లుగా వాళ్ల బాచ్ లో ఆటల్లో ట్రాఫీల్లో మూడొంతులు పైగా తనే చేజిక్కించుకున్నాడు. తక్కినవాళ్లు ఇక ఎంపికలో పాల్గొనడం  కూడా అనవసరమే నని వాళ్లకి తెలుసు. అలాగని మానేయాలంటే భయం. పోటీ నుండీ తప్పుకుంటే ప్రతాప్ వాళ్ల తుప్పు వదలగొడతాడు. మిగతా వాళ్లు కూడా పోటీలో పాల్గొనాలి, చిత్తుగా ఓడిపోవాలి. ప్రతాప్ కి కావాల్సింది ఇదీ.

కాని అదేం చిత్రమో గాని  ఈ సారి ఎంపికల్లో మామూలుగా ఆటల జోలికి కూడా పోని అమోఘ్ ప్రత్యక్షమయ్యాడు. వరుసలో అందరికన్నా చివర్న నిలుచుకున్నాడు. ఏదో టెన్షన్ లో ఉన్నట్టుగా మాటిమాటికి వెనక్కి తిరిగి ఎటో చూసుకుంటున్నాడు.

శ్రావ్య పక్కనే ఉండి అమోఘ్ కి ధైర్యం చెప్తోంది.

“ఫరవాలేదులే. టెన్షన్ పడకు. ఓడిపోతావు. అంతేగా?”

“అబ్బ! థాంక్స్. నా మీద నీకు  అంత నమ్మకం ఉన్నందుకు,” విసుక్కుంటూ అన్నాడు అమోఘ్. “అయినా నీకు అర్థం కాదులే.” తన తోటి పిల్లలతో మాట్లాడేటప్పుడు “నీకు అర్థం కాదులే” అన్న మాటల్ని ఊతపదాల్లా వాడడం అమోఘ్ కి అలవాటు.

మెత్తని ఇసుక మీద సమాంతరంగా రెండు గీతలు గీశారు. మొదటి గీత వెనుక వరుసగా పోటీలో పాల్గొనే పిల్లలు నించున్నారు. పీటీ టీచర్ గుర్నాథం విజిల్ వెయ్యగానే ఒక్కొక్కరు ముందుకు వచ్చి, మొదటి గీత దాటి, రెండవ గీత దాకా కాలిసత్తువ కొద్ది పరుగెత్తి గెంతుతున్నారు. ఇసుకలో వాళ్ల మడమలు మొదట తాకిన చోటికి, రెండవ గీతకి మధ్య దూరాన్ని ఓ పిల్లవాడు టేప్ తో కొలుస్తున్నాడు. అదీ వాళ్లు గంతు దూరం.

ముందు ప్రతాప్ గెంతాడు. “5  మీటర్ల 22 సెంటీమీటర్లు” అని చాటాడు టేప్ తో కొలిచిన పిల్లవాడు. లేచి మోకాళ్ల మీద మట్టి దులుపుకుని, ఓ సారి వెనక్కి తిరిగి గర్వంగా చూసి పక్కకి నడిచాడు ప్రతాప్.

వెనకే మరి కొంతమంది గెంతారు. 3 మీటర్ల 64 సెంటీమీటర్లు, 4 మీటర్ల 57 సెంటీమీటర్లు. కాని ప్రతాప్ కి అడుగు దూరంలో కూడా ఎవరూ రాలేకపోయారు.

అంతా అయిపోయారు. ఇక చివర్లో అమోఘ్ మిగిలాడు. పీటీ టీచర్ గుర్నాథం విజిల్ వేశాడు. అమోఘ్ లో చలనం లేదు. మళ్ళీ మళ్లీ ఎందుకో వెనక్కి తెరిగి చూసుకుంటున్నాడు. కాని తన వెనుక మరెవ్వరూ లేరు.

""ఏయ్! అమోఘ్. ఏం చేస్తున్నావ్?" అసహనంగా దగ్గిరికి నడిచాడు గుర్నాథం.

అప్పుడు కదిలాడు అమోఘ్. ఝుంఝూమారుతంలా  ముందుకు దూసుకుపోయాడు. రెండవ గీత దగ్గిర పడగానే సాక్షాత్తు వాయుదేవుడే పైకెత్తినట్టు గాల్లోకి లేచి, అల్లంత దూరంలో కొంగలా సున్నితంగా నేల మీద వాలాడు.

"5 మీటర్ల 79 సెంటీమీటర్లు" అని చాటాడు దూరం కొలిచిన టేపు కుర్రాడు.

"నో!" అని అరిచి ప్రతాప్ బలంగా మట్టిలో కాల్తో తన్నాడు. ఇంకా కటువుగా ఏదో అనబోయాడు గాని నోట్లో మట్టి అడ్డుపడింది.

లాంగ్ జంప్ పోటీల్లోకి అమోఘ్ ఎంపిక అయ్యాడు. ఎంపిక అవ్వాల్సిన ప్రతాప్ కసితీరా కథకళి చేశాడు.



స్కూలు బాగ్ భుజానికి తగిలించుకుని స్కూలు బస్టాప్ వైపు నడుస్తున్న అమోఘ్ ని పరుగు మీద వెళ్లి కలుసుకుంది శ్రావ్య.

"అబ్బ! ఏవయ్యింది నీకు. లాంగ్ జంప్ లో ఎప్పుడూ ఆఖర్లో ఉండేవాడివి. ఈ రోజు ఏం మాయ చేశావు?" కళ్లింత చేసుకుని అడిగింది శ్రావ్య.

ఓ సారి చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారో లేరో చూసుకుని, శ్రావ్యకి దగ్గరిగా జరిగి,

"అదో పెద్ద రహస్యం," అన్నాడు అమోఘ్.

"రహస్యమా? ఏంటది? చెప్పవా, చెప్పవా?" ఉత్కంఠ ఆపుకోలేకపోయింది శ్రావ్య.

"అమ్మో! అవన్నీ చెప్పేస్తే ఎలా? ఆ ట్రిక్కులు అన్నీ వాడి రేపు నువ్వు పోటీ గెలిస్తే?"

"అబ్బ! కుళ్లుబోతు తనం. నేను నీకేమీ పోటీ కానులే. అయినా గెలిచినా అమ్మాయిల్లోనేగా గెలిచేది? ఫరవాలేదు చెప్పేసేయ్."

"చెప్తే ఏమిస్తావ్?"

"ఏమిస్తానా?  చేగోడీపొట్లం!  బడాయి చాలుగాని ఇక చెప్పు."

"సరే అయితే. ఇక్కడ చూశావా... ఉండుండి గాలి వీస్తోంది. ఈ గాలి అటు చూడు ఆ  చెట్టు వున్న దిశ నుండి వీస్తుంది," అల్లంత దూరంలో స్కూలు గోడ వద్ద ఉన్న మావిడి చెట్టు వైపు చూపించాడు. "గాలి వీచగానే ముందు ఆ చెట్టు కొమ్మలు కదులుతాయి."

"అందుకా? ఇందాక గెంతే ముందు వెనక్కి వెనక్కి చూసుకుంటున్నావు?"

"భలే పట్టేశావ్," అన్నాడు పళ్లు ఇకిలిస్తూ.

"కాని ఆ గాలికి లాంగ్ జంప్ కి ఏంటి సంబంధం?"

"గాలి తోపుకి పడవలు కదులుతాయని తెలుసుకదా?"

"అవును పాత రోజుల్లో పెద్ద పెద్ద ఓడలకి కూడా  తెరచాపలు ఉండేవి. నేను రాజమండ్రి దగ్గర గోదావరి మీద చూశాను... రాత్రి పూట బోలెడు తెరచాప పడవలు ఒకేసారి నది మీద నెమ్మదిగా కదులుతుంటే..." ఏదో కలలో విహరిస్తూ అంది శ్రావ్య.

"వచ్చేశేయ్... బయటికి వచ్చేశేయ్." మాటల్లోనే కలల లోకాల లోకి పారిపోవడం శ్రావ్యకి, అక్కడి నుండి రక్షించి తిరిగి ఈ భూమ్మీదకి తీసుకురావడం అమోఘ్ కి పరిపాటే.

"సారీ, సారీ. అయితే చెప్పు."

“ఓ సారి ఈ చొక్కా చూడు.”

“ఏవుంది? ఎప్పుడూ వేసుకునే యూనిఫామ్ చొక్కాయేగా? అసలే బక్క ప్రాణివి. దానికి తోడు ఈ తెల్ల చొక్కా. దండెం మీద ఆరేసిన పాత పంచెలా వుందనుకో!” కవ్విస్తూ పకపకా నవ్వింది.

అమోఘ్ తెల్లని బుగ్గలు ఎర్రబడ్డాయి.

“ఛీ! ఇలాంటివి అసలు నీకు చెప్పడం వేస్ట్,” అంటూ వెళ్లిపోబోయాడు.

“మళ్లీ సారీ. ఆగాగు,” అంటూ అమోఘ్ చొక్కా వెనక నుండి లాగింది శ్రావ్య. ఎందుకో చొక్కా చాలా వదులుగా ఉన్నట్టు అనిపించింది.

“అసలు నీకే కాస్త లూజు. నీ చొక్కా కూడా…” అంటూ ఏదో అనబోయి, నాలుక కొరుక్కుని వెంటనే అంది, “అబ్బ! రహస్యం అర్థమయ్యింది. నీ లూజు చొక్కా తెరచాపలా పని చేస్తోంది. అదేనా నీ లాంగ్ జంప్ మహత్యం?”

అమోఘ్ మొహం మీద కోపం, ఉక్రోషం క్షణంలో మాయమయ్యాయి. వెనక్కి తిరిగి శ్రావ్య వైపు చూసి కొంటెగా నవ్వాడు.

అంతలో స్కూలు బస్ వచ్చింది. పిల్లలు అందరూ బుద్ధిగా క్యూ కట్టి బస్సెక్కారు. ఆఖర్లో అమోఘ్ ఎక్కాడు.

తారు రోడ్డు మీద కారుమబ్బు లాంటి దట్టమైన పొగ వదుల్తూ స్కూలుబస్సు ముందుకు కదిలింది.

అంతలో ఓ పాప బస్సు వెనకే  చేతులు ఊపుతూ పరుగెత్తింది. త్వరలోనే బస్సు సందు తిరిగి కనుమరుగయ్యింది. ఆ పాప అక్కడే రోడ్డు మధ్యలో చతికిలబడింది.

బస్సు వదిలిన పొగల మాటున మచ్చలేని ఆ పాప ముఖం కనుమరుగయ్యింది …మబ్బుల్లో చందమామలా.

## 2. ఇల్లే ఒక ప్రపంచం

కీచుమన్న చప్పుడుతో స్కూల్ బస్ ప్రగతినగర్ స్టాపులో ఆగింది. అదే ఆఖరు స్టాపు. బస్సంతా అప్పటికే ఖాళీ అయ్యింది. అమోఘ్ నీరసంగా బయటికి అడుగుపెట్టాడు.

బస్టాపులో రత్న పిల్లల కోసం సిద్ధంగా వుంది. రత్న పదేళ్లుగా వాళ్లతోనే ఉంటోంది. అమోఘ్, అనూల తండ్రి పేరు దినకర్ రావు. వృత్తి రీత్యా సైంటిస్టు. కాన్ఫరెన్సులని, ఉపన్యాసాలని తరచు ఊళ్లు, దేశాలు తిరుగుతుంటాడు. తల్లి ప్రమీల పేరున్న గైనికాలజిస్టు. ఆమె కూడా ఇంటిపట్టున ఉండేది తక్కువే. దూరం నుండీ ప్రమీల ఆదేశాలు ఇస్తుంటే ఇంటి పట్టున ఉండి పిల్లల అవసరాలన్నీ రత్నే చూసుకుంటూ ఉంటుంది.

ఆ రోజు శ్రీ కృష్ణ జన్మాష్టమి. కొత్త బట్టలు కట్టుకుంది. ఎరుపు మీద పసుపుపచ్చ పూలున్న టాప్, లేత ఆకుపచ్చ బాటమ్. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే రత్నలో ఆ రోజు కొత్త కళ కనిపిస్తోంది.

కాని అమోఘ్ అవన్నీ గుర్తించే పరిస్థితిలో లేడు. నీరసంగా తన స్కూల్ బాగ్ రత్న చేతిలో కుదేసి ఇంటి వైపు తిరిగాడు. అమోఘ్ అటు తిరిగాడో లేదో మంచుతునక మీద పడ్డట్టు ఓ తెల్లని దూది పింజ లాంటి ఆకారం తన మీదకి ఉరికి ముఖమంతా నాకేసింది.

“హాయ్ మిట్టీ! నా చిట్టీ! నా బుజ్జీ!” అంటూ మిట్టీని గట్టిగా కావలించుకున్నాడు. మిట్టీ అంటే అమోఘ్ కి ప్రాణం. దాన్నొక కుక్కపిల్లలా కాక చంటిపిల్లలా చూసుకుంటాడు. టెరియర్ జాతికి చెందిన ఆ కుక్క నెల క్రితమే మొదటి పుట్టిన రోజు జరుపుకుంది. ఆ పుట్టినరోజు వేడుకకి తన స్నేహితులని పిలిచాడు అమోఘ్. ఆ సందర్భంలో కుక్కకి, మనిషికి ఉన్న అవినాభావ సంబంధం గురించి మాట్లాడాడు. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనా రంగంలో తొలి దశల్లో కుక్కలు ఎలాంటి పాత్ర ధరించిందీ తన స్నేహితులకి వివరంగా చెప్పాడు.

అలా మిట్టీ అమోఘ్ ఒకరినొకరి నాకుతూ, నిమురుతూ ఆనందిస్తున్న సమయంలో వెనక నుండి రత్న నెమ్మదిగా అంది.

"ఒక్కడివే వచ్చావేం బాబూ? అనూ ఏది?"

రత్న అన్నమాటకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

నెమ్మదిగా తను చేసిన పొరబాటు ఏంటో అర్థమయ్యింది.

"ఓహ్! గాడ్!" తల పట్టుకున్నాడు.

"ఏంటి బాబూ? మర్చిపోయావా?"

తలాడించాడు.

"మీ తాన్యా టీచర్ నీకు గుర్తు చెయ్యలేదా?"

తల మళ్లీ ఆడించాడు.

"మరి నీతో పాటు బస్ లో ఎక్కించుకోలేదా?"

ఈ సారి తల అడ్డుగా ఊపాడు.

"అంటే స్కూల్లోనే ఉండిపోయిందా?"

ఈ సారి రత్న కేసి బింకంగా చూశాడు.

"అమ్మో! అమ్మో! నా బంగారు అనూ! ఎక్కడుందో? స్కూల్లో ఏ గదిలో చిక్కడిపోయిందో? స్కూల్లోనే ఉండిపోతే ఆ తాళాలు వేసేవాడు ఏ గదిలోనో పెట్టి చూసుకోకుండా తాళం వేసేస్తే? అలాంటివి ఎన్ని సినిమాల్లో చూళ్లేదు...ఆ మధ్యన నువ్వు చూపించావే... అదేదో ఇంగ్లీష్ సినిమాలో సరిగ్గా అదేగా జరిగింది. అవును... అప్పుడో దొంగోడు చాకు పట్టుకుని స్కూల్లోకి ప్రవేశిస్తాడు.... అప్పుడే కరెంటు పోతుంది... అమ్మో! అమ్మో! తలచుకుంటేనే గుండెదడ పుడుతోంది బాబూ. అసలే అమ్మగారు, అయ్యగారు ఊళ్లో లేరు.  రేపటికిగాని అమ్మగారు రారు. ఆ మర్నాటికి  గాని అయ్యగారు రారు. నా గతేంగానురో దేవుడో..."

అడ్డు అదుపులేని రత్న శోక స్రవంతికి అడ్డుపడుతూ మిట్టీ వీధి చివరి వరకు వినిపించేలా మొరిగి తన మెడ తాడు విదిలించుకుని రోడ్డుకి అడ్డుగా పరుగెత్తింది.

"అసలే బెంగతో చచ్చిపోతుంటే నీ గొడవేంటే..." అంటూ కళ్లు తుడుచుకుని మిట్టీ పరుగెత్తిన దిశలో చూసింది.

రోడ్డుకి అవతల తనకి కనిపించిన దృశ్యంతో ఆమె ముఖం మీద మళ్లీ చిరునవ్వులు విరిశాయి.

"అనూ! నా బంగారు తల్లీ!" అంటూ మిట్టీ వెంటే రత్న కూడా పరుగెట్టింది.

రోడ్డుకి అవతల అల్లంత దూరం నుండి అనూహ్యని వాళ్ల 'అరుంధతి ఆంటీ' చెయ్యి పట్టుకుని తీసుకొస్తోంది. అరుంధతి వాళ్ల కుటుంబం అనూహ్య, అమోఘ్ లు ఉండే ఇంటికి నాలుగు ఇళ్ల అవతల అదే సందులో ఉంటారు. అరుంధతి కొడుకు కశ్యప్ అనూ క్లాస్ లోనే ఉంటాడు. కశ్యప్ ని తీసుకు రావడం కోసం స్కూల్ కి వెళ్లిన అరుంధతి ఒంటరిగా కనిపించిన అనూ తనతో పాటు తీసుకొచ్చింది.

"ఏంటిది రత్నా? ఇంత అశ్రద్ధ అయితే ఎలా? అనూ సంగతి నీకు తెలుసు కదా?"

రత్న క్షమాపణ చెప్పబోతుంటే అమోఘ్ తనే ముందుకొచ్చి అరుంధతిని పలకరించాడు. తను చేసిన పొరబాటు వల్ల ఆమెకి ఇబ్బంది కలిగినందుకు క్షమించమన్నాడు. అమోఘ్ సంగతి బాగా తెలిసిన అరుంధతి అతడి బుగ్గ మీద చిన్నగా కొట్టి నవ్వి సెలవు తీసుకుంది.

మిట్టీ ఇంటికి దారి చూపిస్తుంటే పిల్లలిద్దరూ రత్న తలో చేయి పట్టుకుని ఇంటిదారి పట్టారు.

ఇంట్లోకి అడుగు పెట్టగానే అందరూ ఎవరి దారిన వారు తలో దిక్కుకీ వెళ్లారు. అమోఘ్ తన బెల్టు, టై ఊడబీకి, సోఫాలోకి విసిరేసి, మేడ మీద తన గది లోకి తుర్రుమన్నాడు.

"బాబూ! ఆగు. నీ బెల్టు, టై అలా సోఫా మీద చూస్తే అమ్మగారు అరుస్తారు!."

పై నుండి స్పందన లేదు. ఒకసారి అమోఘ్ తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు అంటే ఇక అన్యగ్రహ జీవులు భూమి మీదకి దాడి చేసినా కూడా స్పందన ఉండదు.

అనూ కింద అంతస్థులోనే ఉన్న తన గదిలోకి వెళ్లింది. తన స్కూల్ బాగ్ ని తీరుగా డెస్కు మీద ఒక మూల గోడకి ఆన్చుతూ పెట్టింది. డెస్కు మీదే తనకి ఇష్టమైన నెమలి పింఛపు వన్నెల చీర కట్టుకున్న రాకుమారి బొమ్మని చూసింది.

"అయ్యో! నిన్ను ఇక్కడ ఎవరు పెట్టారు?"

అంటూ ఆ బొమ్మని తీసి తన మంచం మీద దిండు మీద ఆ బొమ్మ తల వాలేలా పెట్టింది.

తరువాత తన టిఫిన్ బాక్స్ తీసుకుని నేరుగా వంటగదిలోకి వెళ్లి అక్కడ సింక్ లో పెట్టింది.

రత్న అప్పటికే వంటగదిలో హడావుడి చేస్తోంది.

"అనూ! ఇవాళ క్రిష్టాష్టమి కదా? కాబట్టి నీకు ఇష్టమైన పులిహోర, చక్రపొంగలి, గారెలు చేశాను. నువ్వు చక్కగా అల్లరి చెయ్యకుండా తినేస్తే నేను గుడికి వెళ్ళి వస్తాను. వేణుగోపాల స్వామి గుడి తెల్సుగా?"

అనూ ఆమె మాటలు వినిపించుకోనట్టు వంటగది అంతా పరిశీలనగా చూస్తోంది.

"ఇదుగో తినేసేయ్ మరి," అంటూ పిండివంటలు వడ్డించిన పళ్లెం అనూ చేతులో పెట్టింది రత్న.

"గుప్ షప్" అంది అనూ చెయ్యి పైకెత్తి పట్టుకుని.

"గుప్ షప్ లు కావాలా?" అంది రత్న చెయ్యి చూపిస్తున్న అటక వైపు చూస్తూ. "ఇన్ని వంటలు చేస్తే గుప్ షప్ లు తింటాననటేమేంటమ్మా తల్లీ?ఊహు ఇవాళ పానీపూరీలు వద్దు. మరో సారి. మరి చకచకా తినేశేయ్," అంటూ అనూని పైకెత్తి వంటగదిలో అరుగు మీద కూర్చోబెట్టి ఒళ్ళో పళ్లెం పెట్టింది.

అనూ మరు మాట్లాడకుండా తన పళ్లెంలోని పదార్థాలు తినడం మొదలెట్టింది.

ఇంతలో మరి ఏం అలికిడి అయ్యిందో ఏమో, వెనక్కి తిరిగి తన వెనకే వున్న కిటికీ లోంచి పెరట్లోకి తొంగి చూడాలని ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో ఒళ్లోని పళ్లెం జారి కింద పడిపోయింది. పళ్లెం లోని పదార్థాలన్నీ నేలపాలయ్యాయి.

"అయ్యయ్యో! ఏంటి తల్లీ ఇవాళ్ల ఇంత అల్లరి చేస్తున్నావు?" అంటూ రత్న కింద పడ్డ వన్నీ శుభ్రం చెయ్యడంలో మునిగిపోయింది.

ఇంతలో ఎక్కణ్ణుంచి ఊడిపడిందో ఏమో మిట్టీ వంటగది పక్క నుండి దూసుకెళ్లి తెరిచి వున్న పెరటి తలుపు లోంచి పెరట్లోకి పరుగెత్తింది. అక్కడ మావిడి చెట్టు కింద నిలబడి చెట్టు కొమ్మల కేసి చూస్తూ గట్టిగా మొరగడం మొదలెట్టింది.

"మీట్టీ అరుస్తోంది" అంది అనూ రత్న కేసి చూసి, కురుస్తున్న  వాన గురించి చెప్తున్న వాతావరణ విలేఖరిలా.

"అరిస్తే అరిచిందిలే. దానికదే పని. నువ్వు తినేసేయ్," అంది రత్న కాస్త విసుక్కుంటూ.

అనూ చెయ్యెత్తి పెరట్లో మిట్టీ అరుపులు వస్తున్న దిశలో చూపించింది.

"నాకనవసరం. మీట్టీ మొరిగినా, కరిచినా, నవ్వినా, దగ్గినా నాకనవసరం. ఈ రోజు నువ్వు ఆ పళ్లెంలో వున్నవన్నీ తిన్నాకనే నేను ఇక్కణ్ణుంచి కదిలేది," స్థిరంగా అంది రత్న.

అనూ ఎత్తిన చెయ్యి దించలేదు. ఆ ఇంట్లో అందరూ కాస్త మొండివాళ్లే అయినా తక్కిన వారి అందరి మొండితనాన్ని కలిపినా అనూకి సాటిరారు. ఆ సంగతి రత్నకి బాగా తెలుసు. కాబట్టి ఓ పాచిక విసిరింది.

"ఇక నా వల్ల కాదు బాబోయ్," అంటూ శోకాలు తీయడం మొదలెట్టింది రత్న. "ఎప్పుడో జన్మకోసారి ఏ పండక్కో గుడికి వెళ్దామని ఆశ పడతాను. ఆ రోజే అందరికీ ఏదో వస్తుంది. క్రిష్టమూర్తీ! ఇక నువ్వే చూసుకోవాలి. ఈ లెక్కన ఇంట్లో పనులన్నీ కానిచ్చి, మూడు బస్సులు మారి నీ దర్శనం చేసుకుని తిరిగొచ్చేసరికి తెల్లారిపోతుంది. మరి నన్ను హెలికాప్టర్ లో తీసుకెళ్తావో, విమానంలో తీసుకెళ్తావో, లేకపోతే ఏకంగా రాకెట్ లోనే తీసుకెళ్తావో..."

ఆ శోకాలేవీ పట్టించుకోకుండా అనూ పళ్లెం పక్కన పెట్టి, అరుగు మీంచి కిందకి గెంతి, పెరట్లోకి నడిచింది.

పాచిక పారలేదని గుర్తించిన రత్న తను కూడా పాప వెనకే పెరట్లోకి వెళ్లింది.

"ఏయ్ మిట్టీ! ఏంటా గొడవ? రా ఇలా," మిట్టీ మీద గొంతు చించుకుంది రత్న.

మిట్టీ రత్న దగ్గరికొచ్చి మొరిగింది. మళ్లీ ఆ చెట్టు వద్దకి వెళ్లి మొరిగింది.

“ఏవుందే అక్కడ?” రత్న రెండు అడుగులు ముందుకేసి చెట్టు కొమ్మల వైపు చూసింది. తన కేమీ కనిపించలేదు. కొన్ని సార్లు చెట్ల కొమ్మల మీద పాములు కనిపిస్తాయి. అప్పుడు కూడా మిట్టీ చాలా గొడవ చేస్తుంది. కాని అప్పుడే సూర్యాస్తమయం అవుతోంది. మసక వెలుతురులో చెట్టు గుబుళ్లలో ఏవుందో స్పష్టంగా కనిపించడం లేదు.

“అనూ! నీ కేవైనా కనిపిస్తోందా? నాకేమీ కనిపించడం లేదే,” రత్న అడిగింది.

అనూది చాలా పదునైన చూపు. ఆ చూపే ఓ సారి రత్నని కాపాడింది. ఓ సారి ఇంటి ముందు తోటలో రోజా మొక్కలకి రత్న నీళ్లు పోస్తోంది. పైన రెండో అంతస్థు డాబా మీంచి చూస్తున్న అనూ గట్టిగా కేకలు వెయ్యడం మొదలెట్టింది. రత్న ఉలిక్కి పడి చూస్తే పక్కనే నల్లని తేలు!

అనూ చెయ్యెత్తి ఓ కొమ్మ వైపు చూపించింది.

“ఓహ్, బృందావనమా? ఇంకా ఏంటో అనుకున్నా,” అంది రత్న గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ.

మావిడి చెట్టు మీద పిల్లలు సరదాపడితే చెక్కతో ఓ చిన్న ఇల్లు లాంటిది తయారు చేయించాడు దినకర్ రావు. దానికి పిల్లలు ‘బృందావనం’ అని పేరు పెట్టుకున్నారు.

“అక్కడేం లేదమ్మా,” అంది రత్న నవ్వుతూ. “మీ నాన్నగారు దానికి ఎప్పూడూ తాళం వేసే ఉంచుతారు.”

కాని అనూకి దాంట్లో ఏం విశేషం కనిపించిందో ఏమో అటే చూస్తూ నించుండిపోయింది.

“పద ఇక లోపలికి వెళ్దాం. ఇంకా ఎక్కువ సేపు ఉంటే దోమలు కుడతాయి,” అంది రత్న అనూ చెయ్యి పట్టుకుని లోపలితీసుకెళ్లబోతూ.

అనూ కదల్లేదు. చెయ్యెత్తి మళ్లీ చెట్టు వైపు చూపించింది.

“ఇప్పుడు బృందావనం కావాలా? అమ్మో! ఇంకేవైనా వుందా? రాత్రి పూట అందులో బూచాళ్లు ఉంటారు. కావలిస్తే శని, ఆదివారాలలో మీ నాన్నగారిని అడిగి ఎక్కుదువు గాని,” అంది రత్న అనూ చెయ్యి లాగుతూ.

కాని ఎత్తిన చెయ్యి దింపలేదు. అయితే ఈ సారి పాప చూపిస్తున్నది  బృందావనం కేసి కాదని రత్న గుర్తించింది.

“ఈ రోజు తెగ వేధిస్తున్నావు అనూ! మళ్లీ ఏంటి?” రత్న సహనం చచ్చిపోతోంది.

“చందమామ!” అంది పాప.

“చందమామా? ఎక్కడా? చందమామ అప్పుడే రాడుగా? ఇంకా పూర్తిగా పొద్దుపోలేదుగా.”

“చందమామ” అని మళ్లీ నిశ్చయంగా అంది అనూ.

“అక్కడేం లేదు తల్లీ,” అంటూనే పాప చూపించిన వైపే ఓ సారి పరిశీలనగా చూసింది. అంతలో వీచిన గాలికి కదిలిన ఆకుల మాటున నక్కిన ఓ చిన్న తార కనిపించింది. ఓ ఒంటరి తార.

“ఏంటి నువ్వు చెప్పేది? ఆ నక్షత్రం గురించా?”

అంగీకారంగా తలాడించింది అనూ.

“చందమామ... మబ్బుల్లో...”

“నక్షత్రాన్ని పట్టుకుని చందమామ అంటావేంటి? మీ స్కూల్లో ఇదేనా నేర్పించేది? హన్నా?”

అంటూ కసురుతున్నట్టు నటించింది. “పైగా నీకు మబ్బులెక్కడ కనిపించాయే తల్లీ, ఒక్క చుక్క వానలేక చచ్చిపోతుంటేనూ.”

“చందమామ... చందమామ...” అంటూ ఏడుపు అందుకుంది పాప.

ఇక లాభం లేదని పాపని ఎత్తుకుని బలవంతంగా  ఇంట్లోకి తీసుకొచ్చింది.

“చం ద మా మ... మబ్ బ్ బుల్ లో...” అంటూ పాప తీస్తున్న రాగానికి రత్నకి పిచ్చెక్కేలా వుంది. ఇప్పటికే తనకి ఆలస్యం అవుతోంది. ఎలాగైనా వెంటనే బయటపడాలి. లేకపోతే వచ్చేసరికి మరీ పొద్దుపోతుంది.

మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. పాపకి ఇష్టమైన డిస్నీ చానెల్  పెట్టేస్తే సాధారణంగా ఏడుపు మర్చిపోతుంది.

టీవీ ఆన్ చేసి, పాపని సోఫాలో టీవీ ముందు కూర్చోబెట్టి, మళ్లీ పళ్లెంలో పిండివంటలన్నీ వడ్డించి చేతికిచ్చింది. డిస్నీ ఛానెల్ లో ఆ సమయంలో వస్తున్న 'ఎక్స్ ట్రా టెరెస్ట్రియల్' సినిమా చూస్తూ అనూ తాత్కాలికంగా ఏడవడం మానేసింది.

బయటి తలుపు వేసుకోబోయే ముందు రత్న కింది నుంచే కేకేసింది.

"బాబూ! నేను బయల్దేరుతున్నా. కాస్త పాప మీద ఓ కన్నేసి వుంచు."

ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టు పై నుండి బలహీనంగా "ఊc!,"అని మాత్రం సమాధానం వచ్చింది.


"ఫ్రిడ్జ్ లో అన్నీ వున్నాయి. ఆకలేస్తే వేడి చేసుకుని తిను."

"ఊc!"

"రెండు గంటల్లో తిరిగి వచ్చేస్తా."

ఈ సారి మరి సమాధానం లేదు.

బయటి తలుపు ధబాల్న వేసుకుని బయట చీకట్లోకి అడుగుపెట్టింది రత్న.



స్కూల్ నుండి రాగానే పైన తన గదిలో కెళ్లి తలుపు వేసుకున్న అమోఘ్ కి కింద జరుగుతున్న వ్యవహారం  గురించి తెలియదు. తను ప్రస్తుతం ఉన్న మనోస్థితిలో వాటి గురించి తెలుసుకోవాలన్న ఉత్సాహం కూడా లేదు.

తన నెత్తిన ఇప్పుడు గుదిబండలా మర్నాటికల్లా పూర్తి చెయ్యాల్సిన బయాలజీ ప్రాజెక్టు ఒకటి ఉంది. బయాలజీ మీద ఉన్న ద్వేషం, కసి అంతా లోనుండి పెల్లుబలా తన్నుకొస్తోంది.

"మొక్కల పేర్ల గురించి బయాలజీలో ఇంత హడావుడి ఎందుకో," తనలో తనే గొణుక్కుంటూ అన్నాడు. "సుబ్బారావనో, సుబ్రహ్మణ్యం అనో ఏదో ఒకటి పెడతాం. అవన్నీ ఎందుకు బట్టీ పట్టాలి? ఇంటర్నెట్ లో చూసుకుంటే సరిపోతుందిగా?"

తిట్టుకుంటూనే ఓ పెద్ద తెల్లని చార్టు బల్ల మీద పరుచుకున్నాడు. ఆ చార్టు మీద రకరకాల చెట్ల ఆకులు పరిచాడు. ఆ ఆకులన్నీ ఇప్పుడా చార్ట్ మీద సెలోటేప్ తో అంటించాలి. ఆకుల పక్కనే వాటి శాస్త్ర నామాలు శాస్త్రోక్తంగా రాయాలి.

"ఇంతకన్నా పనికిమాలిన ప్రాజెక్టు ఈ 'విశాల విశ్వం'లోనే ఉండదేమో," సణుక్కుంటూనే పన్లోకి దిగాడు.

ఆ ముందు రోజే రకరకాల చెట్ల ఆకులన్నీ సేకరించి పెట్టుకున్నాడు. తన క్లాసులో తక్కిన పిల్లల లాగా ఆకుల కోసం అడవులు పట్టి పోనక్కర్లేదు. అమోఘ్ వాళ్ల ఇంటి పెరట్లోనే రకరకాల చెట్లు ఉన్నాయి. మావిడి, మునగ, వేప, అరటి, సపోటా,  సీతాఫలం, నారింజ, నందివర్ధనం...  చెట్లకి సంబంధించిన హోమ్ వర్కులు ఉంటే తన మిత్రులు వాళ్ల ఇంటి మీద పడతారు. హోమ్ వర్కు తో సంబంధం లేకుండా కూడా ఎన్నో సెలవుదినాలు పిల్లలు తమ స్నేహితులతో ఆ చెట్ల మధ్య ఎన్నో సరదా ఘడియలు గడుపుతూ ఉంటారు.

"మావిడి ... మాంగీఫెరా  ఇండికా,... మునగ చెట్టు ... మోరింగా ఓలీఫెరా..."

మామూలుగా కోడికెలికినట్టు హడావుడిగా రాసే అమోఘ్, ఆ చార్ట్ మీద మాత్రం వీలైనంత చక్కని దస్తూరీతో మొక్కల పేర్లు రాయడం మొదలెట్టాడు.

ఇంతలో తన మొబైల్ మోగింది. ఆ కాల్ సంతోష్ నుండే అయ్యుంటుంది. మామూలుగా హోమ్ వర్కు ఉన్నప్పుడు తప్పకుండా ఫోన్ చేస్తాడు. ఫోన్ లోనే హోమ్ వర్కంతా చెప్పించుకుని తన సమయం అంతా వృధా చేస్తాడు. కొన్ని సెకన్లు ఆ ఫోన్ ని పట్టించుకోలేదు. ఫోన్ ఆగి కాసేపు అయ్యాక మళ్లీ మోగింది.

ఈ సారి విసుగ్గా ఫోన్ వైపు తిరిగాడు. కాని ఫోన్ స్క్రీన్ మీద 'నాన్న' అన్న అక్షరాలు కనిపించగానే తన విసుగు క్షణాల్లో మారిపోయింది.

"హాయ్ నాన్నా! ఎలా ఉన్నారు?" ఫోన్ తీసుకుని ఉత్సాహంగా అన్నాడు.

"హల్లో చిన్నా! నే బానేవున్నారా. నువ్వు, చంటి ఎలా వున్నారు?" అవతలి నుండి అడిగాడు దినకర్ రావు.

ఇంటర్నేషనల్ కాల్ కావడంతో సమాధానం వచ్చేసరికి రెప్పపాటు కాలం ఆలస్యం అవుతోంది.

"మేం బావున్నాం నాన్నా. రత్న కూడా బావుంది. ఇందాకే గుడికి వెళ్లింది అనుకుంటా. ఇవాళ జన్మాష్టమి కదా?"

"ఓహ్! అవును కదూ. మర్చే పోయాను. సారీరా! పండగ రోజు నేను, అమ్మా ఇద్దరమూ ఇంట్లో లేము."
"ఫరవాలేదు నాన్నా. ముందు మీ కాన్ఫరెన్స్ ఎలా అవుతోంది చెప్పండి?"

వియన్నా నగరంలో ఇంటర్నేషనల్ అస్ట్రానమీ సొసయిటీ నిర్వహించిన ఓ వార్షిక సమావేశానికి ఇండియా నుండి ముఖ్య ఆహ్వానితుడిగా వెళ్లాడు దినకర్ రావు. సౌరేతర గ్రహాల (exoplanets) గురించి సుమారు మూడు దశాబ్దాలుగా గొప్ప కృషి జరుగుతోంది. ఇవి మన సౌరమండలానికి బయట వుండే గ్రహాలు. వీటిలో జీవావిర్భావానికి అనువైన పరిస్థితులు గల గ్రహాల గురించి అన్వేషణ ప్రపంచ వ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతోంది. అలాంటి గ్రహాల మీద జీవరాశులే కాక, మన బోటి ప్రజ్ఞ గల జీవులు ఉంటారేమోని ఎంతో మంది ఆశిస్తున్నారు. మన దేశంలో కూడా ఎంతో మంది శాస్త్రవేత్తలు అలాంటి పరిశోధనలని కొనసాగిస్తున్నారు. వారిలో దినకర్ రావు ఒకడు.

"అద్భుతంగా వుందిరా! ఎంతో విలక్షణమైన అంశాల మీద ప్రసంగాలు. ఎంత విన్నా తనివి తీరదనుకో!"

"ఇంతకీ మీ ప్రసంగానికి ఎలాంటి స్పందన వచ్చింది నాన్నా," అడిగాడు అమోఘ్. సైన్స్ అంటే వల్లమాలిన అభిమానం గల కొడుక్కి ఆ తండ్రి ఎప్పటికప్పుడు తను చేసే పరిశోధనల గురించి చెప్తూ ఉంటాడు. తండ్రి

చేసున్న ప్రయాసలో పాల్గొనకపోయినా, అతడి వైజ్ఞానిక అనుభవాలలో కొడుకు కూడా పరోక్షంగా పాలుపంచుకుంటూ ఉంటాడు.

“బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. నా ప్రసంగం పూర్తి కాగానే ప్రశ్నల వర్షం కురిసింది. ‘త్రిశంకు మీద నిజంగా జీవం ఉందంటారా?’ ‘అక్కడ ప్రజ్ఞ గల జివులు ఉన్నారంటారా?’ ‘వాళ్లని మనం సంపర్కించగలమా?’... ఎన్ని ప్రశ్నలనుకున్నావు?”

దినకర్ రావు కొత్తగా కనుక్కున్న ఓ సౌరేతర గ్రహానికి ‘త్రిశంకు’ అని పేరు పెట్టారు. నిజానికి ఆ పేరు సూచించింది అమోఘే. విశ్వామిత్రుడు సృష్టించిన త్రిశంకు స్వర్గం గురించి అమోఘ్ ఓ సారి ఓ అమర్ చిత్ర కథ పుస్తకంలో చదివాడు. ఆ పేరుని అంతర్జాతీయ ఖగోళ సదస్సు కూడా ఆమోదించింది. మన నుండి 23 కాంతిసంవత్సరాల దూరంలో, మధ్య వయసులో ఉన్న ఓ తార చుట్టూ తిరుగుతున్న గ్రహం అది. పైగా ఆ తార యొక్క గోల్డిలాక్ సీమలో వుందా గ్రహం. అంటే తార నుండి మరీ దగ్గర, మరీ దూరం కాకుండా, శీతోష్ణ స్థితులు మరీ విపరీతంగా లేకుండా, మధ్యస్థంగా ఉన్నాయి. మన బృహస్పతి గ్రహానికి రెండింతల వ్యాసం కలిగి, విశాలమైన నీటి సముద్రాలతో, అద్భుతమైన వన్యసంపదతో ఆ గ్రహం కళకళలాడుతోంది. మొత్తం మీద అక్కడి పరిస్థితులు జీవపరిణామానికి దోహదం చేసేలా ఉన్నాయని దినకర్ రావు నేతృత్వంలో పని చేసిన బృందం కనుక్కుంది.

“నీకు ఇంకో గుడ్ న్యూస్ కూడా చెప్పాలి..” అన్నాడు దినకర్ రావు.

“ఏంటది నాన్నా?” ఉత్సాహంగా అడిగాడు అమోఘ్.

“వచ్చే ఐదారు ఏళ్లలో సౌరేతర గ్రహాలని కనుక్కున్న శాస్త్రవేత్తలలో ఎవరో ఒకరికి నోబెల్ బహుమతి వచ్చే అవకాశం వుందని ఇక్కడ కాన్ఫెరెన్స్ లో అందరూ అంటున్నారు.”

“ఏంటి నాన్నా మీరనేది? మీకు నోబెల్ వచ్చే అవకాశం వుందా?”

“అది చెప్పలేను చిన్నా! కాని ఈ రంగం యొక్క ప్రాముఖ్యత నానాటికి పెరుగుతోందని మాత్రం చెప్పగలను.”

"అబ్బ! మీకే గనక ఆ బహుమతి వస్తే...మన ఇంటికి, ఊరికే కాదు, మొత్తం దేశానికే అంతకి మించిన గుడ్ న్యూస్ వుండదు," ఊహల్లో తేలిపోతూ అన్నాడు అమోఘ్.

"ఇప్పుడే ఆశలు పెట్టుకోకు చిట్టి తండ్రీ! నువ్వు సంతోషిస్తావని, అర్థం చేసుకుంటావని అన్నానంతే. సరే ఇక నేను వెళ్లాలి. అనూని జాగ్రత్తగా చూసుకో. అమ్మ రేపు వచ్చేస్తుంది."

"అలాగే నాన్నా. గుడ్ బై." కాల్ పూర్తయ్యింది.

అమోఘ్ మనసు నిండా ఇప్పుడు ఎన్నెన్నో ఆలోచనలు కిటకిటలాడుతున్నాయి. సౌరేతర గ్రహాలు, ఇతర తారామండలాలు, ఇతర ప్రపంచాల మీద  జీవరాశులు, జీవులు... ఇవన్నీ ఆలోచిస్తూ ఎదురుగా ఉన్న ఆకుల వైపు పరాకుగా చూశాడు. హోమ్ వర్క్ చెయ్యాలంటే ఇప్పుడు బొత్తిగా మూడ్ లేదు. కాని విధిలేక మళ్లీ తన ప్రాజెక్ట్ పన్లోకి దిగాడు.

ఇంతలో మళ్లీ ఫోన్ మ్రోగింది. ఎవరా అని ఉత్సాహంగా చూశాడు. సంతోష్ నుండీ ఫోన్! మనసులో తిట్టుకుంటూనే ఫోన్ తీశాడు.

"ఈ రోజు మాత్రం  ప్రాజెక్ట్  వర్క్ లో సహాయం చేసేదే లేదు," ఫోన్ ఎత్తుతూనే కరాఖండిగా చెప్పేశాడు అమోఘ్.

"అక్కర్లేదులేరా బుజ్జీ," అన్నాడు సంతోష్ అట్నుంచి ఓ వెకిలి నవ్వు నవ్వుతూ. "నేను నిన్ననే మొత్తం చేసేశాగా?"

"అప్పుడే చేసేశావా?" అరిచినంత పని చేశాడు అమోఘ్.

"మరేం? నిన్ననే పాలకొల్లు నుండి మా బాబాయ్ వచ్చాడు. అడిగితే బోలెడంత గడ్డిగాదరా తెచ్చాడు. దాంతో ప్రాజెక్ట్ చిటికెలో అయిపోయింది. నేను ఇప్పుడు ఫోన్ చేసింది అందుక్కాదు."

"మరేం కావాలి?"

"ఈ నెల విశేషం ఏంటో మర్చిపోయావా?"

"ఇది ఆగస్టు నెల. విశేషం ఏవుంది?... స్వాతంత్ర్య దినం వస్తుంది."

"అదికాదోయ్ మిత్రమా. చిన్న క్లూ ఇస్తాను. ఆకాశం..."

“ఆకాశమా? ఆకాశంలో ఏవుంటుంది?...ఇప్పుడు గ్రహణాలేవీ లేవే...”

“ఇంత వెనకబడిపోతావనుకోలేదు” అని నెమ్మదిగా “పెర్సెయిడ్స్ అన్న పేరు ఎక్కడైనా విన్నట్టు గుర్తుందా దోస్త్?”

“ఓహ్! గాడ్! మర్చే పోయాను,” తలపట్టుకున్నాడు అమోఘ్.

సంతోష్ కి కూడా అమోఘ్ లాగానే ఖగోళానికి సంబంధించిన విషయాలంటే ఇష్టం. క్లాసులో పాఠాల విషయంలో అశ్రద్ధ చేస్తాడు గాని, తనకి ఇష్టమైన ఖగోళ శాస్త్రంలో మాత్రం తన వయసుకి మించిన పుస్తకాలు చదువుతుంటాడు.

“అవును కదూ. పెర్సెయిడ్స్ షవర్లు ఈ నెల బాగా కనిపిస్తాయి. ఈ హోమ్ వర్కుల, పరీక్షల గొడవలో పడి ఆ సంగతే మర్చిపోయాను.”

భూమి పక్క నుండి ప్రయాణించే తోకచుక్కల నుండి వెలువడే దుమ్ము, ధూళి భూమి వాయుమండలంలోకి ప్రవేశించినప్పుడు, ఆ రాపిడికి మండిపోతాయి. అలా మండుతూ నేల రాలే రాతి కణాలు కాంతి రేఖల్లా మెరుస్తూ అందంగా కనిపిస్తాయి. వాటినే ఉల్క వృష్టి (meteor showers) అంటారు. ప్రత్యేకించి స్విఫ్ట్-టటిల్ ఉల్క నుండి పడే ఆ కాంతిచినుకులనే పెర్సెయిడ్స్ అంటారు. పెర్సియస్ తారా రాశి ఉన్న దిశ నుండి పడుతున్నట్టు కనిపిస్తుంది కనుక వాటికి అలా పేరు పెట్టారు.

అమోఘ్ కి ఇక తన హోమ్ వర్క్ చెయ్యాలని అనిపించలేదు. మర్నాడు మార్కులు పోయినా, మారణహోమం జరిగినా ఫరవాలేదు. ఇక పర్యవసానాల గురించి ఆలోచించే స్థితిలో లేడు.

ఆలస్యం చెయ్యకుండా అటక ఎక్కి ఓ పొడవాటి పెట్టెని కిందకి దింపాడు. అందులోంచి తెల్లగా నిగనిగలాడే 8 ఇంచిల అపెర్చర్ గల డోబ్సోనియన్ రిఫ్లెక్టర్ టెలిస్కోప్ ని పైకి తీశాడు. మూడేళ్ల క్రితం అంటే అమోఘ్ నాలుగో క్లాసులో ఉన్నప్పుడు వాళ్ల నాన్న అమెరికా నుండి ఆ టెలిస్కోప్ తీసుకొచ్చాడు. చిన్నప్పటి నుండే ఖగోళ శాస్త్రంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న తన కొడుక్కి స్ఫూర్తి నిస్తుందని ముప్పై వేలకి పైగా వెల చేసే ఆ ఖరీదైన టెలిస్కోప్ ని కొనడానికి దినకర్ రావు వెనకాడలేదు.

టెలిస్కోప్ తో పాటు అదే పెట్టెలో దాని ట్రైపాడ్ కూడా వుంది. కాస్త బరువుగా వున్నా ఎలాగో అవస్థ పడుతూ రెండిటినీ బాల్కనీకి మోసుకుపోయాడు. ట్రైపాడ్ యొక్క మూడు కాళ్లని బయటికి లాగి దాన్ని బాల్కనీలో నేల మీద అమర్చాడు. దాని మీద టెలిస్కోప్ ని సెట్ చేశాడు.

ఓ సారి ఆకాశం కేసి చూశాడు. తన అదృష్టం బావుండి ఆ రోజు పెద్దగా మబ్బుల్లేవు. ఆ రోజు అమోఘ్ తన టెలిస్కోప్ ని బయటికి తీస్తాడని ముందే తెలుసుకున్నాయో ఏమో, కంటికి కనిపించే తొమ్మిది వేల తారలు ఆ రాత్రి టంచనుగా వినువీధిలో హాజరు అయినట్టు ఉన్నాయి! నల్లని కొండల మీద తెల్లని పూలు విరిసినట్టు ఆ రోజు తారలన్నీ ప్రత్యేకమైన శోభతో వెలిగిపోతున్నాయి.

అనుభవజ్ఞుడైన ఖగోళజ్ఞుడిలా చురుగ్గా ఆకాశం అంతా ఓ సారి కలయజూశాడు. ముందుగా ఋషుల పేర్లు పెట్టిన, ఏడు తారలు ఉన్న సప్తర్షి మండలం కోసం వెతికాడు. ప్రకాశవంతమైన తారలు గల ఆ నక్షత్ర రాశిని పట్టుకోవడం కష్టం కాలేదు. అక్కడి నుండి కాస్త దక్షిణ-పశ్చిమ దిశలో వెతుక్కుంటూ పోతే ధృవ నక్షత్రం కనిపించింది. అదే దిశలో మరి కాస్త దూరంలో చూస్తే W లేదా M ఆకారంలో ఉండే మరో తారారాశి కనిపించింది. అదే కాసియోపియా. కాసియోపియా పక్కనే కాస్త పలచని కాంతి గల పెర్సియస్ తార మీద అమోఘ్ దృష్టి నిలిచింది.

"దొరికేవురా పెర్సియస్!" అన్నాడు తన టెలిస్కోప్ ని ఆ తారారాశి దిశలో తిప్పుతూ. "గత ఏడాది చేసినట్టు సరిగ్గా ముహూర్త సమయానికి నీ రెక్కల చెప్పులెక్కి ఏ మబ్బు చాటునో దాక్కోవుగా?" గ్రీకు వీరుడు పెర్సియస్ తన రెక్కల చెప్పులెక్కి చేసిన సాహసకృత్యాల గురించి అమోఘ్ చిన్నప్పుడే చదివాడు. ఆ కథలంటే తనకి ప్రాణం.

గత ఏడాది కూడా ఇలాగే ఆగస్టు నెలలో ఓ రాత్రి పెర్సెయిడ్స్ చూద్దామని ఏర్పాట్లన్నీ చేసుకుని కూర్చున్నాడు. కాని కాసేపట్లోనే తెల్లని మబ్బులు క్రమ్మి పడ్డ కష్టం అంతా వృధా అయ్యింది.

పెర్సియస్ తార పరిసరాలలో ఆకాశం అంతా శ్రద్ధగా పరిశీలించాడు. ఎక్కడా తను ఉత్సాహంగా ఎదురు చూసిన ఉల్క వృష్టి జాడ కనిపించలేదు. కాని నిరుత్సాహ పడకుండా ఓ ఐదునిముషాల పాటు టెలిస్కోప్ లోంచి చూస్తూ నించున్నాడు. కాస్త కళ్లు మండినట్టు ఐతే ఓ సారి తలెత్తి, మళ్లీ చూడడం కొనసాగించాడు. అలా మరో ఐదు నిముషాలు చూశాక కనిపించిందది! ఓ ముద్దులొలికే కాంతిచినుకు!

రెప్ప వేసేలోపు ఆకాశ యవనిక మీద ఓ తెల్లని రేఖ గీసి మటుమాయం అయ్యింది. అమోఘ్ ముఖం మీద చిరునవ్వులు విరిసాయి.

మరో పది నిముషాలు గడిచింది. కాంతి వర్షమే కనిపిస్తుంది అనుకున్న అమోఘ్ కి పదినిముషాలకి ఒక బొట్టు కూడా కనిపించకపోవడం కాస్త నిరుత్సాహం కలిగించింది.

చేతి మీద టైమ్ చూసుకున్నాడు. రాత్రి పదిన్నర అవుతోంది. కడుపులో ఎలుకలు ఉరకలు వేస్తున్నా ఆ గొడవ పట్టించుకోలేదు.

పెర్సెయిడ్ వృష్టి ఇంకా ఉధృతంగా కనిపించాలంటే అర్థ రాత్రి కావాలి. కాబట్టి ఇప్పట్నుండి పెర్సియస్ మీద కన్నేసి వుంచడం వృధా.

కాబట్టి టెలిస్కోప్ ని ఇతర ఖగోళవస్తువుల మీదకి మరల్చాడు. అల్లంత దూరంలో ప్రస్ఫుటంగా వెలిగిపోతూ కనిపించింది. గ్రహాలు అన్నిట్లోకి అత్యంత ప్రకాశవంతంగా కనిపించే గ్రహం. తెల్లగా మెరుస్తుంది కనుక దాన్ని 'శుక్ర'గ్రహం అని పిలుచుకుంటాం.  ఏడాదిలో సగకాలం పగలు, సగకాలం రాత్రి కనిపిస్తుంది గనుక దానికి పగటి చుక్క అని, రేచుక్క అని పిలుచుకుంటాం. అందంగా మెరిసిపోతుంది గనుక పాశ్చాత్యులు దానికి రోమన్ల సౌందర్య దేవత అయిన వీనస్ పేరు పెట్టారు.

దట్టమైన మబ్బుల మేలి ముసుగు మాటున ఉండడంతో ఆ 'సౌందర్య దేవత' అసలు భండారం చాలా కాలం వరకు బయట పడలేదు. కాని గత శతాబ్దంలో రూపొందించిన బడ్డ అధునాతన పరిశీలనా పరికరాల సహాయంతో వీనస్ ఉపరితలాన్ని శోధించాక సత్యం నెమ్మదిగా బయటపడింది. 500 డిగ్రీల సెల్షియస్ వద్ద సీసం కూడా కరిగిపోయేటంత మహోగ్రతాపంతో, లోహాన్ని కూడా తరుగదీసే దారుణ సల్ఫ్యూరిక్ ఆసిడ్ వర్షాలతో, ఊపిరితిత్తులని ఉక్కిరిబిక్కిరి చేసేటంత  బలమైన వాయు పీడనంతో ఆ గ్రహం మీద పరిస్థితులు అత్యంత భయంకరంగా ఉంటాయట. ఆ సంగతులన్నీ అమోఘ్ మొట్టమొదట తన తండ్రి దగ్గర్నుండి విన్నాడు. ఆ కథనాలన్నీ విన్నప్పుడు అమోఘ్ కి సైన్స్ తత్వంలో ఒక ముఖ్యమైన విషయం అర్థమయ్యింది. మనకి పైపైన కనిపించే దృశ్యానికి, తెర మాటున సత్యానికి మధ్య ఎంతో తేడా వుంటుంది. అలా పైపై విషయాలతో ఆగిపోకుండా, లోతుగా శోధించి సత్యాన్ని వెలికి తీసేదే సైన్స్.

తరువాత అమోఘ్ తన టెలిస్కోప్ ని సూర్యుడికి అతి దగ్గరిగా ఉన్న గ్రహం వైపు తిప్పాడు. ఎందుచేతనో మరి మన ప్రాచీనులు బుధవారానికి ఆ గ్రహానికి మధ్య సంబంధాన్ని ఊహించి దానికి బుధ గ్రహం అని

పేరుపెట్టారు. అన్ని గ్రహాల కన్నా సూర్యుడికి అతి దగ్గరిగా ఉంటుంది కనుక, అన్నిటి కన్నా సూర్యుడి చుట్టూ అతి వేగంగా తిరుగుతుంది. ఆకాశంలో వేగంగా కదులుతున్నట్టు కనిపిస్తుంది కనుక దానికి పాశ్చాత్యులు రోమన్ల దూత అయిన 'మెర్క్యురీ' పేరు పెట్టారు.

గ్రహాలన్నిటి లోకి చిన్నది కావడంతో భూమి నుండి కాస్త దగ్గరిగానే ఉన్నా ఓ చిన్న తారలా కనిపిస్తుంది మెర్క్యురీ.

అయితే టెలిస్కో ప్ లోంచి చూసినా ఆ గ్రహం మీద పెద్దగా వివరాలేవీ కనిపించలేదు.

పైగా ఒకే భంగిమలో అలా కదలకుండా నించుని చూస్తుంటే నడుములో కాస్త నొప్పి మొదలయ్యింది.

మెర్క్యురీ అనగానే అమోఘ్ మనసు తన తండ్రి దగ్గర్నుండి విన్న మరో కథ మీదకి పోయింది. మెర్క్యురీ కక్ష్యని వివరించే ప్రయత్నంలో అంతకు ముందు న్యూటన్ చేసిన అంచనాలలో దోషాలు ఉన్నట్టు తెలిసిందట. సరైన సిద్ధాంతం ఎలా ఉండాలో ఎవరికీ అంతుబట్టలేదట. అలాంటి పరిస్థితిలో జర్మనీలో ముక్కుమొహం తెలియని ఓ పేటెంట్ ఆఫీసు క్లర్క్ రంగంలోకి దిగి సరైన సిద్ధాంతాన్ని సమకూర్చి, శతాబ్దాల నాటి న్యూటన్ సిద్ధాంతాన్ని తిరగరాశాడట. ఆ క్లర్క్ పేరే ఆల్బర్ట్ ఐన్ స్టయిన్.

ఐన్ స్టయిన్ అంటే దినకర్ రావుకి ప్రాణం. ఆ శాస్త్రవేత్తని ఓ దేవుడిలా కొలుచుకుంటాడు. తన గదిలో మూడు అడుగుల ఎత్తున్న ఐన్ స్టయిన్ పోస్టర్ తగిలించుకున్నాడు. ఆ ఆరాధనాభావం కాస్త అమోఘ్ కి కూడా వంటబట్టింది.

1905 లో అప్పటికి పట్టున 24 ఏళ్లు కూడా నిండని కుర్ర ఐన్ స్టయిన్ నాలుగు పేపర్లు రాసి సైన్స్ లో ఓ గొప్ప విప్లవాన్ని తీసుకువచ్చాడట. అందుకే ఆ ఏడాదిని 'annus mirabilis' (అన్నుస్ మీరాబిలిస్), అంటే మహిమాన్వితమైన సంవత్సరం, అని పిలుచుకుంటారట.

"అన్నుస్ మీరాబిలిస్... " ఆ పదాలు కాసేపు అమోఘ్ మదిలో మెదిలాయి. "అన్నుస్..."

అంతలో ఏదో తన స్మృతి పథంలో హఠాత్తుగా కదిలి ఉలిక్కి పడ్డాడు.

"అనూ!"

చేసిన ఓ పెద్ద పొరబాటు గుర్తొచ్చి "ఓ గాడ్!" అంటూ రెండు చేతులతో తల పట్టుకున్నాడు అమోఘ్.

3. అంధకారంలో అనిశ్చితి

పెర్సెయిడ్ వాన ధ్యాసలో పడి అనూ సంగతి పూర్తిగా మర్చిపోయాడు అమోఘ్. అంతలా ఎలా మర్చిపోయాడో తనకి ఆ క్షణం అర్థం కాలేదు. అప్పటికీ తన మొబైల్ లో ఎనిమిది గంటలకి గుర్తు చెయ్యమని అలారమ్ కూడా పెట్టుకున్నాడు. అనూకి అన్నం తినిపించాలి. ఎంత మారాం చేసిన ఎలాగైనా ఒప్పించి మందు ఇవ్వాలి.  డ్రెస్ మార్చుకోమని చెప్పాలి. కథ చెప్పి నిద్రపుచ్చాలి. పూర్తిగా నిద్రపోయే వరకు పక్కనే ఉండాలి. ఒకసారి అలాగే  కళ్లు మూసుకుని నిద్రపోతోంది కదా అని వాళ్లమ్మ గదిలోంచి బయటికి వచ్చేసింది. అప్పుడు అనూ చేసిన రాద్ధాంతం ఇంతా అంతా కాదు. మళ్లీ నిద్రపుచ్చడానికి అమ్మ, రత్న కలిసి అర్థ రాత్రి వరకు కుస్తీ పట్టవలసి వచ్చింది.

వెంటనే టెలిస్కోప్ ని బాల్కనీలోనే వదిలేసి లోపలికి పరుగెత్తాడు.

బాణంలా తన గదిలోంచి దూసుకుపోయి గదికి అవతలి మూలన ఉన్న మెట్లు దిగడం మొదలెట్టాడు. అది దిగడం అనడం కన్నా జారడం అనడం సబబేమో. అమోఘ్ మెట్లు దిగుతుంటే గాలితెరల మీద సవారి చేస్తూ సున్నితంగా నీటి వైపు దిగుతున్న కింగ్ ఫిషర్ పక్షి గమనంలా ఉంటుంది. అలా దిగడం ఆ  ఇంట్లో తన ఒక్కరికే వచ్చును. అలా దిగినప్పుడల్లా వాళ్లమ్మ తిడుతుంది.

“చిన్నా! ఒళ్లు దగ్గిర పెట్టుకుని మెట్లు దిగమన్నానా!” అని వాళ్ల అమ్మ అరపులు వినడం అమోఘ్ కి చాలా అలవాటు. “అనుకోకుండా జరిగితే ప్రమాదం. కోరి తెచ్చుకుంటే ఆకతాయి తనం.”

“ఏం కాదులే అమ్మా. నువ్వు ఊరికే వరీ అవకు,”  అని నవ్వి ఊరుకుంటాడు. తన తీరు మాత్రం మారదు.

ఈ రోజు అలాగే మెట్ల మీంచి ‘జారు’తూ కిందికి దిగుతున్నాడు.

అంతలో ఓ అనుకోని సంఘటన జరిగింది.

ఇప్పటికే దేశంలో ఎన్నో ప్రాంతాల్లో కరెంటు కోత అన్న మాట అరుదుగా వినిపిస్తోంది. ఎప్పుడో వేసవి తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో తప్ప, అదీ నగరాల్లో కరెంటు కోత ఇంచుమించు అసంభవం

అనుకునే రోజులివి. అలాంటిది అమోఘ్ మెట్లకి నడి మధ్యలో ఉన్న క్షణంలో హఠాత్తుగా కరెంటు పోయింది.

ఎదురుగా ఏవుందో కనిపించలేదు. కాలు జారింది. మెట్ల మీద పట్టు సడలింది. జారుడు కాస్తా దొర్లుడుగా మారింది. బంతిలా మెట్లమీద దొర్లుకుంటూ  కింద అంతస్థు చేరుకున్నాడు. ఆ దొర్లుడు కింద టీవీ గదిలో సోఫాకి గుద్దుకున్నంత వరకు ఆగలేదు.

“అబ్బా!” అని బాధగా మూలిగాడు.

నెమ్మదిగా లేచి తల విదిలించుకున్నాడు. ఒళ్లు విరుచుకున్నాడు. చేతులు, కాళ్లు చాచుకుని చూసుకున్నాడు. అంతా బానే వుంది. ఆంబులెన్స్ అక్కర్లేదు.

అంతలో ముఖానికి ఏదో తడితడిగా తలిగింది. పక్కకి తోయబోతే భౌమని అరిచింది.

“మీట్టీ!” అని అరిచి ఆ టెరియర్ ని గట్టిగా కౌగిలించుకున్నాడు. కనీసం నోరులేని ఆ ప్రాణి తోడైనా వుంది. మనసులో భయం కాస్త  తగ్గినట్టు అనిపించింది.

వెంటనే తన తక్షణ కర్తవ్యం గుర్తొచ్చింది.

“అనూ” అని అరిచాడు.  సమాధానం లేదు.

“చంటీ! ఎక్కడున్నావ్?” మళ్లీ అరిచాడు. ఈ సారి కూడా ఏ స్పందనా లేదు.

అమోఘ్ గుండె వేగం పెరిగింది.

అనూ గదివైపుగా ఒక్కసారి లంఘించాడు. కాని కదలబోయి  ముందుకి తూలి పడ్డాడు. తన పాదం నేల మీద కాక ఏదో కదిలే వస్తువు మీద పడింది. కీచు మని చెవులు చిల్లులు పడేలా అరుస్తూ, కళ్లు జిగేలు మనే కాంతులు చిందుతూ ఏదో వేగంగా కదిలింది.

అది అనూ ఆడుకునే ఫైర్ ఇంజిన్ బొమ్మ!

“ఆడుకున్నాక బొమ్మలు నేల మీద వదిలేయొద్దని చెప్పానా?” అని వాళ్ల అమ్మ అనూని పదే పదే మందలిస్తూనే ఉంటుంది. కాని  ఆ ఇంట్లో పిల్లలే కాదు, పిల్లల బొమ్మలు కూడా స్వేచ్ఛావాయువులు పీలుస్తూ, అడ్డుఅదుపు లేకుండా ఇల్లంతా స్వైరవిహారం చేస్తుంటాయి.

ఇప్పటికే రెండు సార్లు నెత్తికి బొప్పి కట్టాక అమోఘ్ గమనం కాస్త మందగించింది. కష్టపడి పైకి లేచి అన్ని పక్కలా చూశాడు. అనూ గది ఎటుందో తనకి అర్ధం కాలేదు. కింది గదిలో టార్చ్ లైట్  ఎక్కడుందో తనకి తెలీదు. తన మొబైల్ ని ఆ హడావుడిలో పైన తన గదిలో వదిలేశాడు. మళ్లీ పైకి వెళ్లే ధైర్యం చెయ్యలేదు.

కింద గదిలో టార్చ్, కొవ్వొత్తి, అగ్గిపెట్టె మొదలైనవి ఎక్కడున్నాయో రత్నకే తెలుస్తాయి.  రత్న అన్నీ చాలా జాగ్రత్తగా దాస్తుంది. కనుక ఇంట్లో ఏది ఎక్కడ వుందో తనకి తప్ప ఎవరికీ తెలీదు. ఒక్క రోజు రత్న శెలవు పెట్టి వాళ్ల సొంతూరికి వెళ్లి వస్తే ఇంట్లో జరిగే గందరగోళం ఇంతా అంతా కాదు.

ఇంతలో వీధి తలుపు మీద ఎవరో ధబధబా మోదుతున్న చప్పుడు.

అమోఘ్ కి వెన్నులోంచి చలి బయల్దేరింది. భయంతో ముఖమంతా చెమటలు పట్టాయి. తల్లిదండ్రులు ఇంట్లో లేకుండా పిల్లలు రత్న తోడుగా గడిపిన సన్నివేశాలెన్నో. కాని ఈ సమయంలో తల్లిదండ్రులు లేరు. ఎప్పుడూ కంటికి రెప్పలా ఉండే రత్న కూడా లేదు. ఎప్పుడు వెళ్లిందో తెలీదు. ఎప్పుడు వస్తుందో తెలీదు. అన్నిటి కన్నా ముఖ్యంగా అనూ ఎక్కడుందో తెలీదు. అసలు ఉందో లేదో…

తలుపు మీద మళ్లీ బాదిన చప్పుడు. సోఫా వెనుక నక్కి కూర్చున్నాడు అమోఘ్. ఇంతలో తలుపు భళ్లున తెరుచుకుంది. ఇంకా బాగా ఒదిగి కూర్చున్నాడు. అంతలో మిట్టీ అరవడం మొదలెట్టింది. మామూలుగా ఇంటికి కొత్త వాళ్లు వస్తే అరుస్తూ లోపలికి పారిపోవడం ఆ కుక్కకి అలవాటు. ఈ సారి మాత్రం అక్కడే ఉండి తన ప్రతాపం చూపించింది.

“బాబూ! అనూ!” ఆ కేకకి అమోఘ్ కి ప్రాణం లేచొచ్చినట్టయ్యింది.

“రత్నా! నేను… ఇక్కడ…” ఉన్న చోటే లేచి నించుని అరిచాడు అమోఘ్.

“ఏంటి బాబూ? కరెంటు ఎప్పుడు పోయింది?” తలుపు దగ్గరే ఆగి అరిచింది రత్న.

“ఇందాకే. పది నిముషాల క్రితం…”

“అనూ నిద్రపోయిందా?”

“అదీ… అదీ…” నీళ్లు నమిలాడు అమోఘ్.

“ఏంటి బాబూ? అనూ ఎక్కడుంది?”

అంతలో తలుపు దగ్గరే ఓ వెలుగు వెలిగింది. ఆ వెలుతురులో రత్న ప్రత్యక్షమయ్యింది. వీధి తలుపు పక్కనే కిటికీలో ఎప్పుడూ ఒక అగ్గిపెట్టె, కొవ్వొత్తి దాచి పెడుతుంది రత్న.

రత్న కనిపించగానే పరుగెత్తు కెళ్లి ఆమెని కౌగిలించుకున్నాడు అమోఘ్.

“నాకు… భయంగా వుంది రత్నా!” అన్నాడు వణికే స్వరంతో.

“ఏం కాలేదు బాబూ! కరెంటు వచ్చేస్తుందిగా. నేను వెళ్లి ఉండకపోవాల్సింది. అయినా ఈ దిక్కుమాలిన కరెంటు ఇవాళే పోవాలా?” తన ధోరణిలో ఈ సమస్యంతటికీ కారణం విద్యుత్ సరఫరా బోర్డు వారిదే నన్నట్టు రకరకాలుగా శాపనార్థాలు పెట్టింది.

“ఇంతకీ అనూ ఏవయ్యింది బాబూ?”

“నేనూ ఇప్పుడే కిందకి వచ్చా రత్నా. ఇంతలో కరెంటు పోయింది.”

“పద తన గదిలో చూద్దాం రా,” అంటూ రత్న అమోఘ్ చెయ్యి పట్టుకుని కొవ్వొత్తి కాంతిలో దారి తెలుసుకుంటూ అనూ గదిలోకి అడుగుపెట్టింది.

గదిలో పక్క ఖాళీగా వుంది. ఆ పక్క మీద అనూకి ఇష్టమైన నెమలిపింఛం చీరకట్టుకున్న  బొమ్మ మాత్రం వుంది. గది అంతా ఇద్దరూ కలయజూశారు. ఎక్కడా అనూ జాడ లేదు.  కొన్ని సార్లు అలిగినా, భయపడినా మంచి కింద దాక్కుని అలాగే నిద్రపోతుంది. రత్న మంచం కింద చూసింది. అక్కడా అనూ కనిపించలేదు.

రత్నకి ముచ్చెమటలు పోశాయి.

“ఎక్కడికి వెళ్లి ఉంటుందబ్బా?” ఆలోచిస్తూ బయటికి అంది.

“టీవీ గదిలో ఉంటుందా? టీవీ చూస్తూ అక్కడే నిద్రపోయిందేమో?” అన్నాడు అమోఘ్.

“ఇందాక అట్నుంచే కదా  వచ్చాం.”

టీవీ గదిలో ఎవరూ కనిపించలేదు.

కాస్త దూరంలో డైనింగ్ టేబుల్ ఉన్న చోట వెతికారు. రత్న వంటగదిలోకి వెళ్ళి చూసింది.

డైనింగ్ టేబుల్ కి అవతల పెరడు కనిపించేలా పెద్ద గాజు తలుపుల దగ్గరికి వెళ్ళి పెరట్లోకి చూశాడు అమోఘ్. సన్నని వెన్నెల కాంతిలో గాలికి ఊగే చెట్ల కొమ్మల నీడలు తప్ప పెద్దగా మరేమీ కనిపించలేదు.

అంతలో కాలికి ఏదో తెలిగినట్టయ్యింది. వంగి చేతుల్లోకి తీసుకుని చూశాడు. ఏదో నగ లాగా వుంది.

"ఇది అనూదా రత్నా?" రత్నకి చూపిస్తూ అడిగాడు.

దాన్ని జాగ్రత్తగా చూద్దామని కొవ్వొత్తి పైకెత్తింది రత్న. అంతలో కొవ్వొత్తి ఆరిపోయింది.

"వెధవ కొవ్వొత్తి" అని తిట్టుకుంటూ వంటగదిలోకి వెళ్ళి టార్చ్ లైటు తెచ్చింది రత్న.

అది అనూ కట్టుకునే వెండి గజ్జెల్లో ఒకటి. పెరటి వైపు గాజు తలుపుల వద్ద దొరికింది.

"కొంపదీసి పెరట్లోకి గాని వెళ్లలేదు కద?" భయపడుతూనే అంది రత్న. ఆమె కంఠంలో వణుకుని అమోఘ్ గుర్తించకపోలేదు.

ఇంట్లో వాళ్ల మీద అలిగితే అన్నూ పెరట్లోకి వెళ్ళి చెట్ల వెనుక దాక్కున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కాని ఇంత అర్థరాత్రి వేళ అలాంటి సాహసం చేస్తుందా?

"ఇందాక అన్నం పెడుతుంటే పెరట్లోకి వెళ్తానని మారాం చేసింది. నేనే బలవంతం చేసి లోపలికి తెచ్చేశాను," సాయంత్రం జరిగిన సంఘటనలు గుర్తు తెచ్చుకుంటూ అంది రత్న. "ఆ కోపం మీద మళ్ళీ..."

గాజు తలుపుని పక్కకి లాగుతూ రత్న, అమోఘ్ లు పెరట్లోకి అడుగుపెట్టారు.

తలుపు తెరవగానే మిట్టీ తుర్రుమని పెరట్లోకి ఉరికింది.

పెరట్లో చెట్ల ఆకుల మధ్య నుండి వీచే గాలి వేసే ఊళలు తప్ప మరో శబ్దమే వినిపించడం లేదు. రత్న టార్చి లైట్ కాంతిలో చుట్టూ చూసింది. సపోటా చెట్టు మీద కాంతి పడగానే నిద్రాభంగం అయిన ఓ గండు పిల్లి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ కేక వేసి చెంగున పెరటి గోడ మీదకి గెంతి అవతల చీకట్లో అదృశ్యమైపోయింది.

ఎక్కడా అనూ ఆనవాళ్లు కనిపించలేదు. ఇంతలో మిట్టీ మావిడి చెట్టు కింద నించుని మొరగడం మొదలెట్టింది.

"మిట్టీకి అక్కడ ఏదో కనిపించినట్టు ఉంది," అంటూ రత్న వేగంగా అటువైపు అడుగులు వేసింది. వెనకే అమోఘ్ కూడ కదిలాడు.

మిట్టీ కింద దేన్నో వాసన చూస్తోంది. రత్న దగ్గరికెళ్లి అక్కడ టార్చ్ వేసి చూసింది. ఏదో బాడ్జ్ లాంటిది పడి వుంది.

"బాబూ! ఇది మీ స్కూలు బాడ్జ్ కాదుగా?"

"అలా లేదే," అన్నాడు అమోఘ్ దాన్ని చేతిలోకి తీసుకుంటూ. అలాంటి చిత్రాన్ని ఎక్కడా చూళ్లేదు. అందులో ఓ వృత్తం వుంది. దాని పైన, కింద, కుడి పక్కన, ఎడమ పక్కన మబ్బులని పోలిన చిత్రాలు ఉన్నాయి. దాని ముందు అడ్డుగా రెండు బాణపు గుర్తులు ఉన్నాయి. ఒకటి కుడి నుండి ఎడమకి సూచిస్తే, మరొకటి ఎడమ నుండి కుడి పక్కకి సూచిస్తోంది. ఆ చిత్రమైన చిత్రాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు అమోఘ్.

"ఏంటీ బాడ్జి? ఎక్కడి నుండి వచ్చి ఉంటుందబ్బా?" అంది రత్న.

చెట్టు కింద నించుని కొమ్మల్లోకి టార్చ్ వేసి చూసింది. పైన ఏమీ కనిపించలేదు. ఒక్క 'బృందావనం' తప్ప. మిట్టీ పైకి చూసి ఆగకుండా మొరుగుతోంది.

"మిట్టీ! ఏంటే నీ గొడవ? కాస్త ఆపు," విసుక్కుంది రత్న. మిట్టీ ఆపలేదు.

ఈ సారి 'బృందావనం' మీద టార్చి వేసి కాస్త పరిశీలనగా చూసింది.  ఎప్పుడూ తాళం వేసి ఉండే ఆ పొదరింటి తలుపు తెరిచి వుంది!

ఇంతలో ఏదో నల్లని ఆకారం తెరిచిన 'బృందావనం'  తలుపు లోంచి బయటికి దూసుకొచ్చి, చెట్టు కొమ్మల్లోంచి చప్పుడు చేయకుండా మెరుపులా కదులుతూ పెరటి గోడ మీంచి అవతలికి దూకింది.

"ఏయ్ అమోఘ్! అటు చూడు. ఏంటది?" అడిగింది.

“అది… పిల్లి లాగా లేదు.” రెప్పపాటులో మాయమైన ఆ వస్తువు ఏంటో కనిపెట్టలేక తెప్పరిల్లుతూ అన్నాడు అమోఘ్. “పిల్లి కన్నా బాగా పెద్దగా ఉంది. కుక్క అయ్యే అవకాశం లేదు. కుక్కలు చెట్లు ఎక్కలేవు.”

ఇంకా మొరుగుతూనే ఆ జంతువు వెళ్లిన దిశలో ఉరికింది మిట్టీ. దాని వెంటనే రత్న, అమోఘ్ లు పెరటి గోడ  వైపుగా పరుగెత్తారు.

పెరటి గోడకి అవతల ఓ మైదానం ఉంది. ఆ మైదానంలోకి ప్రవేశించడానికి పెరటి గోడలో ఉన్న ఓ తలుపు లోంచి వెళ్లాలి. ఎప్పుడూ తాళం వేసి ఉండే ఆ తలుపు కూడా ఇప్పుడు తెరిచి వుంది. బలంగా వీస్తున్న గాలికి ఆ తలుపు టపటపా కొట్టుకుంటోంది. తెరిచిన తలుపుల్లోంచి మిట్టీ మైదానం లోకి పరుగెత్తింది.

మిట్టీ ముందు దౌడు తీస్తుంటే వెనుకగా అమోఘ్, రత్నలు పరుగెడుతున్నారు. అంత వేగంగా పరుగెత్తడం అలవాటు లేక రత్న రొప్పుతూ అమోఘ్ ని అనుసరిస్తోంది.

ఇంతలో ఓ బ్రహ్మాండమైన శబ్దం వినిపించింది. భూకంపం వచ్చినట్టు నేల దద్దరిల్లింది. రత్న, అమోఘ్ లు తూలి కిందపడ్డారు. వేగంగా పరుగెడుతున్న మిట్టీ ఆ దెబ్బకి భయంగా వెనక్కు పరుగెత్తుకు వచ్చింది.

కింద పడ్డ రత్న, అమోఘ్ లు క్షణాల్లో తేరుకుని శబ్దం వచ్చిన వైపు చూశారు. అప్పుడు వాళ్లకి కనిపించిన దృశ్యానికి బిత్తరపోయి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు.

చీకటిని ఛిన్నాభిన్నం చేస్తూ వారి కళ్ల ఎదుట ఓ బ్రహ్మాండమైన కాంతివిస్ఫోటం జరిగింది. ఆకాశం నల్లని నోరు తెరిచి నిప్పులు కక్కుతున్నట్టు అగ్నివరదలై ప్రవహించింది. ఆ అగ్నిధారల అభిఘాతాలకి పరిసరాలు మారుమ్రోగిపోయాయి. నేల ప్రకంపించింది.

తాళలేని ఆ శబ్దానికి చెవులు మూసుకున్నారు. గుండెలో దడ పుట్టించే ఆ దృశ్యాన్ని స్థాణువై చూస్తూ ఉండిపోయారు అమోఘ్, రత్నలు. అంతవరకు ఆవేశంగా మొరిగిన మిట్టీ కూడా కాసేపు మూగదైపోయింది.

నెమ్మదిగా ఆ అగ్నినదులు నేల నుండి దూరం అవుతున్నాయి. నాలుగు అగ్ని ప్రవాహాలు మెల్లగా ఆకాశంలోకి లేస్తున్నాయి.

ఆ వింత కేసి పరిశీలనగా చూస్తూ ఉండిపోయాడు అమోఘ్. ఆ జ్వాలా పథాల మీద ఓ నల్లని ఎత్తైన ఆకారం లీలగా కనిపించింది. ఆ అగ్నిధారలు అందు లోంచే వస్తున్నాయి.

“రాకెట్!” గావుకేక పెట్టాడు అమోఘ్. “అది రాకెట్!” ఉద్రేకంగా అన్నాడు దాని వైపు చేత్తో సూచిస్తూ.

“ఏంటి బాబూ నువ్వనేది! రాకెట్ ఏంటి మనింటి వెనుక గ్రౌండులోకి రావడమేమిటి? నాకేమీ అర్థం కావడంలేదు...” అంది తల పైకెత్తి దూరం అవుతున్న ఆ జ్వాలలనే చూస్తూ.

ఆ ఆకారం కేంద్రంలో ఎర్రని కాంతితో ఓ విచిత్రమైన చిహ్నం మెరుస్తోంది. ఓ చక్రం మీద నాలుగు పక్కలా మబ్బులాంటి ఆకారాలు. ముందు రెండు బాణపు గుర్తులు. అమోఘ్ ఉలిక్కిపడి తన అంతవరకు తన చేతిలో పట్టుకున్న బాడ్జ్ కేసి చూసుకున్నాడు. వెన్నెల కాంతిలో ఆ బాడ్జ్ మీద వున్న హోలోగ్రామ్ చిహ్నం మెరిసింది. అచ్చం రాకెట్ మీద చిత్రం లాగే వుంది. అమోఘ్ పిడికిలి ఆ బాడ్జ్ చుట్టూ బిగుసుకుంది.

ఇప్పుడు వాళ్లు నించున్న మైదానం ఓ వైద్య కళాశాలకి చెందిన క్రీడా స్థలం. అక్కడ రోజు కాలేజి పిల్లలు క్రికెట్ ఆడుకుంటుంటారు. చిటారు కొమ్మ మీద ఏనుగు వాలడం ఎంత సంభవమో, అక్కడికి రాకెట్లు, విమానాలు రావడం అంతే సంభవం. ఎప్పుడో ఓ సారి కళాశాల వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు మాత్రం అక్కడ ఓ హెలికాప్టర్ వాలింది.

“అయినా ఒకటడుగుతాను బాబూ! ఆ మధ్యన ఈ కాలేజిలో ఏదో పండగ జరిగితే ముఖ్యమంత్రి గారు హెలికాప్టర్ లో వచ్చారు గుర్తుందా? అంతవరకు బానే వుంది గాని, ఏకంగా రాకెట్ లో ఎవరు వస్తారు? రాకెట్ లో తీసుకురావలసినంత గొప్పోళ్లు ఎవరుంటారు?” అని, ఇంతలో తన మెదడులో ఏదో తళుక్కుమంటే మళ్ళీ అంది, “కొంపదీసి మన ప్రధానమంత్రిగార్ని ఆ రాకెట్లో తీసుకురాలేదు గద!”

అప్పటికే చీకటి ఆకాశంలో ఓ చిన్న ఎర్రని చుక్కలా మారిన ఆ రాకెట్ మీద నుండి దృష్టి మరల్చకుండా అన్నాడు అమోఘ్, “అది వచ్చింది తీసుకురావడానికి కాదు రత్నా... తీసుకుపోవడానికి.”

“అంటే...” కాసేపు అవాక్కయ్యింది రత్న. “అంటే... అనూని...” అంటూ మాయమౌతున్న రాకెట్ కేసి వేలితో చూపించింది.

ఆకాశంలోకి తదేకంగా చూస్తున్న అమోఘ్ కళ్లలోంచి జరజర అశ్రువులు జారాయి.

అంతలో మిట్టీ గొంతుకి కూడా మళ్లీ ప్రాణం వచ్చింది. రాకెట్ అంతకు ముందు వాలిన చోటి వైపుకి పరుగు అందుకుంది.

“ఓరి నాయనోయ్! రక్షించండి, రక్షించండి. మా పాపని ఎవడో సచ్చినోడు గద్దలా తన్నుకుపోతున్నాడు దేవుడో!” అంటూ రత్న కూడా లబోదిబో మంటూ ఆ దిశలో పరుగెత్తింది.

అంతలో మీట్టీ ఓ పది అడుగులు ముందుకు పరుగెత్తిందో లేదో మళ్లీ కుయ్యో మంటూ వెనక్కి తిరిగి పరుగెత్తుకు వచ్చింది.

వేగంగా అడుగులేసిన రత్న కూడా కాస్త ముందుకి వెళ్లాగానే “అబ్బా!” అని అరిచి ఆగిపోయింది. నేల అంతా వేడెక్కిన పెనంలా కాల్తోంది.

“రత్నా! ఆగు. రాకెట్ మంటకి నేలంతా బాగా వేడెక్కి ఉంటుంది,” వెనక నుండి అరిచాడు అమోఘ్.

రత్న వెనక్కు పరుగెత్తుకు వచ్చింది. దూరమవుతున్న రాకెట్ ని చేత్తూ చూపిస్తూ కేకలు పెట్టింది,

“అనూ పాపని ఆ రాకెట్ లో పట్టుకుపోతున్నారు బాబూ! చూడు బాబూ. పాప మనకి దూరం ఐపోతోంది. పద బాబూ ఏదో ఒకటి చేద్దాం,” అమోఘ్ భుజాలు పట్టుకుని కుదిపేస్తూ అంది రత్న.

అమోఘ్ మాత్రం దూరమవుతున్న రాకెట్ కేసి కన్నార్పకుండా చూస్తూ నించుండిపోయాడు. రత్న మాటలకి అతడి నుండి ఏ స్పందనా లేదు.

“మాట్లాడవేం బాబూ? పద పోలీసులకి చెప్దాం. పోనీ పోలీసులు పనికిమాలినోళ్లు అనుకుంటే మన పక్కింటి మిలిటరీ ఆయనకి చెబ్దాం. ఆయన ఇంట్లో పొడవాటి తుపాకి వుందిగా? దాంతో ఆ దొంగవెధవలని కాల్చేసి అనూని రక్షిస్తాడు.”

అమోఘ్ కళ్లలోని కన్నీరు కళ్లలోనే నిలిచిపోయింది. ఆ కళ్లలో మునుపటి భయం, బాధ ఇప్పుడు లేవు. ఒక రకమైన తీవ్రత, తీక్షణత ఆ కళ్లలో చోటుచేసుకున్నాయి.

చెయ్యి పైకెత్తి ఎర్రటి చుక్కలా ఆకాశంలో మెరుస్తున్న రాకెట్ కేసి చూపిస్తూ అరిచాడు.

“భయపడకు అనూ! నేను నిన్ను రక్షిస్తాను... ఎలాగైనా సరే.”

చీకటి ఆకాశంలో అంతవరకు కనిపించిన ఎర్రని చుక్క మాయమయ్యింది.

అతడి మనసులో ఆలోచనలు స్తంభించిపోయాయి. పక్కనే రత్న వెక్కి వెక్కి ఏడవడం వినిపిస్తున్నా ఆమెని ఓదార్చే ప్రయత్నం కూడా చెయ్యలేదు. ఏమని ఓదారుస్తాడు? ముందు తనని ఓదార్చేది ఎవరు? అంతకన్నా ముందు దిక్కు మొక్కు లేకుండా అంత పెద్ద సంకటంలో ఇరుక్కున్న అనూ పాపని పాపం ఓదార్చేది ఎవరు?

అంతవరకు దవడలు నెప్పి పుట్టేలా మొరిగిన మిట్టీ నోరు కూడా కాసేపు మూతపడింది.

అంతలో  మైదానంలో మరో దిశ నుండి ఓ పెద్ద శబ్దం వినిపించింది. ఇది మునుపటి శబ్దం లాంటిది కాదు. ఓ పెద్ద యంత్రం పని చేస్తుంటే పుట్టే కంపన లాంటిదిది.

కళ్లు తుడుచుకుని ఆ శబ్దం వస్తున్న వైపు  చూశాడు అమోఘ్. వెన్నెల కాంతిలో ఆ పక్కన కొబ్బరి చెట్ల మాటున ఓ నిర్మాణం ఏదో కనిపించింది. తగరపు రేకులతో చేసిన షెడ్డులాంటిదిలా వుంది. అంతకు ముందు మైదానంలో క్రికెట్ ఆడుకుంటున్నప్పుడు ఆ షెడ్డు ని చూసినట్టు గుర్తు. కొన్ని సార్లు ఎత్తయిన అపార్ట్ మెంట్ లు కట్టినప్పుడు ఆ ప్రదేశం చుట్టూ తగరపు రేకులతో తాత్కాలికంగా ప్రహరీ గోడలాంటిది నిర్మిస్తారు. ఇది కూడా అలాంటిదే అనుకుని ఊరుకున్నాడు అమోఘ్. కనీసం ఏడు అంతస్థుల భవనం పట్టేటంత ఎత్తుగా ఉన్నాయి ఆ తగరపు గోడలు.

రేకుల దగ్గర్నుండి వస్తున్న కంపన అంతకంతకు తీవ్రం అవుతోంది. పైగా రేకు గోడల సందుల్లోంచి నెమ్మదిగా తెల్లని కాంతి వెలువడడం మొదలెట్టింది. నాలుగు రేకు గోడల మధ్యన ఉండే నాలుగు సందుల నుండి తెల్లని కాంతి శరాలు నలుదిశలా చీకటిని చీలుస్తున్నాయి. రేకుల అడుగు నుండి తెల్లని పొగలు పుట్టుకురావడం మొదలయ్యింది.

రత్న ఏడుపు ఆపి కళ్లింత చేసుకుని ఆ వింత చూస్తూ నిలుచుండిపోయింది.

అంతలో  భళ్లున పెద్ద చప్పుడుతో లోపలి నుండి ఎవరో తోసినట్టు నాలుగు రేకులు బయటికి పడిపోయాయి.

పూరేకుల మధ్య దాగిన సుమకన్యలా అంతవరకు ఆ తగరపు గోడల మధ్య దాగిన ఓ వస్తువు ఆ క్షణం బహిర్గతం అయ్యింది.

అదో తెల్లని స్తంభంలా వుంది. వెడల్పు ఐదారు మీటర్లు ఉంటుందేమో. ఎత్తు ఓ ఏడంతస్థుల మేడ అంత ఎత్తు ఉంటుంది. దాని నిలువెల్లా ఫ్లడ్ లైట్ల లాంటివి తీక్షణమైన తెల్లని కాంతులు వెదజల్లుతూ చీకటిని పారద్రోలుతున్నాయి.

“మై గాడ్!” అని మాత్రం అనగలిగాడు అమోఘ్.

“ఏంటి బాబూ అది?” అమోఘ్ చెయ్యి కదిలిస్తూ అడిగింది రత్న.

“రా... రాకెట్,” కన్ను తిప్పకుండా అటే చూస్తూ అన్నాడు అమోఘ్.

“ఏంటి మరోటా?” అదిరిపోయి అంది రత్న. “లోకంలోని రాకెట్లన్నీ ఈ పూట మన పెరట్లోనే చేరాయేంటి బాబూ?” అమోఘ్ నుండి సమాధానం లేదు.

“ఈ రోజు వీళ్లక్కూడా ఏదైనా పండగా? లేకపోతే ... వీళ్లు కూడా ఇందాకటోళ్ల లాగే మనుషుల్ని పట్టుకుపోయే రకాలా?” అమోఘ్ నుండి సమాధానం రాకపోయేసరికి  తనే ప్రశ్నలు, జవాబులు చెప్పుకుంటూ సాగిపోయింది రత్న. “పండగలకి పిల్లల్ని పట్టుకుపోవడం వీళ్లకేపైనా ఆచారమేమో? అయినా ఇంకా ఎవరు ఉన్నారు పట్టుకుపోవడానికి. నువ్వు, నేనేగా మిగిలింది. లేకపోతే ఇక మిగిలింది పాపం ఈ మిట్టీ.... ఒరేయ్! ఇప్పుడే చెప్తున్నా. మా మిట్టీ జోలికి పోతే మాత్రం...”

రత్న ఇంకా ఏదో అనేలోపు మిట్టీ నోటికి ఉన్నట్టుండి ప్రాణం వచ్చింది. అయస్కాంతం చేత ఆకర్షించబడ్డ గుండుసూదిలా ఆ తెల్లని రాకెట్ వైపు బాణంలా దూసుకుపోయింది.

“మీట్టీ... ఆగు!” అమోఘ్, రత్నలు ఏకకంఠంతో అరిచారు. మిట్టీ గమనంలో మార్పు లేదు.

అంతలో ఆ రాకెట్ అడుగున ఓ రాంప్ లాంటి తలుపు కిందకి పడడం, మిట్టీ అందులోకి కలుగులోకి దూరిన ఎలుకలా దూసుకుపోవడం, ఆ వెనుకే అమోఘ్, రత్నలు కూడా ద్వారం లోంచి పరుగెత్తడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

వారి వెనుకే రాకెట్ తలుపు మూసుకుపోయింది.

4. భూలోకానికి బై బై

మర్రి తొర్రలోకి దూరిన ఉడుతల్లా అమోఘ్, రత్న, మిట్టీలు ముగ్గురూ తెరిచి వున్న రాకెట్ తలుపు లోంచి లోపలికి దూరారు. అక్కడ వారికి కనిపించిన దృశ్యానికి ఆశ్చర్యపోయారు. బయట కంపనతో పరిసరాలు ఎంత హోరెత్తి పోతున్నా లోపల మాత్రం తలుపు మూసుకోగానే ఇంచుమించు పూర్తి నిశ్శబ్దం నెలకొంది. ఎక్కడో నేపథ్యంలో సన్నని ఝుంకారం మాత్రం లీలగా వినిపిస్తోంది.

లోపల అమోఘ్ ని మరో విషయం ఆకట్టుకుంది. ఒక రాకెట్ లో ఉండాల్సిన సరంజామే ఏదీ అక్కడ కనిపించలేదు. రాకెట్ల మీద ఎన్నో సినిమాలు చూశాడు. తిరువునంతపురంలోని రాకెట్ మ్యూజియమ్ లో రాకెట్ నమూనా కూడా ఓసారి స్కూలు ఎక్స్ కర్షన్ లో వెళ్ళినప్పుడు చూశాడు. గోడల నిండా ఇంచి ఖాళీ లేకుండా అమర్చబడ్డ ఎలక్ట్రానిక్ పరికరాలు, నానా రకాల మానిటర్లు, లెక్కలేనన్ని బటన్లు, రంగురంగుల బల్బులు – అక్కడ ఇవేవీ లేవు. చుట్టూ తెల్లని గోడలు తను చిన్నప్పటి నుండి విన్న విషయాలన్నిటిని వమ్ము చేస్తున్నట్టు ఉన్నాయి.

అంతవరకు నిరంతరాయంగా మొరిగిన మిట్టీ కూడా చుట్టుముట్టిన ఆ తెల్లదనాన్ని చూసి నోరు మూసేసింది. ముగ్గురూ గుడ్లప్పగించి మంత్రముగ్ధులై ఆ తెల్లని పరిసరాలని చూస్తూ ఉండిపోయారు.

ఇంతలో ఎదురుగా గోడ మీద ఉన్నట్లుండి ఓ చిత్రం ప్రత్యక్షమయ్యింది. మరి అక్కడ టీవీ మానిటర్ లాంటిదేమీ కనిపించలేదు. చిత్రం ఎక్కడి నుండి వస్తోందో అమోఘ్ కి అర్థం కాలేదు. కొన్ని చోట్ల గోడలోని టీవీని గోడ ఉపరితలం నుండీ బయటికి తన్నుకురాకుండా జాగ్రత్తగా అమరుస్తారు. ఇది అలాంటిదే ఏదో అయ్యుంటుంది అనుకున్నాడు మనసులో.

గోడ మీద చిత్రంలో అంకెలు కనిపించాయి. వరుసగా 10, 9, 8... ఇలా అంకెలు మారుతున్నాయి. ఆ అంకెలని ఓ కంఠం పలుకుతోంది. ఆ శబ్దం నేపథ్యంలో ఎక్కడో దాగిన స్పీకర్ల లోంచి వినిపిస్తోంది.

ముందు రత్న ఉలిక్కి పడి వెనక్కు తిరిగింది. తమ వెనుకే మూసుకుపోయిన వాలు తలుపు మీద దబదబా మోదడం మొదలెట్టింది.

“బాబోయ్! నాయనోయ్! మేం ఇంకా ఈ రాకెట్ లోనే చిక్కడి పోయాం. తలుపు తెరవండి బాబోయ్, తలుపు తెరవండి!” అంటూ ఆ తలుపు మీద గుద్దుల వర్షం కురిపించింది.

అంతలో వెనుక ’తెర’ మీద 0 వరకు అంకెలు మారిపోయాయి. స్పీకర్ లోంచి వచ్చిన ‘ఇగ్నిషన్’ అన్న మాట పాపం రత్న చెవిన పడలేదు.

“రావాలని రాలేదు బాబోయ్! ఏదో తెలీక... మా కుక్క పిల్ల ఇలా లోపలికి దూరితేనూ... దానికి మాత్రం ఏం తెలుసని... ఒక్క క్షణం తలుపు తీస్తే ముగ్గురం బయటికి తుర్రున పారిపోతాం. తలుపు తియ్యండి బాబోయ్!” అంటూ శోకాలు తీస్తూనే వుంది.

ఆ గొడవలో పడి రాకెట్ బయల్దేరిన సంగతి, క్రమంగా పెరుగుతున్న వేగంతో ఆకాశం లోకి పైకి ఎగస్తున్న సంగతి ఆమెకి తెలీనే తెలీదు.

లోపల కంపన ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. నేల కూడా కంపించడం వల్ల అమోఘ్ మిట్టీని ఎత్తుకుని పక్కకి జరిగి గోడని పట్టుకున్నాడు. అలా గోడని తాకాడో లేదో గోడ లోంచి ఓ చిన్న సీట్ లాంటిది బయటికి తన్నుకొచ్చింది. అది సరిగ్గా అమోఘ్ మోకాళ్ల వరకు వస్తోంది. దానికి రెండు బెల్టులు తగిలించి వున్నాయి. అది కుర్చీ అని అర్థం చేసుకున్నాడు. వెంటనే కూర్చుని బెల్టులు తన చూట్టూ బిగించుకున్నాడు.

“రత్నా! రాకెట్ బయల్దేరింది,” రత్నని వారించడానికి చూశాడు. రత్న తొందరగా కూర్చోకపోతే చాలా ప్రమాదం. “వెంటనే నీ పక్కన ఉన్న గోడని తాకు. ఓ కుర్చీ లాంటిది బయటికొస్తుంది. దాని మీద బెల్టులు తగిలించుకుని కూర్చో... ””

రత్నకి ఆ మాటలేవీ వినిపించలేదు. ఏవో శోకాలు పెడుతూ తలుపు మీద బాదుతూనే వుంది.

రాకెట్ త్వరణం పెరుగుతున్న కొద్దీ రత్న కి బరువు పెరుగుతున్న అనుభూతి కలిగింది. ఇక నించునే ఓపిక లేదు కింద నేల మీద చతికిల బడింది.

“”రత్నా! కాస్త పక్కకి జరిగి గోడని తాకు. కుర్చీ బయటికొస్తుంది. అలా ఏదీ పట్టుకోకుండా కింద కూర్చోకు.” అమోఘ్ మాటల వల్ల ప్రయోజనం లేకపోయింది.

ఇక కాసేపట్లో కింద కూర్చోడానికి కూడా రత్న కి ఒంట్లో సత్తువ సరిపోలేదు.  నేల మీద వెల్లకిలా పడుకుంది. రాకెట్ త్వరణం పెరుగుతున్న కొద్దీ కింద పడుకున్నా కూడా రత్న గుండెల మీద ఒత్తిడి పెరగసాగింది.

"అమ్మో! నా గుండెల మీద ఏనుగు ఎక్కింది. బాబోయ్! అమోఘ్! వెంటనే దీన్ని దింపేయి బాబూ! అమ్మో! నొప్పి..."

ఆ స్థితిలో ఉన్న చోటి నుండి కదలేడని, కదలకూడదని అమోఘ్  అర్థం చేసుకున్నాడు. ఒళ్లో కూర్చున్న మిట్టీని మాత్రం గట్టిగా పట్టుకుని, కళ్లు మూసుకుని కూర్చున్నాడు.

అలా ఓ నాలుగైదు నిముషాలు అయ్యుంటుంది. రత్న కేకలు వెయ్యడం ఎప్పుడు ఆపేసిందో అమోఘ్ గమనించలేదు. కళ్లు తెరిచి చూశాడు. రత్న ఇంకా కళ్ళు మూసుకుని కిందే పడుకుని వుంది.

అంతవరకు అనుభూతి చెందిన వత్తిడి ఇప్పుడు తెలియడం లేదు. ఒళ్ళంతా తేలికగా అనిపించింది. మిట్టీని ఇక వదిలేయొచ్చు. ప్రమాదం లేదు, అనుకుంటూ మిట్టీ ని వదిలేశాడు. అంతవరకు భయంతో బిక్కచచ్చిపోయి అమోఘ్ ఒడిలో కుదురుగా కూర్చున్న మిట్టీ చెంగున కిందికి గెంతింది. అలా గెంతిన మిట్టీ బంతిలా మళ్లీ పైకి లేచి ఎదురు గోడకి కొట్టుకుంది. అక్కడి నుండి చూరుకి కొట్టుకుంది. ఇంత చిన్న వ్యవధిలో అన్ని 'ఎదురుదెబ్బలు' తినడం అలవాటు లేని దాని చిన్న ప్రాణం కుయ్యో కుయ్యో అంటూ గగ్గోలు పెట్టింది.

ఆ చప్పుడుకి రత్న కూడా కళ్లు తెరిచింది.

"అబ్బ! ఏనుగు ఏదీ? హమ్మయ్య! బరువంతా ఒక్కసారి ఎవరో తీసేసినట్టు అయ్యింది అనుకో.." అంటూ ఏదో అనబోతూ పైన పిచ్చుకలా గాల్లో ఎగురుతున్న మిట్టీని చూసి కళ్లింత చేసింది.

"ఏయ్! మిట్టీ ఏవయ్యింది నీకు. కిందకి దిగుతావా వచ్చి నాలుగు..." అంటూ దుడుకుగా పైకి లేవబోయి తూలి పడి పక్కన గోడకి కొట్టుకుంది. ఆ హఠాత్పరిమాణాన్ని ఎదురుచూడని రత్న కెవ్వున కేకపెట్టింది.

అంతలో ఎక్కడి నుండి వచ్చిందో ఏమో, ఆ తెల్లని గోడ లోంచి ఓ సన్నని మెరిసే చెయ్యి పైకి తన్నుకొచ్చి అవతలి గోడ దిశగా అప్పుడే ప్రయాణం కాబోతున్న రత్న చేతిని గట్టిగా వడిసి పట్టుకుంది.

దాంతో ఇంకా జడిసిన రత్న మళ్లీ గావుకేక పెట్టింది.

ఇక అటు ఇటు కొట్టుమిట్టాడడం మానేసి నేల మీద కుదురుగా నించుని తనని పడకుండా నిలువరించిన ఆ చేతిని, ఆ చేయి గల శాల్తీని ఓ సారి ఎగాదిగా చూసింది.

"హలో!" అంటూ పలకరించిందా శాల్తీ. "నా పేరు VS579X!" అంటూ కరచాలనం కోసం తన సన్నని లోహపు చెయ్యి చాచింది.

అప్పుడు రత్న అరిచిన అరుపు రాకెట్ లో మూడు  విభాగాలలోను ప్రతిధ్వనించింది.

ఈ దృశ్యం అంతా కళ్ళారా చుస్తున్న అమోఘ్ మనసుని ముందుగా కాస్తంత భయం, ఆ తరువాత విస్మయం, వెంటనే ఆనందం వరుస క్రమంలో ఆక్రమించుకున్నాయి.

రోబోల గురించి తను ఎన్నో కథలు చదివాడు. ఐసాక్ అసిమోవ్ రాసిన రోబో నవళ్లన్నీ ఒక్కటి కూడా వదలకుండా చదివాడు. రోబోల మూడు నియమాలు ఎప్పుడూ తన నాలిక చివరే ఉంటాయి. రోబోల మీద తను పుట్టక ముందు విడుదల అయిన సినిమాలు కూడా ఎన్నో చూశాడు. గత ఏడాది దినకర్ రావు ఏదో కాన్ఫరెన్స్ కోసం  జపాన్ కి  వెళ్లినప్పుడు తను కూడా వెళ్లాడు. అక్కడ టోక్యో పరిసరాలలో ఒదాయిబా ప్రాంతంలో ఓ రోబో ప్రదర్శనశాలలో ప్రఖ్యాత అసిమో రోబోని కళ్లారా చూశాడు. ఇప్పుడు తన కళ్ల ఎదుట ప్రత్యక్షమైన చిన్నారి రోబో కాస్త అసిమో లాగానే వుంది. అయితే అసిమో వీపు మీద ఓ భారీ బాక్ ప్యాక్ లాంటి బరువు వేలాడుతూ ఉంటుంది. అందులో అసిమో క్రియలని శాసించే బ్యాటరీలు ఉంటాయి.

నేల నుంచి పట్టున మూడు అడుగుల ఎత్తు కూడా లేని ఈ చిట్టి రోబో వీపు మీద అలాంటి బరువులేవీ లేవు.  సన్నని నాజూకైన టైటానియమ్ చేతులు తనవి. సన్నని సొగసైన టైటానియమ్ కాళ్ల మీద అసిమో లాగా కాస్త వంగినట్టు కాక నిటారుగా నించుంది. కళ్ల స్థానంలో చిన్న కెమేరాలు కనిపిస్తున్నాయి. అవి ఫోకస్ మార్చినప్పుడల్లా సన్నని, గమ్మత్తయిన కిర్రు కిర్రు చప్పుడు వినిపిస్తోంది.   అక్కడే చిన్న లైట్లు కూడా ఉన్నాయి. ముక్కు స్థానంలో పెద్దగా ఏమీ లేదు. కాని ముద్దొచ్చే చిన్ని బోసి నోరు ఒకటి వుంది. దాని పరిమాణం కూడా మాట్లాడినప్పుడు వేగంగా మారుతోంది.  చెవుల స్థానంలో ఒకే కేంద్రం గల మూడు చక్రాలు ఉన్నాయి.  అవి కూడా రంగురంగుల కాంతులు చిందిస్తూ ఆగాగి తిరుగుతున్నాయి.

మనుషులకి రోబోలకి మధ్య "లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అనేది అంటూ ఉంటే ఈ క్షణం అది అమోఘ్ కీ ఆ చిట్టి రోబోకి మధ్య నిశ్చయంగా జరిగిపోయింది.

“”హాయ్! నా పేరు అమోఘ్!” అన్నాడు అమోఘ్ ఆ రోబో చెయ్యి అందుకుంటూ. ఆ కరచాలనం చిరకాల స్నేహితుడి చేతి స్పర్శలా అనిపించి కాస్తంత ఊరట కలిగించింది.

“స్వాగతం! సుస్వాగతం,” అందా రోబో, నాటకీయంగా కొంచెం వంగి అమోఘ్, రత్నలకి సలాము చేస్తూ. “విశ్వమంతా సంచరించే నా ఈ చిన్ని కుటీరానికి సుస్వాగతం.”

అది విని ఫక్కున నవ్వింది రత్న. ఆ రోబో పట్ల మొదట్లో కలిగిన బెదురు ఇప్పుడు హుత్ అని ఎగిరిపోయింది.

“చూడు…అవును ఇంతకీ నీ పేరు ఏంటన్నావ్?”

“VS579X,”  చేతులుకట్టుకుని బుద్ధిగా జవాబు చెప్పింది రోబో.

“వీ యస్… ఏమో అబ్బా నీ పేరు నా బుర్రకెక్కడం  లేదు. వీ యస్.. విస్… విస్సూ ఆc! ఇది బావుంది. విస్సూ. నిన్ను విస్సూ అని పిలుస్తానేం?”

“ఓ అలాగే! ఈ పేరే బావుంది.” అన్నాడు ‘విస్సూ’!

“నీకు ఇంత బాగా తెలుగు ఎలా వచ్చు చిట్టి తండ్రీ!” అంది ఆశ్చర్యంగా కళ్లింత చేస్తూ. “నీ కొచ్చిన పాటి తెలుగు మా అమోఘ్ బాబుకి, అనూ పాపకే రాదూ!”

“నాకెందుకు రాదు? నాకు తెలుగు బాగా ఒచ్చు,” అన్నాడు అమోఘ్ చిన్నబుచ్చుకుంటూ.

“ఒచ్చు అట ఒచ్చు! ఈ..” అంటూ విస్సు కేసి చూపిస్తూ, “ఈ విస్సుని చూడు. చూడబోతే నేలకి పట్టుమని నాలుగు జానలు కూడా లేడు గాని నీకే తెలుగు నేర్పించేట్టు ఉన్నాడు.”

“నేర్పించేటంత రాదు గాని. నాకు తెలుగు బానే వచ్చు,” అంది రోబో. “తెలుగే కాదు. మీ భూమి మీద మాట్లాడే ఆరువేలకి పైగా భాషలన్నీ మాట్లాడగలను. అంతే కాదు. ఈ పరిసరాలలో అంటే ఓ 50 కాంతిసంవత్సరాల పరిధిలో ఉండే జీవజాతులు మాట్లాడే భాషలన్నీ మాట్లాడగలను.”

“మీ భూమి అంటున్నావ్. నీది ఈ భూమి కాదా?”

“నా స్వగ్రహం, అంటే  అదే నేను తయారు చెయ్యబడ్డ గ్రహం ఇక్కడి నుండి 23 కాంతసంవత్సరాల దూరంలో వుంది. దాని పేరు…” అంటూ ఏదో అనబోయి అర్థోక్తిలో ఆగి, “ఆ వివరాలు అన్నీ కొన్ని

కారణాల వల్ల  ఇవ్వలేను. కాని ఒక్కటి మాత్రం చెప్పగలను. నా యజమానులు 'అక్కడ' ఉన్నారు. వాళ్ల అదేశాలు అమలు చెయ్యడం నా పని. వాళ్లు ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్తాను. కొంతకాలంగా మీ భూమి మీదే పని పడి ఉంటున్నాను. అసలు గత ముప్పై ఏళ్లుగా ఈ సౌరమండలం పరిసరాలలోనే తిరుగుతున్నాను."

"ముప్పై ఏళ్లుగానా!" ముక్త కంఠంతో అన్నారు రత్న, అమోఘ్ లు నోళ్లు వెళ్ళబెడుతూ!

"వేలెడంత లేవు! చూడబోతే ఇప్పుడే రెండు వెళ్లి మూడు మొదలైన బుడుతడిలా వున్నావు! ఇంతకీ నీ వయసు ఎంతేంటి?" అడిగింది రత్న.

"భూమి లెక్కలో చెప్పాలంటే సుమారు 167 సంవత్సరాలు దాకా ఉంటుంది అనుకోండి," అన్నాడు విస్సూ సాలోచనగా. చెవుల దగ్గర వున్న చక్రాలు కాంతులు చిమ్ముతూ గిర్రున తిరిగాయి.

"ఇదుగో విస్సూ! ఈ అండీ, బండీ అన్నీ నాకు నచ్చవుగాని, నన్ను చక్కా రత్నా అనో, అక్కా అనో, రత్నక్కా అనో పిలువేం?"

"అలాగే రత్నా...సరే కాని... నాకో  విషయం అర్థం కాలేదు.  ఇంతకీ మీరు నా రాజహంస లోకి ఎందుకు ఎక్కినట్టు?"

"రాజహంసా? అదెవరు?" అన్నాడు అమోఘ్ చుట్టూ చూస్తూ.

"ఓహ్! అది మా రాకెట్ కి నేను ఇప్పుడే ఇచ్చిన భూలోకం పేరు."

"అయ్యో! ఎక్కాలని ఎక్కలేదు విస్సూ! ఇదుగో మా మిట్టీ దుడుకుగా లోపలికి దూరితే మేమూ దాని వెంటే పరుగెత్తాం... మేం ఇలా లోపలికి వచ్చామో లేదో... ఈ ... బండి బయల్దేరిపోయింది," అంది రత్న.

"ఓ అదన్నమాట సంగతి. అంతకు కొన్ని నిముషాల క్రితమే మా ప్రజ్ఞకి సందేశం వచ్చింది..."

"ఇంతకీ ఈ ప్రజ్ఞ ఎవరూ?" మధ్యలో కల్పించుకుంటూ అడిగింది రత్న చుట్టూ చూస్తూ మళ్ళీ గోడ లోంచి ఎవరైనా ఊడిపడతారామో నని భయపడుతూ.

“ప్రజ్ఞ అంటే ఈ రాకెట్ ని శాసించే కంప్యూటర్ పేరు. దాని అసలు పేరు PN773.  కాని మీ భూలోకం పేరు అయితే మీకు సులభంగా ఉంటుంది,” అంటూ ఓ సారి తల పైకెత్తి “ప్రజ్ఞా! మన అతిథుల్ని ఓ సారి పలకరించు.”

“హలో అమోఘ్! హలో రత్నా! ప్రయాణానికి సిద్ధమేనా?” పై నుండి ఆకాశవాణిలా స్పీకర్లలో ఓ స్త్రీ కంఠం వినిపించింది.

రత్న, అమోఘ్ లు మొహామొహాలు చూసుకున్నారు. కంప్యూటర్ మాట్లాడుతోందని అర్థం చేసుకున్నాడు అమోఘ్.

“హాయ్ ప్రజ్ఞా! ఇంతకీ మనం ఎక్కడి కెళ్తున్నాం?” అడిగాడు అమోఘ్.

“మా తదుపరి గమ్యం... దాన్ని మీ భాషలో గ్రహశకల వలయం అంటారు. అస్టిరాయిడ్లు తెలుసుగా?”

“మార్స్ కి జూపిటర్ కి మధ్య తిరుగుతుంటాయి. అస్టిరాయిడ్ బెల్ట్.. అక్కడికా?,” అడిగాడు అమోఘ్ కళ్లు పెద్దవి చేస్తూ.

“అవును. అందులో ‘హంస’ అనే అస్టిరాయిడ్ దగ్గరికి.”

“అవునూ, మా పేర్లు మీ ప్రజ్ఞకి ఎలా తెలుసు?” అడిగాడు అమోఘ్ విస్సూని విస్తుపోతూ.

“ఈ రాజహంస లో జరిగేదంతా మా ప్రజ్ఞ గమనిస్తూ ఉంటుంది. మన మాటలన్నీ ఓ పక్క నుండి చెవిన పడేసుకుంటూ ఉంటుంది,” అన్నాడు విస్సు.

“ప్రజ్ఞా? పేరు బావుంది. ఆవిడ గారు కూడా పిలిస్తే గోడ లోంచి ఊడిపడుతుందా?” అంది రత్న.

“లేదు. ప్రజ్ఞ  ఎప్పుడూ గోడ వెనుకే ఉంటుంది. నిజానికి ప్రజ్ఞ కి ఒక చోటు అంటూ లేదు. అది ఈ రాకెట్ నిలువెల్లా వ్యాపించిన, నానో మెటీరియల్స్ తో తయారు చెయ్యబడ్డ ఓ న్యూరల్ నెట్ వర్క్.ఈ రాకెట్ చలనాలన్నీ తన అధీనంలోనే ఉంటాయి.”

“అంటే తన పని చేసుకు పోతుంటుంది గాని, మరి మన మాట వినదా? పోనీ నీ మాట కూడా వినదా విస్సూ?” అడిగింది రత్న కాస్త సందేహంగా.

“వింటుంది. నా ఒక్కడి మాటే వింటుంది. నేను చెప్తే మీ మాట కూడా వింటుంది. మా ఇద్దరి మధ్య అది ఒక విధమైన ఒప్పందం... ఒక విధమైన స్నేహం లాంటిది వుంది.”

“అయితే నీకు పుణ్యం ఉంటుంది కాస్త మీ ప్రజ్ఞని మా అనూ దగ్గరికి తీసుకెళ్లమనవా? నీ చిట్టి పాదాలు పట్టుకుంటాను...” రత్న కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

“ఇంతకీ అనూ ఎవరు? ఎక్కడుంటుంది?” అడిగాడు విస్సూ.

ఆ రోజు రాత్రి జరిగిన విచిత్ర, విషాద సంఘటనలన్నీ ఏకరువు పెట్టాడు అమోఘ్. ఆఖర్లో మైదానంలో జరిగిన ఘట్టాన్ని వర్ణిస్తూ,

“అలాంటి పరిస్థితుల్లో ఇక ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఎదురుగా నీ రాకెట్ తలుపు తెరిచి వుంటే ముందు వెనుక చూడకుండా మా మిట్టీ వెనుకే ఇద్దరం ఎక్కేశాం.” అన్నాడు అమోఘ్.

తన పేరు వినిపించగానే మిట్టీ ఓ సారి సంతోషంగా మొరిగింది.

“రాకెట్ అంటున్నావు... ఎలా వుందా రాకెట్? దాని మీద ఏవైనా రాసుందా? దాని బట్టి అది ఎక్కడిదో, ఎక్కడికి వెళ్లి ఉంటుందో కనుక్కోవచ్చు,” అన్నాడు విస్సూ.

“ఒక్క నిముషం,” అన్నాడు అమోఘ్ అంతలో ఏదో గుర్తొచ్చి. ఇందాక ఇంట్లో తనకి దొరికిన బాడ్జ్ లాంటిది జేబు లోంచి తీసు విస్సూకి చూపించాడు.
“ఇది మా ఇంట్లో దొరికింది. అనూని తీసుకెళ్లిన వాళ్లదే అయ్యుంటుంది ఇది. మా ఇంట్లో పడిపోయింది. అంతే కాదు ఇదే చిహ్నం అనూని తీసుకెళ్లిన రాకెట్ మీద కూడా కనిపించింది.”

విస్సూ ఆ చిహ్నాన్ని తన కళ్ల కెమేరాల ముందు ఉంచి కాసేపు శ్రద్ధగా చూశాడు. కళ్ల నుండి, చెవుల నుండి నానా రకాల ధ్వనులూ పుట్టాయి.

“లాభం లేదు,” అన్నాడు చివరికి. “ఇలాంటిది నేను ఎక్కడా చూళ్లేదు.”

అమోఘ్ ముఖం చిన్నబోయింది. ఒక్క క్షణం ముందు అంకురించిన ఆశ అంతలోనే అంతరించిపోయింది.

“నువ్వే ఏదో దారి చూపించాలి విస్సూ. దేవుళ్ళా సరిగ్గా పండగ రోజు వచ్చావు. చూడ్డానికి కూడా చక్కని వెండి క్రిష్టుళ్లా వున్నావ్ సుమీ!” అంది రత్న ప్రాధేయపడుతూ.

“ఎక్కడుందో కూడా తెలీకుండా ఎలా సాయం చెయ్యడం?...” అంటూ మళ్లీ ఆ చిహ్నాన్ని చేతులోకి తీసుకున్నాడు విస్సూ.

“మబ్బు చాటు వున్న ఏదో వస్తువు... మబ్బు చాటున సూర్యుడు ఉంటాడు...”

“కాని ఐదున్నర వేల డిగ్రీల వద్ద మండిపోయే సూర్యుడి మీద ఎవరూ ఉండలేరుగా?” అన్నాడు అమోఘ్.

“పోనీ చందమామ?” రత్న అందించింది. “చంద్రుడు కూడా మబ్బుల చాటున దాక్కుంటాడుగా?”

“కాని నాకు తెలిసి చందమామ మీద ఎవరూ జీవించడం లేదే? చందమామ మీద ఇప్పడి వరకు మీ మనుషుల్లో 12 మంది మాత్రమే అడుగుపెట్టారు. మిగతా  మిషన్లు కూడా జెండాలు పాతడం, పరికరాలు స్థాపించడం మొదలైన కార్యక్రమాలకి మించి ముందుకు పోలేదు.”

‘మా మనుషులు కాకపోతే మీ వాళ్లు ఎవరైనా ఉండొచ్చుగా?” అడిగాడు అమోఘ్ ‘మీ’ అన్న శబ్దాన్ని నొక్కి పలుకుతూ.

“మా గ్రహానికి చెందిన వాళ్లు...” ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నాడు విస్సు “వాళ్లకి కూడా చందమామ మీద శిబిరాలు ఏమీ లేవు.”

మళ్లీ అమోఘ్ ఏదో అనబోతూంటే అంతలో స్పీకర్లలో ఓ ప్రకటన వినిపించింది.

“ముఖ్య గమనిక! భూమిని వదిలి అస్టిరాయిడ్ బెల్ట్ ని చేరే క్రమంలో తదుపరి దశ మొదలౌతోంది. కక్ష్యని ప్రస్తుతం ఉన్న ఎత్తుని నుండి 12,000 కిమీల ఎత్తుకి తీసుకువెళ్లడం జరుగుతుంది. అక్కడి నుండి ఇక భూమిని వదిలి అస్టిరాయిడ్ బెల్ట్ దిశగా పయనం అవుతాం. అందరూ తమ తమ స్థానాలలో బెల్ట్ లు కట్టుకుని సుస్థిరంగా కూర్చోవాలని ప్రార్థన.”

“అయ్యో! వద్దు విస్సూ.. దయచేసి అనూ కోసం వెతకడంలో మాకు సహాయం చెయ్యవూ?” బతిమాలింది రత్న.

“కాని అసలు ఏమీ తెలియకుండా ఎక్కడని వెతుకుతాం? “ అన్నాడు విస్సూ తన అశక్తతని వ్యక్తం చేస్తూ.

రత్నకి ఏమనాలో పాలుపోలేదు. నిస్సహాయంగా అమోఘ్ వైపు చూసింది. అమోఘ్ ఎటో చూస్తున్నాడు. ఎప్పుడు ఏర్పడిందో గాని అంతవరకు పూర్తిగా తెల్లగా తమని చుట్టుముట్టిన గోడలో ఆ గదికి ఇరు పక్కన

రెండు గుండ్రని కిటికీలు ఏర్పడ్డాయి. ఆ కిటికీలో కనిపిస్తున్న దృశ్యాన్ని అమోఘ్ కన్నార్పకుండా చూస్తున్నాడు.

“అమోఘ్ బాబూ! ఏంటి బాబూ ఏం మాట్లాడవేం? అనూ కోసం ఎక్కడ వెతుకుతాం? తొందరగా చెప్పకపోతే వీళ్లు ఎక్కడికో పేరు ఊరు లేని చోటికి పెళ్లిపోతారట,” అంది రత్న.

అమోఘ్ నుండి సమాధానం లేదు.

“ఏం బాబూ! ఎక్కడికి పెళ్దాం?” రెట్టించింది.

అమోఘ్ చూపుడు వేలితో కిటికీ వైపు చూపించాడు.

అల్లంత దూరంలో చందమామ అద్భుతంగా వెలిగిపోతోంది. వెనుక నల్లని దుప్పటి మీద పరిచిన మల్లెల్లా తారలు మెరిసిపోతున్నాయి. భూమి మీద నుండి చూస్తే కనిపించే తారల మినుకు మినుకు కాంతి కాదిది. అది స్థిరమైన, సజావైన తేజం.

“చందమామ దగ్గరికా?” రత్న, విస్పూలు ఒకే సారి అన్నారు.

“చందమామ మీద ఏమీ లేదంటున్నాగా?” మళ్లీ గుర్తుచేశాడు విస్పూ.

“అనూ అక్కడే వుంది. నాకు తెలుసు,” అన్నాడు అమోఘ్. అమోఘ్ పట్టుదల ఎలాంటిదో రత్నకి బాగా తెలుసు. ఏ విషయం లోనైనా ఒకసారి స్థిరమైన నిర్ణయం తీసుకుంటే ఇక ఆ సూర్యచంద్రులు దిగొచ్చినా నిర్ణయం మార్చుకోడు.  పైగా ఇక వేరే గత్యంతరం కూడా లేదు. ఏదో ఒక చోట ఆ గాలింపు మొదలుపెట్టాల్సిందే.

అప్పుడు రత్న ఠక్కున కిందకి వంగి విస్పూ కాళ్ల మీద పడింది. నునుపైన, సన్నని, మెరిసే టైటానియమ్  కాళ్లని వడిసిపట్టుకుంది రత్న.

“ఇక నువ్వే దిక్కు విస్పూ! నువ్వు తప్ప మాకిక ఎవరు ఉన్నారు చెప్పు. నువ్వు కాదంటే ఇక ఈ రాకెట్ లోంచి దూకి చావడం తప్ప మాకు వేరే గత్యంతరం లేదు. అనూ లేకుండా మేం ఇంటికి పెళ్తే మా అమ్మగార్కి, అయ్యగార్కి మొహం ఎలా చూపించాలి... ” అంటూ పలురకాలుగా ఆ పరాయి లోకపు రోబో కాళ్లావేళ్లా పడింది.

విస్సూకి మానవ విధానాలతో అంతో ఇంతో పరిచయం లేకపోలేదు. కాని ఇలాంటి భూలోక బ్లాక్ మెయిల్ ఆ రోబోకి కాస్త కొత్త. అయితే బొత్తిగా తార్కికంగా నిర్ణయాలు తీసుకునే పాతకాలపు రోబోల లాగా కాక అంతో ఇంతో హార్దిక భావావేశాలకి స్పందించగల సామర్థ్యంతో రూపకల్పన చెయ్యబడ్డ రోబో VS579X. కాబట్టి మనసు కరగకపోయినా, హృదయం ద్రవించకపోయినా, ఆ సమయంలో ఓ మనసున్న మనిషిలాగే స్పందించాడు.

"ప్రజ్ఞా! మన గమ్యం మారింది. మన తదుపరి గమ్యం భూమి చుట్టూ తిరిగే ఏకైక సహజ ఉపగ్రహం అయిన చందమామ."

""అలాగే విస్సూ! నీ ఆజ్ఞ కోసమే ఈ ప్రజ్ఞ నిరంతరం ఎదురుచూస్తూ ఉంటుంది. మన తదుపరి గమ్యం చంద్రుడు. అందరూ తమ తమ స్థానాలలో కుదురుగా కూర్చోవలసిందని మనవి. ఇప్పటి నుండి కొన్ని గంటల పాటు ఉధృతమైన చలనాలు ఉంటాయి. బెల్టు గట్టిగా బిగించుకోకపోతే ఏటి గట్టు మీద చేప పిల్లలా తన్నుకులాడాల్సి వుంటుంది మరి..." అంటూ ప్రజ్ఞ చేస్తున్న విచిత్ర ప్రకటన పూర్తి కాకముందే అడుగున రాకెట్ బూస్టర్లు గర్జించాయి.

చంద్రబింబం మీదకి ఎక్కుపెట్టిన అమ్ములా రాజహంస చిక్కని చీకటిని ఛేదిస్తూ దూసుకుపోయింది.

5. మబ్బు చాటు మరో చంద్రుడు

“ఇది చందమామా?స్మశానమా?” అంది రత్న కిటికీ లోంచి కింద కనిపిస్తున్న చంద్రతలం కేసి ఆందోళనగా చూస్తూ.

చందమామ మీద పేదరాసి పెద్దమ్మలు సంచరిస్తూ, ముద్దొచ్చే తెల్లని కుందేళ్లు విచ్చలవిడిగా పరిగెడుతూ ఉంటాయని ఆశించిన రత్న చంద్రుడి ముఖం చూసి ఖంగుతిన్నది.

భూమి నుండి చూసినప్పుడు పచ్చని పసిమితో చూపరులని మురిపించే చంద్రుడి అసలు రంగు దగ్గర్నుండి చూస్తేనే బయటపడుతుంది. చందమామకి అసలు రంగే లేదని తెలుసుకున్న మొట్టమొదటి వ్యోమగాములు కూడా రత్న లాగానే నిరుత్సాహ పడ్డారు.

నూరు కిమీల ఎత్తులో ‘రాజహంస’ చందమామ చుట్టూ కక్షలో ప్రవేశించింది. చంద్రుడి ఉపరితల విశేషాలు – గుట్టలు, మిట్టలు, అగాధాలు, లోతు తెలియని బిలాలు – వరుసగా కనిపించి నెమ్మదిగా కనుమరుగు అవుతున్నాయి.

రత్న మాటలు వినిపించుకోకుండా అమోఘ్ పరధ్యానంగా రాకెట్ లో అవతలి పక్కన కిటికీకి మొహం ఆన్చి ఆత్రంగా చూస్తున్నాడు.

“స్ఫోటకం మచ్చల్లా చందమామ ముఖం మీద ఆ మచ్చలేంటి అమోఘ్ బాబూ?”

భూమి నుండి బయల్దేరిన  దగ్గర్నుండి అమోఘ్  అలా ముభావంగా, పరధ్యానంగా ఉండడం రత్న గమనించింది. తనని ఏదో ఒకలా మాట్లాడించాలని విశ్వప్రయత్నం చేస్తోంది.

“చందమామ మీద ఆకాశం లోంచి ఓ పెద్ద బూచాడు పొద్దస్తమానమూ రాళ్లు విసురుతుంటాడు రత్నా! ఆ రాళ్లు చేసిన గోతులే ఆ మచ్చలు!” అంది ప్రజ్ఞ కాస్త పరిహాసంగా.

ఎదుట మనిషి కనిపించకుండా స్పీకర్ల లోంచి వచ్చే మాటలకి స్పందించడం మొదట్లో రత్నకి కాస్త ఇబ్బంది కలిపించినా నెమ్మదిగా అలవాటై పోయింది.

“ఇక్కడ కూడా బూచాళ్లు ఉంటారా ప్రజ్ఞా?” అంది కళ్లింత చేస్తూ.

“చందమామ ప్రభావమో ఏమో, ఇవాళ్ల మా ప్రజ్ఞ నిన్ను ఆటపట్టించే మూడ్ లో వుందిలే రత్నా!” అన్నాడు విస్సూ రత్న నించున్న కిటికీ దగ్గరికి జరుగుతూ.

”ఇక్కడ బూచాళ్లు లేరు గాని అంతరిక్షం నుండి ఎప్పుడూ లెక్కలేనన్ని రాళ్లు చందమామ మీద పడుతూ ఉంటాయి. వాటినే ఉల్కలు అంటాం. అవి పడ్డ చోట గోతులు ఏర్పడతాయి. దాంతో చందమామ ముఖమంతా ఇలా మారిపోయింది.”

విస్సూ అలా అంటుండగానే కిటికీలో ఓ విశాలమైన లోయ కనిపించింది.

”ఇప్పుడు మనకం ఐట్ కెన్ బేసిన్ (Aitken basin) మీదుగా ఎగురుతున్నాం. చందమామ మీద అతి విశాలమైన అగాధం అది. దీని వెడల్పు సుమారు 2,500 కిమీలు. కాశ్మీర్ కి కన్యాకుమారికి మధ్య దూరం కన్నా కాస్తే తక్కువ,” ప్రజ్ఞ చేసిన ప్రకటన మళ్లీ రాకెట్ లో మారుమ్రోగింది.

”మరి అంత పెద్ద గొయ్యి కూడా రాయి పడితేనే అయ్యిందా?” నమ్మశక్యం కానట్టు అడిగింది రత్న.

“నిశ్చయంగా,” అన్నాడు విస్సూ. “అయితే అది మామూలు రాయి కాదు. కొన్ని వందల మీటర్ల వ్యాసం గల రాయి పడితేనే అంత పెద్ద అగాధం ఏర్పడుతుంది.”

“వందల మీటర్లా?”

”అవును. మీరు ఉండే ప్రగతి నగర్ అంత పెద్ద రాయి అన్నమాట.”

”బాబోయ్! అంటే ఓ కొండ నెత్తిన పడ్డట్టే,” అంది రత్న కాస్త భయంగా.

“మరేం!. అందుకే చందమామ మీద వ్యవహారం కాస్త ప్రమాదంతో కూడుకున్న పని. ఎప్పుడు ఏం నెత్తిన పడుతుందో తెలీదు.”

“అవునూ! నాకో విషయం అర్థం కాదు. మరి అంత పెద్ద కొండలు భూమి మీద పడితే మన గతేం కాను?” రత్న సందేహం వెలిబుచ్చింది.

“బాగా అడిగావు. భూమి మీద రక్షక కవచంలా దట్టమైన వాతావరణం వుంది. అంతరిక్షం లోంచి కొట్టుకొచ్చే రాళ్లు రప్పలు ఆ వాతావరణంలోకి ప్రవేశించాక మండి మసై పోతాయి. కాని చందమామ మీద గాలి ఉండదు...” అని ఇంకా ఏదో చెప్పబోతుంటే అమోఘ్ అరుపులకి ఉలిక్కి పడి వెనక్కి తిరిగాడు విస్సూ.

“అనూ! అనూ! అదుగో అనూ...” అన్నాడు కిటికీ లో తన వేలితో ఎటో చూపిస్తూ.

విస్సూ, రత్నలు అమోఘ్ వున్న కిటికీ దగ్గరికెళ్లి చూశారు.

అల్లంత దూరంలో చందమామ చుట్టూ ఆవరించిన నల్లని ఆకాశంలో ఓ ఎర్రని చార కనిపించింది. ఆ చార ఇందాక వాళ్లు చూసిన రాకెట్ చీకట్లో వేసిన బాటని తలపిస్తోంది.
''అనూ అందులో వుంది... పదండి పట్టుకుందాం... విస్సూ పద. అక్కడ రాకెట్ ని లాండ్ చెయ్యమని ప్రజ్ఞకి వెంటనే చెప్పు,” ఆవేశంగా అన్నాడు అమోఘ్.

విస్సూ ఒక్క క్షణం మాట్లాడలేదు.

“ఏం విస్సూ! మాట్లాడవేం? అదుగో అక్కడే మనం లాండ్ అవ్వాలి,” అంటూ వత్తిడి చేశాడు ఎర్రని చార చందమామ వంపుని తాకుతున్న చోటినే కన్నార్పకుండా చూస్తూ.

“అది రాకెట్ కాదు అమోఘ్. అది కేవలం ఉల్కా పాతం,” అన్నాడు విస్సూ.

“లేదు, లేదు. నిస్సందేహంగా అది రాకెట్టే,” మొండిగా అన్నాడు అమోఘ్.

విస్సూ మరు మాట్లాడలేదు.

కొన్ని నిముషాలలో ఇందాక ఆ ఎర్రని చార చందమామ ఉపరితలాన్ని తాకిన అంచు మీదుగా రాజహంస ఎగిరింది. కాని అక్కడ చిక్కని చీకటి అలముకున్న ఓ అగాధం తప్ప ఎర్రని కాంతులేవీ కనిపించలేదు.

నిస్సహాయంగా తన సీట్ లో చతికిల బడ్డాడు అమోఘ్. నిస్పృహ అలుముకున్న తన ముఖం చంద్రతలం కన్నా కళావిహీనంగా మారింది. ఆ విషయం రత్న గుర్తించింది.

అమోఘ్ నిఎలాగైనా ఆ మూడ్ లోంచి బయటికి లాగాలి. ఏదో మాటల్లో పెట్టి మచ్చిక చెయ్యాలి.

“ఏయ్ అమోఘ్ బాబూ! అటు చూడు,” అమోఘ్ ని కుదుపుతూ అంది రత్న.

చంద్రగ్రహం అంచున ఓ సన్నని కాంతి రేఖ జనిస్తోంది. అది ఉల్కా పతనమో, రాకెట్ నడిచిన బాటో కాదు. చంద్రతలం మీద సూర్యోదయం మొదలయ్యింది.

క్రమంగా కాంతి పెద్దది కాసాగింది. అదో అద్భుతమైన దృశ్యం. భూమి మీద ఉషాకాంతుల్లో తారేడే నారింజ ఛాయలు ఇక్కడ కనిపించలేదు. ప్రచండమైన తెల్లని కాంతి. రాకెట్ ఆ కాంతి వైపుగా సాగిపోతోంది.

ఆ దృశ్యాన్ని చూస్తూ రత్న అప్రయత్నంగా నమస్కారం చేసుకుంది.

"తండ్రీ! సూర్యభగవానుడా!  మా అనూ  దొరికే దారి కాస్త చూపించు దేవా!" మనసులోనే పరిపరివిధాల అర్థించింది, ప్రార్థించింది. అలజడిగా వున్న తన అంతర్యంలో కాస్త ప్రశాంతత నెలకొంది.

ఆ ప్రశాంతతని భంగం చేస్తూ అమొఘ్ అరిచాడు.

"చందమామ మీద మబ్బులు… మబ్బులు," అన్నాడు కిటికీలో తనకి కనిపించిన దృశ్యాన్ని వేలితో చూపిస్తూ.

బళ్లో తనతో అనూ అన్న మాటలు 'మబ్బుల్లో …చందమామ…' పదే పదే తన మదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. అనూ ఎక్కడుందో తెలిపే రహస్యం ఆ మాటల్లోనే దాగి వుంది అని తన నమ్మకం. కాని అది రత్నతో చెప్తే  నవ్వుతుందేమో? విస్సూతో చెప్తే వినిపించుకోడేమో?

రత్న తన పక్కకి వచ్చి కిటికీ లోంచి తొంగి చూసింది. విస్సూ కూడా వచ్చి తన కళ్ల కెమేరాలని ఆ దిశలో గురి పెట్టాడు. చంద్రతలం మీద ఓ పలచని మబ్బు లాంటిది విస్తరించి వుంది. ఏదో చిత్రమైన సన్నని కాంతితో మెరుస్తోంది కూడా.

"అది మబ్బు కాదు అమోఘ్," ఓ రెండు క్షణాలు ఆ విషయాన్ని పరిశీలించి అన్నాడు  విస్సూ.

"తెల్లగా దూదిపింజలా అంత పెద్దగా వుంది…మబ్బు కాకపోతే మరేంటది?" అన్నాడు అమోఘ్ కాస్త విసుగ్గా.

"చందమామ మీద వాతావరణం లేదుగా? కాబట్టి అది మబ్బు కాదు. అంటే భూమి మీద కనిపించే మబ్బు లాంటిది కాదు." ఆ విచిత్రాన్ని వివరిస్తూ వచ్చాడు విస్సూ. "చందమామ నేల మీద అంతా

సన్నని ధూళి ఉంటుంది. గురుత్వం తక్కువ కనుక ఆ ధూళి కొన్ని చోట్ల పైకి లేచి మబ్బులా ఏర్పడుతుంది. ఇలాంటి 'మబ్బులని' గతంలో కొందరు వ్యోమగాములు కూడా గుర్తించారు."

ఒక్క క్షణం ఆగి కుడి చేతి చూపుడు వేలు పైకెత్తి మౌనంగా వున్నాడు. చెవుల దగ్గర చక్రాలు కాంతులు సన్నని చప్పుళ్లు చేసుకుంటూ చిలకరించాయి.

ఆ దృశ్యం చుసినప్పుడల్లా రత్నకి నవ్వాగదు. 'విషయం గుర్తు తెచ్చుకోవడానికి పాట్లు పాపం!' అనుకుంది మనసులో.

"గతంలో అపోలో 17 మిషన్ లో పని చేసిన జీన్ కెర్నన్ అనే వ్యోమగామి ఆ దృశ్యాన్ని చూసి దాని మీద తన నివేదికలో చక్కని చిత్రాలు గీశాడు. చంద్రుడి మీద సూర్యోదయం జరుగుతున్న సమయంలోనే అవి కనిపించాయని రాశాడు. చందమామ మీద పగలు రాత్రి కలిసే సన్నని గీత వద్ద వీటిని స్పష్టంగా చూడొచ్చుట."

అమోఘ్ అంతవరకు తను నించున్న కిటికీ దగ్గర్నుండి తొలగిపోయి విసుగ్గా వెళ్ళి తన సీట్ లో కూర్చుని ఒళ్లో  ముఖం  దాచుకున్నాడు.

తన వల్లనే ఇంత ఘోరం జరిగిందన్న అపరాధభావం, ఎంత ప్రయత్నించినా దారి కనిపించడం లేదన్న ఉక్రోషం, ఏం చేసినా బెడిసికొడుతోందన్న నిస్సయాత – ఇవన్నీ తనని తెగ వేధిస్తున్నాయి. అంతవరకు నిబ్బరంగా ఉండడానికి ప్రయత్నించాడు. బాధని పంటి బిగువున దాచడానికి ప్రయత్నించాడు. కాని అది తన వయసుకి మించిన పని అని అర్థమవుతోంది. అంతలో రత్న పక్కనే కూర్చుని భుజం మీద ఓదార్పుగా చెయ్యి వేసింది. అణుచుకున్న బాధ కట్టలు తెంచుకుంది. రత్న ఒడిలో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు. ఏదో ఓదార్చబోయి మళ్లీ మనసు మార్చుకుని ఊరుకుంది రత్న. అలాంటి సమయంలో మాటల కన్నా మౌనమే మేలనిపించింది కాబోలు.

కాసేపు రాజహంసలో ఎవరూ మాట్లాడలేదు. రత్నకి ఆ నిశ్శబ్దం ఇబ్బంది కరంగా అనిపించసాగింది. దానికి కొంచెం భయం కూడా తోడయ్యింది.

ఇంతలో ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అన్నాడు విస్సూ,

"మారె ట్రాన్ క్విలిటాటిస్."

మళ్లీ రత్నా, అమోఘ్ ల వైపు తిరిగి అన్నాడు. "ప్రశాంతతా సముద్రం... మనుషులు చంద్రుడి మీద అడుగుపెట్టిన మొదటి ప్రదేశం."

అమోఘ్ తలెత్తి కళ్లు తుడుచుకున్నాడు.

"విస్సూ! నీకు చందమామ మీద ప్రదేశాల గురించి బాగా తెలుసా?"

"ఓ! చందమామ కి ఎక్కువ సార్లు రాలేదు గాని, ఇక్కడి ప్రదేశాల పేర్లు మాత్రం తెలుసు. ఏం అడుగుతున్నావ్?" అడిగాడు విస్సూ.

"ఎందుకో తరువాత చెప్తాను. ముందు వరుసగా కొన్ని ముఖ్యమైన ప్రదేశాల పేర్లు చెప్పు."

"ఓ! దాందేం భాగ్యం!," అంటూ గడగడా ఒప్పజెప్పడం మొదలెట్టాడు విస్సూ. "మారె ఆంగ్విస్, మారె ఔస్ట్రాలే, మారె కాగ్నిటమ్, మారె క్రిసియమ్..."

"ఒక్క క్షణం ఆగు. ఏం భాష ఇది?"

"ఇదా... లాటిన్ అనుకుంటా. అయితే వీటికి ఇంగ్లీష్ పేర్లు కూడా ఉంటాయి."

"అయితే అవి చెప్పు."

"సర్పెంట్ సీ అంటే సర్ప సముద్రం, సదర్న్ సీ, దక్షిణ సముద్రం..."

"సముద్రం సముద్రం అంటాడేంటి అమోఘ్ బాబూ? ఇక్కడ సముద్రాలు కూడా ఉన్నాయా?"

"లేదు రత్నా. సముద్రం అంత పెద్ద గోతులవి. ఊరికే అలా పేర్లు పెట్టారు," అన్నాడు విస్సూ. మళ్లీ అమోఘ్ వైపు తిరిగి చెప్తూ పోయాడు, "సీ దట్ హాస్ బికమ్ నోన్, తెలిసొచ్చిన సముద్రం, సీ ఆఫ్ క్రైసిస్, సంకట సముద్రం..."

లాభం లేదన్నట్టు తల అడ్డుగా ఊపాడు అమోఘ్.

"ఏవయ్యింది అమోఘ్?" పేర్లు వల్లించడం ఆపి అడిగాడు విస్సూ. "ప్రత్యేకంగా ఏదైనా పేరు కోసం చూస్తున్నావా?"

తన మనసులో దొలిచేస్తున్నదేంటో చెప్తే తక్కిన ఇద్దరూ నవ్వుతారేమోనని ఒక పక్క సందేహం మనసులో పీకుతోంది. అలాగని చెప్పకుండా కూడా ఇంకా ఎంతో సేపు ఉండలేడు.

"మబ్బులు... మబ్బులు అన్న అర్థం గల ప్రదేశం ఏవైనా ఉందా?" తత్తరపడుతూ అడిగాడు అమోఘ్.

"ఏంటి బాబూ! ఇందాకటి నుండి మబ్బులు మబ్బులు అంటున్నావు? నీ మనసులో ఏదైనా ఆలోచన వుందా?" అమోఘ్ చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ నెమ్మదిగా అడిగింది రత్న.

"అదీ...అదీ ...నిన్న స్కూల్లో అనూ కనిపించినప్పుడు తను వేసిన ఓ బొమ్మ చూపించింది. అది కాస్త ఇందాక మనకి ఇంట్లో దొరికిన బాడ్జ్ లాగానే వుంది."

"బాడ్జ్ లాంటి బొమ్మ అనూ వేసిందా? ఏంటి బాబూ నువ్వు అనేది?" నిర్ఘాంతపోయింది రత్న.

"అవును. అప్పుడు నేనూ పట్టించుకోలేదు. కాని ఆ బొమ్మ చూపించి తనో మాట అంది."

"ఏమంది?" అన్నాడు విస్సూ అమోఘ్ వైపు రెండు అడుగులు వేస్తూ.

"మబ్బుల్లో చందమామ... అదే మాటలు మళ్లీ మళ్లీ అంది. నాకేమీ అర్థం కాలేదు. ఏదో వాగుతోందని ఊరుకున్నాను..." అంటూ బావురు మన్నాడు.

ఈ సారి రత్న, విస్సూ చెరో పక్కకి వచ్చి తోడుగా నిలబడ్డారు.

"బాబూ! నువ్వు ఊరికే బాధపడకు. అలాంటి సందర్భంలో ఎవరైనా అలాగే అనుకుంటారు. జరిగిందేదో ప్రమాదవశాత్తు జరిగింది. ఏదో దారి కనిపిస్తుంది. నువ్వు బెంగపెట్టుకోకు. నీకు మేమిద్దరం తోడున్నాం."

"అవును అమోఘ్! నేను, ప్రజ్ఞ నీ లక్ష్యం సాధించడంలో పూర్తిగా సాయం చేస్తాం. ఈ మొత్తం సౌరమండలంలో అనూ ఎక్కడ వున్నా పట్టుకుంటాం," అంటూ అమోఘ్ భుజం చుట్టూ చెయ్యేసి మెత్తగా వత్తాడు.

విస్సూ స్పర్శలో ఆ సమయంలో అమోఘ్ కోరుకున్న స్వాంతన దొరికింది. ఒక రోబో, ఒక మరమనిషి, కేవలం ఓ యంత్రం అంత తీయని స్నేహాన్ని పంచి ఇవ్వగలగడం ఆ పిల్లవాడికి చాలా అపురూపంగా అనిపించింది.

అమోఘ్ ఇలా మనస్తాపంతో కుమిలిపోవడం తనకే మంచిది కాదని రత్న అర్థం చేసుకుంది. అందుకే తన ధ్యాస మళ్లించడం కోసం కల్పించుకుంటూ అంది.

"విస్సూ! ఇందాక ఏవో పేర్లు చెప్తున్నావు. ఆ పేర్లే ఇంకా చెప్పు."

"సీ ఆఫ్ ఫెకండిటీ… ఉత్పాదకతా సముద్రం… "

"అది కాదు," మధ్యలో కల్పించుకుంటూ అన్నాడు అమోఘ్. "మబ్బులు అనే అర్థం వచ్చే ప్రదేశాలు ఏవైనా ఉన్నాయా?"

విస్సూ 'చెవి చక్రాలు' గిర్రున తిరిగాయి. రెండు క్షణాలు ఆగి నెమ్మదిగా అన్నాడు,

"మారె నూబియమ్… అంటే మబ్బుల సముద్రం!"

"యే!" అంటూ ఎగిరి గంతేశాడు అమోఘ్. "చూశావా? అనూ అన్న దాంట్లో ఏదో క్లూ వుంది. పద విస్సూ ఆ ప్రదేశానికి వెళ్దాం. అనూ అక్కడే ఉంటుంది. తప్పకుండా అక్కడే వుంటుంది."

విస్సూ కొద్ది క్షణాలు అమోఘ్ వైపు స్థిరంగా చూశాడు. తనలోని ఎలక్ట్రానిక్ మెదడులో తార్కిక విభాగానికి, భావావేశ విభాగానికి మధ్య కాస్తంత ఘర్షణ చెలరేగింది. అమోఘ్ పొరబడుతున్నాడని, తప్పు దారిలో ఆలోచిస్తున్నాడని తార్కిక విభాగం యొక్క నిర్ణయం. కాని కేవలం అమోఘ్ కి ఊరట కలిగించడం కోసం అతడి కోరిక తీర్చాలని భావావేశ విభాగం యొక్క నిర్ణయం.  విస్సూ నిజానికి రోబోయే అయినా ప్రవర్తన మానవ ప్రవర్తనకి సన్నిహితంగా ఉండాలన్న లక్ష్యంతో రూపొందించబడింది. అందుకే ఆ సందర్భంలో హార్దిక విభాగమే నెగ్గింది.

"ప్రజ్ఞా! మన తదుపరి గమ్యం చంద్రతలం మీద మారె నూబియమ్," అంటూ ప్రజ్ఞకి ఆదేశాలిచ్చాడు విస్సూ.

"అలాగే విస్సూ! మన తదుపరి గమ్యం మారె న్యూబియమ్ అని నిర్ధారిస్తున్నాను. అక్కడికి చేరుకోడానికి 13 నిముషాలు పడుతుంది. అందరూ సీట్లలో సుస్థిరంగా కూర్చోండి."

రాజహంస బూస్టర్లు గర్జించాయి. రాకెట్ తన దిశని కొద్దిగా మార్చుకుంటూ మారె నూబియమ్ దిక్కుగా దూసుకుపోయింది.

కాసేపట్లోనే రాజహంస మారె నూబియమ్ ప్రాంతం మీదుగా ఎగిరింది.

అక్కడి నుండి కిందికి దిగడానికి సన్నాహం మొదలయ్యింది. ముందుగా రాకెట్ ముక్కు ఆకాశం వైపు తిరిగింది. అక్కడి నుండి అవరోహణ మొదలయ్యింది.  రెట్రో బూస్టర్లు నిప్పులు కక్కాయి. దివి నుండి దిగొచ్చిన దేవతలా తెల్లని నాజూకైన రాజహంస నిర్వర్ణమైన చంద్రతలం మీద భద్రంగా దిగింది.



"అందరికీ  హెచ్చరిక!" స్పీకర్లలో ప్రజ్ఞ స్వరం ఖంగు మంది. "స్పేస్ సూట్లు వేసుకోకుండా బయటికి అడుగుపెట్టకండి. ఈ నియమాలు మీ ఊళ్లో ట్రాఫిక్ నియమాల లాంటివి కావు. అటు ఇటు అయితే మళ్లీ ఇటు వచ్చే ప్రసక్తి ఉండదు."

"మరి మిట్టీ సంగతేంటి?" అన్నాడు విస్సూ మిట్టీ వైపు సందేహంగా చూస్తూ.

"ఆ సౌకర్యం కూడా వుంది," అని ప్రజ్ఞ అనడం పూర్తి కాకుండానే రాకెట్ గోడ లోంచి ఓ చిన్న పెట్టె లాంటిది బయటికి పొడుచుకొచ్చింది. అందులో ఓ చిన్న స్పేస్ సూట్! అది సరిగ్గా మీట్టీకి సరిపోయింది. అసలే బొద్దుగా తెల్లగా ముద్దొచ్చే మిట్టీ ఆ సూట్ లో ఇంకా తెల్లగా, బొద్దుగా ముద్దొచ్చింది!

సూటు వేసుకోవడానికి రత్న మొదట్లో కొంత మొరాయించినా చివరికి ఆ అంతరిక్ష ఆచారానికి తల వంచక తప్పలేదు.

సూట్ వేసుకుంటుంటే అమోఘ్ కి లేని ఉత్సాహం వచ్చింది. లోన దొలిచేస్తున్న దిగులుని తాత్కాలికంగా మర్చిపోయాడు. ఏ సూటూ లేనిది, అక్కర్లేదిని విస్సూ మాత్రమే.

ఎయిర్లాక్ తెరుచుకుంది.  అంతా బయటికి నడిచారు.

మారె నూబియం అంటే ఓ చిన్న ఆటల మైదానం లాంటిది అనుకుంటే పొరబాటే. అది 750 కిమీల వ్యాసం గల విశాలమైన ప్రాంతం.  అక్కడక్కడ కొన్ని మిట్టలు, క్రేటర్లు తప్ప ఇది చాలా మటుకు చదునుగా ఉండే ప్రాంతం.

కాని రాజహంస సరిగ్గా ఓ లోతైన క్రేటర్ మధ్యలో దిగింది.

రాంప్ దిగి కొంత దూరం నడిచి ఆ ప్రదేశాన్ని కలయజూశాడు అమోఘ్. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని చీకటి.  చుట్టూ ఎత్తయిన నల్లని కొండలు క్రేటర్ చుట్టూ ప్రహరీ గోడల్లా ఏర్పడ్డాయి. పైన మెరిసే తారల జిలుగులో చుట్టూ ఏవుందో కాస్త లీలగా కనిపిస్తోంది. తమ చుట్టు పక్కల ఎవరు ఎక్కడున్నారో కనిపిస్తున్నారు.

“అందరూ తమ హెడ్ లాంప్ లు ఆన్ చేసుకోండి,” అన్నాడు విస్సూ.

ఆ  మాటలు తక్కిన వారికి తమ హెల్మెట్ లలో ఉన్న స్పీకర్ల ద్వారా వినిపించాయి. చంద్రమండలం ఇంచుమించుగా గాలి లేని శూన్య సీమ కనుక శబ్దం ప్రయాణించదు. కాబట్టి రేడియో సంకేతాల ద్వార ఒకరితో ఒకరు సంభాషించుకోవలసిందే.

“ఇప్పుడేం చేద్దాం అమోఘ్?” అడిగాడు విస్సూ. ఇక్కడి దాకా రావడం అమోఘ్ ఆలోచనే. ఇక్కడికి వచ్చాక ఏం చెయ్యాలో తనకే ఏదో అవగాహన ఉంటుందని విస్సూ ఉద్దేశం.

మనసులో ఏదో నమ్మకం పెట్టుకుని ఇక్కడికి వెళ్దాం అన్నాడే గాని అమోఘ్ కి కూడా ఇక్కడ ఏం కనిపిస్తుందో, ఏం చెయ్యాలో పెద్దగా అవగాహన లేదు.

“ఒక పని చేద్దాం,” అన్నాడు అమోఘ్ ఒక్క క్షణం ఆలోచించి. “అందరం తలో దిశలో నడుద్దాం. ఓ వంద అడుగులు నడిచి ఏమీ కనిపించకపోతే వెనక్కి వద్దాం. మిట్టీని నాతో తీసుకెళ్తాను. ఆ లోపల ఏదైనా ఆసక్తికరంగా కనిపిస్తే తక్కిన వారికి సందేశం పంపాలి. అప్పుడు తక్కిన వాళ్లు ఆ సందేశం పంపిన వాళ్లని కలుసుకోవాలి.”

అమోఘ్ ముందుకు అడుగు వెయ్యబోతుంటే ఎవరో చెయ్యి పట్టుకున్నారు. వెనక్కి తిరిగి చూస్తే రత్న. హెల్మెట్ లో వున్న చిన్న కాంతిలో ఆమె ముఖ కవళికలు కనిపిస్తున్నాయి. ఆమె ముఖంలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

“ఏం భయం లేదు రత్నా!” అన్నాడు అమోఘ్ దట్టమైన గ్లోవ్ లు వేసుకున్న చేతితో ఆమె చేతిని మెత్తగా వత్తుతూ. “మేం ఇద్దరం ఉన్నాంగా. పది పదిహేను నిముషాల్లో వెనక్కి తిరిగి వచ్చేద్దాం.”

రత్న మనసు కాస్త స్థిమిత పడింది.

ముగ్గురూ తలో దిశలో నడిచారు. అడుగులో అడుగు వేసుకుంటూ. అడుగడుగూ లెక్క పెట్టుకుంటూ.

ఎవరు ఏమన్నా ముగ్గురికీ తమ హెల్మెట్లలో ఉన్న స్పీకర్లలో వినిపిస్తోంది. రత్న భారంగా తీసుకుంటున్న శ్వాస కూడా స్పష్టంగా వినిపిస్తోంది.

ముగ్గురూ వేరుపడి మూడు నిముషాలు గడిచాయో లేదో, “అమ్మా!” అని కేక వినిపించింది. ఆ గొంతు రత్నది.

“ఏవయ్యింది రత్నా!” అమోఘ్, విస్సూలు ఒక్క గొంతుతో అరిచారు.

కొన్ని క్షణాల పాటు రత్న నుండి జవాబు లేదు.

“రాయో ఏంటో మరి… తట్టుకుని పడిపోయాను,” మూలుగుతూ అంది రత్న.

“అన్నట్టు చెప్పడం మరచిపోయాను,” అన్నాడు విస్సూ. “చందమామ మీద గురుత్వం తక్కువ. భూమి మీద మన బరువులో ఇక్కడ బరువు ఆరోవంతు మాత్రమే. అందుకు తూలి పడే అవకాశం ఎక్కువ. ప్రతీ అంగుళం జాగ్రత్తగా చూసుకుని అడుగెయ్యాలి.”

“దెబ్బలేం కాలేదుగా?” అడిగాడు అమోఘ్.

“లేదు. ఏం కాలేదు.”

ముగ్గురూ మళ్లీ నడవడం మొదలెట్టారు.

మరో మూడు నిముషాల తరువాత మళ్లీ కేక వినిపించింది. ఇది అమోఘ్ కేక.

“కనిపించింది… కనిపించింది,” అతడి గొంతులో ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపించింది.

“రాకెట్ కనిపించిందా?” విస్ఫూ స్వరం అమోఘ్ స్పీకర్లలో వినిపించింది. “అక్కడే వుండు. దగ్గరికి వెళ్లకు. మేం ఇద్దరం నీ దగ్గరికే వస్తాం. అందరం కలిసి వెళ్దాం.”

“రాకెట్ కనిపించింది కింద కాదు, పైన. ఆకాశంలో ఇందాక కనిపించిన ఎర్రని రేఖ  మళ్లీ కనిపించింది.” అన్నాడు అమోఘ్.

“ఇందాక కనిపించిన ఎర్రని రేఖ ఉల్కా పతనం అనుకున్నాం గా? మళ్లీ రాకెట్ అంటావేంటి?” విస్ఫూ అడిగాడు. అతడి స్థానంలో ఓ మనిషి ఉంటే విసుక్కునేవాడే. కాని విస్ఫూ గొంతులో ఎప్పుడూ విసుగు, కోపం, సంతోషం మొదలైన భావావేశాలు లేశమైనా కనిపించవు. మనుషుల భావావేశాలు అతడు కొంతవరకు అర్థం చేసుకోగలడు, వాటిని ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోగలడు. కాని వాటిని తానుగా వ్యక్తం చెయ్యలేడు. అవి అతడి ప్రోగ్రామింగ్ లోనే లేవు.

“”లేదు. అది వేరు ఇది వేరు. ప్లీజ్! నా మాట నమ్ము,” ప్రాధేయపడుతున్నట్టుగా అన్నాడు అమోఘ్.

“”సరే, అది ఎటు పక్క కనిపించింది?” మళ్లీ అడిగాడు విస్ఫూ.

“అటు,” అంటూ చుట్టూ నల్లని గోడలా ఏర్పడ్డ చీకటి కొండల వైపు చూపించాడు.

“ఎటు చూపిస్తున్నావు బాబూ? అసలు నువ్వు ఎక్కడున్నావు?” ఈ సారి రత్న అడిగింది. రత్నకి అల్లంత దూరంలో రెండు ఆకారాలు కనిపిస్తున్నాయి. హెడ్ లాంప్ ల బట్టి ఆ ఆకారాల స్థానాల్ని గుర్తించడానికి వీలవుతుంది. కాని ఆ చీకట్లో వాళ్ల చేతి కదలికలని గుర్తుపట్టడం అసంభవం.

“ఒక పని చేయి,” అన్నాడు విస్ఫూ. “నీ సూట్ కుడి భుజం మీద పాకెట్ లో చిన్న కంపాస్ లాంటిది ఉంటుంది. దాంతో నువ్వు చూసిన దిశ ఏమిటో గుర్తుపెట్టుకోవచ్చు.”

“”కంపాసా? కాని… చందమామకి అయంస్కాంత క్షేత్రం లేదని ఎక్కడో చదివానే…” సందేహంగా అడిగాడు.

“వెరీ గుడ్ అమోఘ్! ఒక స్కూలు పిల్లాడికి చందమామ మీద అయస్కాంత క్షేత్రం ఉండదని తెలియడం చాలా గొప్ప. నువ్వన్నది నిజమే. కాని ఈ ‘కంపాస్’ అలాంటిది కాదు. మనకి ఇప్పుడు ఉన్న ఒక ముఖ్యమైన ప్రమాణిక బిందువు మన రాకెట్ రాజహంస. ఈ కంపాస్ రాజహంస నుండి మనం ఎంత దూరంలో వున్నామో, ఏ దిక్కులో వున్నామో చెప్తుంది. రాజహంసలో తారల బట్టి దిక్కులు కనుక్కునే యంత్రాంగం వుంది.”

“బాబూ! ఇప్పుడు మీరు అన్న మాటలు తెలుగా తమిళమా?” రత్న సందేహంగా అడిగింది.

“తెలుగే రత్నా! కాని కాస్త సాంకేతికం.” అన్నాడు అమోఘ్ నవ్వుతూ. “నువ్వు అక్కడే వుండు. నేను చెప్పినప్పుడు నా దగ్గరికి నడుద్దువుగాని.”

జేబులోని కంపాస్ పైకి తీసి చూశాడు. దాని స్క్రీన్ మీద ఒక వృత్తం కనిపిస్తోంది. దాని చుట్టూ డిగ్రీల గుర్తులు ఉన్నాయి. దాని కేంద్రంలో ఓ ఎర్రని బొట్టు. అది రాజహంస వున్న స్థానం అని అర్థం చేసుకున్నాడు అమోఘ్. ఆ వృత్తం మీద చంద్రుడి ఉత్తర ధృవం దిశగా ఒక ముల్లు చూపిస్తోంది. ఇందాక తనకి కనిపించిన ఎర్రటి రేఖ ఆ ఉత్తర దిశకి కుడివైపున 30-40 డిగ్రీలు పక్కకి వుందని గుర్తించాడు అమోఘ్.

”ఇద్దరూ నా దగ్గరికి నడవండి. మనం ఎటు వెళ్లాలో తెలిసింది,” అన్నాడు అమోఘ్.

కాసేపట్లో అందరూ అమోఘ్ ఉన్న చోటికి నడిచారు. చేతిలోని కంపాస్ చూపిస్తున్న దిశలో అమోఘ్ నడవడం మొదలెట్టాడు. ముందు అమోఘ్ నడుస్తుంటే వెనుక వరుసగా రత్న, విస్సూ, మిట్టీలు అనుసరించారు.

కొద్ది నిముషాల నడక  తరువాత ఎదురుగా నల్లని రాకాసుల్లా అంత ఎత్తున ఉన్న మట్టి గుట్టలని చేరుకున్నారు. అంత దగ్గర్నుండి కూడా ఆ గుట్టలోని విశేషాలు అంత స్పష్టంగా కనిపించడం లేదు. హెడ్ లాంప్ కనిపించినంత మేరకే. ఆవల కొన్ని వందల అడుగుల ఎత్తున్న ఆ గుట్ట తారలు అద్దిన జటాజూటాలు గల వికృతమైన భూతంలా కనిపిస్తోంది.

ఇక ఆలస్యం చెయ్యకుండా అమోఘ్ ఆ గుట్టని ఎక్కడం మొదలెట్టాడు. వెనుకే రత్నా కూడా బయల్దేరింది. విస్సూ రెండు అడుగులు ఎక్కబోయి వెనక్కి జారాడు. తన పాదాలు ఇలాంటి ఆరోహణకి సరిపోవు.

"అమోఘ్! నేను మిట్టీతో ఇక్కడే వుంటాను.  మీరిద్దరూ పైకెక్కి చూసి రండి," విస్సూ గొంతు మిగతా ఇద్దరికీ స్పీకర్లలో వినిపించింది.

అమోఘ్ కి అది సబబే ననిపించింది. అందరూ పైకి వెళ్లాల్సిన అవసరం తనకి కనిపించలేదు. పైగా పైన తను చూసింది రాకెట్టో, లేక ఇందాకట్లో అది కూడా మరో ఉల్కాపతనమో తనకి కూడా నిజానికి కచ్చితంగా తెలీదు. బయటికి ధైర్యంగా అన్నాడే కాని తనకి కూడా మనసులో ఒక మూల సందేహం దొలిచేస్తోంది.

"సరే విస్సూ. రత్నా! నువ్వు వస్తున్నావుగా?"

"ఆс!  వస్తున్నాగా!" అంది రత్నా కాస్త నీరసంగా.

అడుగు తీసి అడుగు వెయ్యడం తనకి గగనమైపోతోంది.

""క్రిష్టమూర్తీ! నా మీద కోపం వుంటే శిక్షించు గాని మరీ ఇంత విచిత్రమైన శిక్షా?" తనలోనే తను గొణుక్కోసాగింది. "పండగపూట హాయిగా పాయసం తిని పడుకోవాల్సింది పోయి ఇలా ఈ దిక్కుమాలిన లోకంలో... బూడిద గుట్టలు ఎక్కుతూ...అబ్బా!" కాలు పట్టు తప్పి రెండు అడుగులు కిందకి జర్రున జారింది.

చంద్రమండలం మీద బరువు బాగా తక్కువ గనుక నిజానికి ఎత్తులు ఎక్కడం కష్టం కాకూడదు. ఇక్కడ కష్టం ఎక్కడంలో లేదు. ఈ గుట్టల్లో అధిక శాతం మట్టే వుంది. రాతి పాలు తక్కువ. కాబట్టి  కాలుజారే ప్రమాదం ఎక్కువ.

"ఇప్పుడు అర్థమయ్యింది క్రిష్టమూర్తీ నా మీద ఎందుకు కక్షకట్టావో. మువ్వకి వచ్చి మువ్వగోపాల క్రిష్ణుడిగా నీ దర్శనం చేసుకుంటానని ఏడాది క్రితం మొక్కుకున్నా. నిజమే. ఇప్పుడు లెంపలు వేసుకునే స్థితిలో కూడా లేను.   క్షమించేసేయి తండ్రీ! మరి నేనేం చెయ్యను? అమ్మగారు ఇల్లు కదలనిస్తేనా?"

""రత్నా! ఏంటి అంటున్నావ్?" మళ్లీ అమోఘ్ అడిగాడు.

“నేనా? నేనేవస్లేదే?” అని మనసులోనే “అనడానికి, అరవడానికి ఇక ఓపికేదీ?” అనుకుంది.

“మరి ఏంటి ఇంకా అక్కడే వున్నావ్? త్వరగా ఎక్కు.”

“క్షమించండి బాబూ! ఇదుగో చెంగు చెంగున వచ్చేస్తున్నా.”

ఓ పదిహేను నిముషాల నడక తరువాత ఇద్దరూ నెమ్మదిగా ఆ గుట్ట అంచుని సమీపించారు.

ముందు అమోఘ్ పైకి చేరుకున్నాడు. క్రేటర్ అంచు చాలా సన్నగా వుంది. అవతల పక్క కూడా మళ్లీ బాగా వాలుగా వుంది. అక్కడ నుండి తూలి పడితే అంతే సంగతులు. అయితే క్రేటర్లో లోపలి పక్క వున్నంత చీకటిగా బయట లేదు. తన ఎదుట విశాలంగా విస్తరించిన మైదానం కనిపించింది. చదునుగా, రాళ్లు గుట్టలు, చెట్లు, పుట్టలు లేకుండా అనంతంగా, అనవధికంగా విస్తరించిన ఆ చంద్రతలాన్ని ఆ ‘మబ్బుల సముద్రాన్ని’ చూస్తుంటే ఒక పక్క ఆశ్చర్యం, మరో పక్క భయం రెండూ కలిగాయి.  మన అనుభవానికి పూర్తిగా విరుద్ధంగా వున్నది, లేదా అతీతంగా ఉన్నది ఏదైనా తారసపడితే మనిషిలో కలిగే స్పందన ఈ రెండిట్లో ఏదో ఒకటి అవుతుందేమో.

అలా ఎదుట దృశ్యాన్ని కన్నార్పకుండా చూస్తున్న అమోఘ్ ని మరో విషయం ఆకట్టుకుంది. భూమి మీద అయితే చందమామ వల్ల వెన్నెల కాస్తుంది. మరి చందమామ మీదైతే? ఇక్కడ కూడా మరో రకం వెన్నెల వెల్లివిరిసింది. దీని కాంతి పసుపు కాదు, నీలం. చీకటి ఆకాశంలో నీలి చందమామలా భాసిస్తున్న భూమిని చూడగానే అమోఘ్ శరీరంలో సన్నని పులకరింత బయల్దేరింది.

భూమి మీద నించుని భూమి అందాలు ఆస్వాదించడం వేరు. అల్లంత దూరంలో అంతరిక్షం లో నుండి భూమిని చూడడం వేరు. ఆ సమయం భూమిలో  అమోఘ్ ఓ కొత్త ముఖం కనిపిస్తోంది. జలాల నీలం, మబ్బుల తెలుపు, ఖండాల గోధుమ వన్నె, వనాల పచ్చదనం – ఈ రంగులన్నీ కలగలిసిన భూమి సొగసుని అంత దూరం నుండి చూస్తుంటే ఎంత చూసినా తనివి తీరదేమో. ఖండాలని, సముద్రాలు విస్తృతంగా ఆవరించిన మేఘాలన మేలి ముసుగు  పుడమి కన్య ముఖానికి ప్రత్యేకమైన శోభ తెస్తున్నాయి.

ఆ దృశ్యం తనకి ఏదో సందేశం చెప్తున్నట్టు అనిపించింది. అమోఘ్ మనసులో ఏవో తెలియని ఊహలు వేగంగా రూపుదిద్దికుంటున్నాయి. జీవితంలో ఎన్నో సార్లు మనకి ఈ రకమైన అనుభూతి కలుగుతుంది.

ఏదో ఒక సమస్య గురించి ఆలోచిస్తుంటాం. అది ఎంతకీ తెగదు. దాని గురించి ఆలోచించి ఆలోచించి ఒక దశలో దాని సంగతి మర్చిపోతాం. కొంతకాలం తరువాత ఉన్నట్లుండి మనసు పొరల లోనుండి ఏదో తటాలున పైకి తన్నుకొస్తుంది. వెతికి వెతికి మర్చిపోయిన పరిష్కారం దానినదే బట్టబయలు చేసుకుంటుంది. మనం మర్చిపోయినా ఆ శోధనని లోపల మన అంతర్యం  మౌనంగా కొనసాగిస్తోంది అన్నమాట.

తన మదిలో సుడులు తిరుగుతున్న భావాలు మాటలుగా బయటికి రావడానికి పెనుగులాడుతున్నాయి.

అంతలో రత్న ఆ గుట్ట పైకి చేరుకుంది.  అంచుకి చేరగానే అవతల తనకి కనిపించిన దృశ్యం చూసి తూలి కిందపడబోతూ అమోఘ్ చెయ్యి గట్టిగా పట్టుకుంది.

“ఏది బాబూ? రాకెట్ అన్నావు. ఇక్కడేమీ లేదుగా?”

రత్న మాటలు పట్టించుకోకుండా అమోఘ్ తదేకంగా ఆకాశంలో కనిపిస్తున్న భూమి వైపే చూస్తున్నాడు.

“మనం చూసింది ఇందాకట్లాగే రాలే ఉల్కే అయ్యుంటుందిలే. పద బాబూ వెనక్కి వెళ్లిపోదాం.” మెత్తగా చెయ్యి కదిలిస్తూ అంది. అయినా అమోఘ్ లో స్పందన లేదు.

“గట్టిగా గాలి గాని వీస్తే ఇద్దరం ఇక్కడ నుండి ఆ అగాధంలో పడిపోతాం. పద బాబూ,” మళ్లీ అంది రత్న.

ఈ సారి రత్న వైపు తిరిగి అన్నాడు.

“”ఏవన్నావు?”.

“నేనేమన్నా బాబూ? గాలి వీస్తే పడిపోతాం అన్నాను... తప్పన్నానా?”” భయపడుతూ అంది.

“”గాలి...గాలి...” అమోఘ్ ముఖంలో అలముకున్న ఆనందం, ఆశ్చర్యం ఆ సమయం రత్న గుర్తించలేదు.

“”యురేకా!” అమోఘ్ పెట్టిన గావు కేకకి రత్న స్పీకర్లే కాక, కింద ఎదురు చూస్తున్న విస్సూ, మిట్టీ ల హెల్మెట్లలో కూడా మారుమ్రోగింది.

జారుడు బండ మీద జారుతున్నట్టుగా తిరుగు ప్రయాణం పట్టాడు అమోఘ్. పడుతూ లేస్తూ ఆ విడ్డూరపు పిల్లవాణ్ణి అనుసరించడానికి ప్రయత్నించింది రత్న.

వెనుక దుమారం లేపుకుంటూ పరుగెత్తుకు వస్తున్న అమోఘ్ ని ఎదురు వెళ్లి కలుసుకున్నాడు విస్సూ. వెనుకే ఆదుర్దాగా మొరుగుతూ మిట్టీ కూడా ఉరికింది. తన బాలయజమాని చుట్టూ గంతులేస్తూ, అరుస్తూ, నాకడానికి ప్రయత్నించి హెల్మెట్ అడ్డురావడం విఫలమవుతూ నానా హడావుడి చేసింది.

"తెలిసిపోయింది," అన్నాడు అమోఘ్ ఉత్సాహంగా. హెల్మెట్ లో విజర్ వెనుక అతడి ముఖం పున్నమి చంద్రుడిలా వెలిగిపోతోంది. "అనూ ఎక్కడుందో తెలిసిపోయింది."

"ఎక్కడ?" అడిగాడు విస్సూ.

"మబ్బు చాటు చంద్రుడు అంటే భూమి నుండి చూసినప్పుడు కనిపించే మబ్బుల చాటున వున్న చందమామ కాదన్నమాట."

"ఎందుకు కాదు?" అడిగాడు విస్సూ.

"తీరా చంద్రమండలానికి వచ్చాక ఇక్కడ ఏమీ లేదని తెలిసిపోయిందిగా?'

"మరైతే ఆ మబ్బు చాటు చందమామ ఎవరు?"

"ఆ చందమామకి లేదా గ్రహానికే చెప్పుకోదగ్గ మేఘమండలం ఉండాలి. అలాంటిది చందమామకి లేదు. భూమికి ఉంది గాని ఆ రాకెట్ భూమికి చెందినది కాదన్న విషయంలో సందేహం లేదు."

"మరి అలాంటి దట్టమైన మేఘాలు ఉన్న గ్రహం… వీనస్ మీద బాగా మబ్బులు ఉంటాయి…"

అమోఘ్ ముఖం మీద చిరున్నవులు విరియడం చూసి మళ్లీ విస్సూనే అన్నాడు.

"ఏంటి నువ్వనేది? వీనస్సా?"

అవునన్నట్టు తల ఊపాడు అమోఘ్.

"ఎన్నో ఇతర గ్రహాల మీద కూడా మబ్బులు ఉన్నాయి. కాని వీనస్ కి ప్రత్యేకం. గ్రహం మొత్తం ఎప్పుడూ మబ్బులతో నిండి ఉంటుంది. ఆ మబ్బులే భూమి నుండి వీనస్ ని టెలిస్కోప్ లతో చూడడానికి ప్రయత్నించిన ఖగోళవేత్తలని చాలా కాలం ఇబ్బంది పెట్టాయి. అన్ని మబ్బులు ఉన్నాయి కనుక వాటి

వెనుక నేల చల్లగా ఉంటుంది అనుకున్నారు. వీనస్ నిండా విశాల సముద్రాలు ఉంటాయని అనుకున్నారు."

"అవును నిజమే," అన్నాడు విస్సూ ఆ అంశం మీద తనకి తెలిసిన సంగతులని తన డేటాబేస్ నుండి వెలికి తెచ్చుకుంటూ. "1956 లోనే మొట్టమొదటి సారిగా మైక్రో వేవ్ లతో వీనస్ ని శోధించినప్పుడు అక్కడ నీరు లేదని అది విపరీతంగా వేడిగా ఉండే గ్రహమని తెలిసింది."

"ఆ తరువాత క్రమంగా అమెరికా, రాష్యా పంపిన ప్రోబ్ ల సహాయంతో మబ్బుల మాటున దాగిన వీనస్ రూపురేఖల గురించి క్రమంగా తెలిసొచ్చింది."

"ఏమో ... అంత మాత్రాన మన గమ్యం వీనస్సేనని అంత కచ్చితంగా ఎలా చెప్పగలం?" అన్నాడు విస్సూ సందేహాన్ని ధ్వనిస్తూ.

"మనకి మరో క్లూ కూడా వుంది," అన్నాడు విస్సూ తన జేబు లోంచి అంతకు ముందు ఇంట్లో దొరికిన చిహ్నాన్ని బయటికి తీస్తూ. అందులో వృత్తం మీద మబ్బు లాంటి చిత్రాలతో పాటు అడ్డుగా కుడి నుండి ఎడమకి, ఎడమ నుండి కుడి పక్కకి పోయే బాణపు గుర్తులు ఉన్నాయి."

అది వినగానే విస్సూ 'చెవి చక్రాలు' గిర్రు మన్నాయి.

"అవును వీనస్ కి మరో  ప్రత్యేకత కూడా. ఈ విషయంలో తక్కిన గ్రహాలతో పోల్చితే వీనస్ పూర్తి విరుద్ధం. తక్కిన గ్రహాలన్నీ తమ అక్షం మీద ఒక దిశలో తిరిగితే, వీనస్ మాత్రం వ్యతిరేక దిశలో తిరుగుతుంది. ఆ బాణాలు సూచిస్తున్నదే అదే కావచ్చు."

వీనస్ మీద అలా ఉధృతంగా చర్చ జరుగుతుంటే అప్పుడే రొప్పుతూ, రోజుతూ రత్న వాళ్లని చేరుకుంది. "బాబూ! ఇక నా వల్ల కాదు. పద ఇక ఇంటికి వెళ్లిపోతాం. నన్నిడిగే అనూ ఇంట్లోనే ఏ సోఫా కిందో దాక్కుని వుంటుంది. మనకి బుద్ధి లేక ఇలా నానా లోకాలూ తిరుగుతున్నామంతే."

"లేదు రత్నా! అనూ సోఫా కింద లేదు. వీనస్ గ్రహం మీద ఉంటుంది అంటున్నాడు అమోఘ్!" విస్సూ తాపీగా అన్నాడు.

రత్న మూర్ఛబోయినంత పని చేసింది.

“ఏంటి బాబూ నువ్వనేది? వీ... వీనస్?”

“అవును రత్నా. నువ్వు చాలా సార్లు సాయంత్రాలు చూపించేదానివే, రేచుక్క అని. అది నిజానికి ఒక గ్రహం. అదే వీనస్.”

“అనూ అక్కడ ఉండడం ఏంటి బాబూ? నాకసలు ఏమీ అర్థం కావడం లేదు...”

“ఇప్పుడు అవన్నీ వద్దులే గాని. పద తొందరగా బయల్దేరుదాం.”

‘ఇంకా నీ కచ్చ తీరలేదా కృష్ణమూర్తీ?’ అని మనసులోనే అనుకుని, పైకి మాత్రం “ సరే పదండి. తప్పదుగా?” అంది.

వెనుక మిట్టీ అనుసరిస్తుంటే ముగ్గురూ  రాజహంస దిక్కుగా నడిచారు.

అంతలో ఏదో గుర్తొచ్చి రత్న అమోఘ్ ని అడిగింది.

“అవును. ఇందాక గాలి... అనగానే గాలా? అని ఒకటి రెండు సార్లు రెట్టించి ఎందుకు అడిగావు?

“ఓ అదా? మన గమ్యం వీనస్సే అని కచ్చితంగా చెప్పడానికి మరో కారణం కూడా వుంది.” విస్సూ వైపు తిరిగి, “వీనస్ కి మన చందమామకి మధ్య ఓ ఆసక్తికరమైన సంబంధం వుంది. తెలుసా విస్సూ?”

తల అడ్డంగా ఊపాడు విస్సూ. అమోఘ్ చెప్తున్నది చరిత్రకి సంబంధించిన విషయం. అది విస్సూకి తెలిసే అవకాశం తక్కువ.

“కొన్ని శతాబ్దాల క్రితం ఇటాలియన్ శాస్త్రవేత్త గెలీలియో వీనస్ మీద తన టెలిస్కోప్ తో పరిశీలనలు చేశాడు. చందమామకి ఉన్నట్టే వీనస్ కి కూడా ‘కళలు’ ఉన్నట్టు గమనించాడు. కాని ఆ సంగతి పైకి ప్రకటిస్తే చర్చి అధికారులతో సమస్య వస్తుందని రహస్యంగా ఉంచాడు. కాబట్టి తను కనుక్కున్న విషయాన్ని ఓ రహస్య సందేశంగా లాటిన్ లో ఇలా రాసుకున్నాడు.

Haec immatura a me iam frustra leguntur oy.
దీని అర్థం ‘ఇలాంటి లోతైన విషయాలు అమాయకుణ్ణి అయిన నాకు ఎలా తెలుస్తాయి?’ అని వస్తుంది. కాని పై లాటిన్ వాక్యంలోని అక్షరాలని తారుమారు చేస్తే మరో వాక్యం వస్తుంది.
Cynthiae figuras emulatur Mater Amorum

ఈ రెండో వాక్యానికి అర్థం -

'సింధియా చిత్రాలని ప్రేమ దేవత అనుకరిస్తోంది.' సింధియా అంటే చందమామ. ప్రేమ దేవత అంటే వీనస్. చందమామకి పున్నమి, అమావాస్య మొదలుకుని కళలు ఉన్నట్టే, వీనస్ కి కూడా కళలు ఉన్నాయని గెలీలియో రాసుకున్న ఆ రహస్య సందేశం చెప్తోంది."

రత్నకి అమోఘ్ అన్న మాటల్లో పదిహేను శాతం కూడా అర్థం కాలేదు. ఇంత చిన్న పిల్లాడికి అన్ని లోతైన విషయాలు ఎలా తెలుసు అని ఆమెకి ఎడతెగని ఆశ్చర్యం.

అయితే తమ గమ్యం వీనస్సేనని అమోఘ్ మనసులో స్థిరంగా ఓ నిర్ణయం ఏర్పడడానికి మరో కారణం కూడా వుంది. అనూ అంతకు ముందు బళ్లో అన్న మాటలు మళ్లీ గుర్తొచ్చాయి. "మబ్బు చాటు చందమామ" అంటే ఆమె ఇస్తున్న క్లూ "చందమామ" అనుకున్నాడు. కాని ఇప్పుడు సరిగ్గా గుర్తొచ్చింది తాను అన్నది – "మబ్బు చాటు మరో చందమామ". అంటే చందమామ లాంటి మరేదో వస్తువు. అప్పుడు ఏవో పిచ్చి మాటలు అనుకున్నాడు. ఇప్పుడు ఆ 'మరో చందమామ' ఏంటో స్పష్టంగా అర్థమైపోయింది. కాని ఆ విషయం తనలోనే రహస్యంగా ఉండిపోతుంది. పైకి చెప్తే ఎన్నో జవాబులు లేని ప్రశ్నలు తలెత్తుతాయి. నవ్వుల పాలు అయ్యే ప్రమాదం కూడా వుంది.

"శభాష్ అమోఘ్! శభాష్! అసలు ఇంత చిన్న వయసులో నీకు ఇవన్నీ ఎలా తెలుసో నాకు అర్థం కావడం లేదు," అన్నాడు విస్సూ.

"అదుగో మా అయ్యగారు కూర్చోబెట్టి చెప్తారు విస్సూ. ఇద్దరూ కూర్చుంటే తెల్లారే వరకు ఇలాగే ఏవో అర్థం కాని విషయాలే మాట్లాడుకుంటారు."

"మీరు కూడా ఇక్కడే కూర్చుని చందమామ మీద తెల్లారే వరకు కబుర్లు చెప్పుకుంటారా లేక నిజంగా వీనస్ కి వెళ్లే ఉద్దేశం వుందా?" ప్రజ్ఞ ప్రకటన అందరి స్పీకర్లలో ఖంగు మని వినిపించింది.

ఆ ప్రకటనలో చిలిపితనానికి అమోఘ్, రత్నలు నవ్వారు. అంతవరకు అగమ్యగోచరంగా కనిపించిన తమ లక్ష్యసాధనలో నెమ్మదిగా ఏదో దారి కనిపిస్తోంది. పైకి ఇద్దరూ ఏమీ మాట్లాడకపోయినా ఇద్దరికీ గుండెల మీద బరువు కొంత తగ్గినట్టు అనిపించింది.

కాని ముందు ముందు ఇంకా ఎంత అనిశ్చితి ఎదురవుతుందో, ఎన్ని ప్రమాదాలు పొంచి వున్నాయో ఇద్దరికీ తెలిసే అవకాశం లేదు.

6. మేఘదేశం

“మరి కాసేపట్లో వీనస్ పరిసరాలని చేరుకోబోతున్నాం,” స్పీకర్లలో ప్రజ్ఞ చేసిన ప్రకటనకి గాఢంగా నిద్రపోతున్న అమోఘ్, రత్నలు ఉలిక్కి పడి లేచారు. “వీనస్ ని ఇప్పుడు మనకి కుడి వైపున ఆకాశంలో స్పష్టంగా చూడొచ్చు.”

“అప్పుడే వీనస్ దగ్గరపడుతున్నామా?” అన్నాడు అమోఘ్ ఆశ్చర్యంగా. అతడి గొంతులో ఆశ్చర్యంతో పాటు, కాస్తంత ఆందోళన కూడా ధ్వనించింది. ఇంత శ్రమపడి, ఇంతకు తెగించి ఇంత దూరం వస్తున్నాం. మన లక్ష్యం నెరవేరబోతుందా? లేక మళ్లీ నిరాశే ఎదురవుతుందా? లక్ష్యం నెరవేరినా కాకపోయినా ఈ నవ్య ప్రపంచంలో తలకి మించిన అవాంతరాలేవీ ఎదురు కావుగా? మనసులో ఎన్ని ఆలోచనలు చెలరేగుతున్నా బయటికి మాత్రం ధైర్యంగా ఉండడానికి ప్రయత్నిస్తూ రత్నతో తిరిగి అన్నాడు,

“అదుగో, అదే వీనస్ గ్రహం!”

రత్న కిటికీ లో తల పెట్టి చూసి అప్రయత్నంగా ఆ దృశ్యాన్ని కళ్లకి మొక్కుకుంది. ఏ వింత కనిపించినా, ముఖ్యంగా అది ఆకాశంలో కనిపిస్తే దానికి మొక్కడం రత్నకి చాలా అలవాటు.

భూమి నుండి చూసినప్పుడు ఓ ప్రకాశవంతమైన తారలా కనిపించే వీనస్ గ్రహం ఇప్పుడు రాజహంస కిటికీ లో టేబుల్ టెన్నిస్ బంతిలా పలచని తెలుపుతో ప్రకాశిస్తూ కనిపించింది.

“అంతా పూర్తిగా తెల్లగా వుందేంటి? మంచా?” అడిగింది రత్న.

“కాదు. మబ్బులు,” కిటికీ దగ్గరికి జరుగుతూ అన్నాడు విస్సూ. అందరూ కిటికీ దగ్గరికి చేరి చేస్తున్న హడావుడి చూసి మిట్టీ కూడా కిటికీ దగ్గరికి చేరి, వాళ్ళ కాళ్ల మధ్య దూరి ఉత్సాహంగా మొరిగింది.

“వీనస్ గురించి కొన్ని ముఖ్య వివరాలు.” ఈ అమాయకులకి నాలుగు ముక్కలు నేర్పాలని గుర్తించినట్టుంది ప్రజ్ఞ. ఉద్ఘాటన మొదలెట్టింది. “ వీనస్... సూర్యుడి నుండి రెండవ గ్రహం. భూమికి సోదరీ గ్రహం...”

“అంటే చెల్లెలు కదూ?” రత్న అడిగింది విస్మయంగా.

“భూమితో చాలా పోలికలు ఉండడం వల్ల భూమికి చెల్లెలు లాంటిది అంటారు.” అన్నాడు అమోఘ్.

“…వ్యాసార్థం 6,052 కిమీలు. భూమి కన్నా కాస్తే చిన్నది. గురుత్వం భూమి గురుత్వంలో 9/10 వంతు. సంవత్సర కాలం 224.7 భూమి దినాలు. వీనస్ మీద ఒక దినం 243 భూమి దినాలతో సమానం. …”

“అదేంటి బాబూ… నాకేమీ…” అర్థం కాక అడిగింది రత్న.

“అక్కడ సంవత్సరంలో రమారమి సగం కాలం పగలు అయితే సగం కాలం రాత్రి. భూమి లాగా కాక బాగా నెమ్మదిగా తన అక్షం మీద తిరుగుతుంది వీనస్,” విస్సూ వివరించాడు.

“అవునూ… నాకో సందేహం. మన దగ్గర గొడుగులు ఉన్నాయా?” రత్న అడిగింది.

“గొడుగులా?” విస్సూ, అమోఘ్ లు మొహామొహాలు చూసుకుంటూ ఒక్క సారిగా అన్నారు. “గొడుగులు దేనికి?”

“ఇందాక మబ్బులు చూస్తే అనిపించింది…పొద్దస్తామానమూ వర్షాలు పడుతుంటాయేమో.”

అమోఘ్ పకాలున నవ్వాడు. రత్న చిన్న బుచ్చుకుంది.
“ముందు జాగ్రత్త కోసం అన్నానంతే. తప్పేమైనా అన్నానా?” అంది కోపం నటిస్తూ.

“అయ్యో పిచ్చి రత్నా! ఆ మబ్బులు మామూలు మబ్బులు కావు. ఆసిడ్ మబ్బులు. వాటి నుండి కురిసేది నీరు కాదు సల్ఫ్యూరిక్ ఆసిడ్. పైగా మనం దిగి నడిచే ప్రసక్తే ఉండదు. ఎందుకంటే అక్కడ ఉష్ణోగ్రత చాలా ఎక్కువ. మనం తట్టుకోలేం.”

“ఒకటి రెండు కాదు 500 డిగ్రీల సెంటిగ్రేడు. కాలు మోపితే కాలిపోతుంది,” అంది ప్రజ్ఞ కాస్తంత వ్యంగ్యం చిలకరిస్తూ.

“మరి… ఇక్కడికి మనం ఎందుకొచ్చినట్టు అమోఘ్ బాబూ?”

దానికి అమోఘ్ నుండి సమాధానం లేదు.

“ఇలాంటి చోట మనిషన్నవాడు కాలు మోపే ప్రసక్తి లేదు. ఇక్కడ ఎవరూ ఉండలేరు. ఎవరూ రాలేరు. మరి మనం ఇక్కడికి ఎందుకొచ్చినట్టు?” రెట్టించింది రత్న.

అమోఘ్ మౌనంగా తల దించుకుని నించుండిపోయాడు.

“ఏంటి బాబూ? మాట్లాడవేం?”

“ఏమో నాకూ తెలీదు రత్నా? నీ ప్రశ్నకి నా దగ్గర కూడా సమాధానం లేదు.  దొరికిన క్లూలని అనుసరించడం తప్ప అనూ ఎక్కడుందో మీకెంత తెలుసో నాకు అంతే తెలుసు. మనకి దొరికిన ఆ బాడ్జ్ బట్టి ఆ రాకెట్ వచ్చింది వీనస్ నుండేనని బలంగా అనిపించింది. అంతకు మించి నాకేమీ తెలీదు. ప్లీజ్! దయచేసి నన్ను ఇంకేమీ అడగొద్దు,” అంటూ ముఖాన్ని చేతుల్తో కప్పుకున్నాడు.

అది చూసిన రత్న మనస్సు చివుక్కు మంది. అనవసరంగా ఆ చిన్నవాడి మనసు కష్టపెట్టానని అనుకుంది. ఆ సంభాషణ అంతా వింటున్న విస్సూ కూడా మౌనంగా ఉండిపోయాడు. కాసేపు రాజహంసలో పూర్తి నిశ్శబ్దం నెలకొంది.

కొన్ని నిముషాల తరువాత ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ప్రజ్ఞ ప్రకటన రాకెట్ లో ఖంగు మంది

“కాసేపట్లో వీనస్ చుట్టూ కక్ష్యలోకి ప్రవేశిస్తున్నాం”.

రాజహంస తగు స్థాయిలో వేగం తగ్గించుకుని వీనస్ చుట్టూ ముందు దీర్ఘవృత్తాకార కక్ష్యలోకి ప్రవేశించింది. కాసేపయ్యాక ఆ శ్వేతగ్రహానికి మరింత దగ్గరిగా జరుగుతూ నూట ఇరపై  కిమీల ఎత్తున వృత్తాకార కక్ష్యలో స్థిరపడి గ్రహం చూట్టూ పరిభ్రమించడం మొదలెట్టింది.

వీనస్ ముఖమంతా దూది పిందెలు అద్దినట్టు దట్టమైన మబ్బులు క్రమ్ముకుని వున్నాయి. మేఘాల పాలిన తెలుపు తప్ప మరో వర్ణమే కనిపించదు. నీలం, తెలుపు, పచ్చ, గోధుమ మొదలుకుని అనేకానేక వర్ణాలతో శోభిల్లే పుడమి పడతికి, నిర్వర్ణమైన ఈ వీనస్ వెలదికి మధ్య పోలికే లేనట్టు ఉంటుంది. పైగా వీనస్  మబ్బుల వెనుక గ్రహోపరితలం మీద ఏ వింతలు దాగి వున్నాయో, ఏ ప్రమాదాలు పొంచి వున్నాయో పైన అంతరిక్షం నుండి చూసే వారికి ఏమీ తెలియదు.

రాజహంస వీనస్ చుట్టూ ప్రదక్షిణలు కొనసాగించింది. అమోఘ్, రత్న, విస్సూలు కిటికీల దగ్గర కాపు కాసి ఆత్రంగా చూస్తున్నారు... వీనస్ మీద నాగరక చిహ్నాలేమైనా వున్నాయేమో చూద్దామని.

“నాకు తెలిసి వీనస్ మీద నాగరిక చిహ్నాలేవీ లేవు,” అన్నాడు విస్సూ.

అమోఘ్ దానికి స్పందిచబోయి మళ్లీ మౌనంగా ఉండిపోయాడు. తనకి తెలిసినంతవరకు, పుస్తకాల్లో చదివినంత వరకు కూడా వీనస్ మీద ఎలాంటి నాగరిక చిహ్నాలూ లేవు. వీనస్ మీదే కాదు, అసలు మొత్తం సౌరమండలంలోనే భూమి మీద తప్ప మరెక్కడా జీవం యొక్క ఉన్కి ఛాయలు లేవు. కాని తను అనుసరిస్తున్న ఆచూకీలు, తన మనసులోని విశ్వాసం – వీటి మీదే ఆధారపడుతూ ఇంతవరకు వచ్చాడు. అందరినీ ఒప్పించి ఇంతవరకు తీసుకొచ్చాడు. కాని దాఖలాల కోసం నిలదీస్తే ఏమీ చెప్పలేని నిస్సహాయత తనది.

మరో పక్క ప్రజ్ఞ మైక్రోవేవ్, ఇన్ఫ్రా రెడ్ మొదలైన తరంగ పుంజాలతో వీనస్ ముఖాన్ని తడుముతోంది. అసలే వీనస్ ఉపరితలం సలసల రగిలిపోతూ ఉంటుంది. పైగా అక్కడ అగ్నిపర్వతాలు కూడా ఎక్కువే. ఇన్ఫ్రా రెడ్ కెమేరాలలో అగ్నిపర్వతాల ఉన్కి తెలుస్తోంది. వీనస్ ఉపరితల విశేషాల గురించిన వివరాలు ఎన్నో ప్రజ్ఞ డేటా బేస్ లలో భద్రంగా ఉన్నాయి. తనకి కొత్తగా వస్తున్న సమాచారం ఆ డేటా బేస్ లలో ఉన్న సమాచారంతో చక్కగా సరిపోతోంది. ఇక కొత్తగా తెలుస్తున్నది, తెలుసుకోవలసినదీ ఏమీ లేదనిపించింది.

“అవును. నాగరిక చిహ్నాలేవీ కనిపించడం లేదు,” రాకెట్ స్పీకర్లలో ప్రజ్ఞ ప్రకటన వినిపించింది.

అమోఘ్ ముఖం చిన్నబోయింది. అసలే లోలోపల బెంగతో క్రుంగిపోతున్నాడు. వీనస్ లో ఏదో దారి కనిపిస్తుందని గంపెడంత ఆశతో ఉన్నాడు.

“మరో ప్రదక్షణ చేసి వెనక్కు తిరగడం మంచిది,” అంది ప్రజ్ఞ. “మా అసలు మిషన్ ప్రకారం అస్టిరాయిడ్ బెల్ట్  కి వెళ్లాలి,” అంది తమ అసలు గమ్యం సంగతి గుర్తు చేస్తూ.

రాజహంస వీనస్ చుట్టూ మరో ప్రదక్షణ మొదలుపెట్టింది. ఎటు చూసినా అదే అవిశేషమైన తెల్లదనం. రత్న గుండెల్లో దిగులు పెరగసాగింది. ఏం చెయ్యాలో, దేని కోసం చూడాలో తెలియక కిటికీలో కనిపిస్తున్న ఆ అపరిచిత ప్రపంచం వైపు నిస్తేజంగా చూస్తూ ఉండిపోయింది.

“ఇక్కడి నుండి దణ్ణం పెట్టుకుంటే మరి నీకు వినిపిస్తుందో లేదో తెలియదు… క్రిష్టమూర్తీ! ఏదో దారి చూపించవయ్యా తండ్రీ!” మనసులోనే ప్రార్థనలు తెలుపుకుంది.

అంతలో మబ్బుల మాటున ఏదో తళుక్కు మన్నట్టు అనిపించింది. ఓ సన్నని ఎర్రని కాంతి రేఖ. ఇంతలో కనిపించి ఇట్టే మాయమయ్యింది.

"లైటు... లైటు..." ఉత్సాహంగా చప్పట్లు కొట్టింది రత్న. "ఆ మబ్బుల్లో ఏదో లైటు కనిపించింది."

అమోఘ్ చటుక్కున ఆ కిటికీ దగ్గరికి చేరి రత్న సూచిస్తున్న వైపుగా చూశాడు. తనకి ఏమీ కనిపించలేదు. కొన్ని క్షణాలు చూసి వెనక్కి తిరగబోతుంటే మళ్లీ కనిపించిందది. చిన్న ఎర్రని కాంతి. క్షణం వెలిగి ఆరిపోయే ట్రాఫిక్ లైటు లాంటిది. అమోఘ్ దాని ఫ్రీక్వెన్సీ లెక్కించాడు. సరిగ్గా పదిహేను క్షణాలకి ఒకసారి వెలుగుతోంది. అది నిశ్చయంగా మబ్బుల మధ్య గంతులేసే మెరుపు తీగ మాత్రం కాదు. దాన్ని నాగరిక చిహ్నం  అనకపోతే  మరేమంటారో తెలియదు.

విస్సూ కూడా వచ్చి చూసి తక్కిన ఇద్దరూ చూసింది సరైనదేనని ఒప్పుకున్నాడు. మిట్టీ కూడా అందరి కాళ్ల మధ్య ఆవేశంగా దూరి హడావుడి చేసింది.

"ప్రజ్ఞా మనం ప్రస్తుతం ఏ ప్రాంతం మీదుగా అయితే ఎగురుతున్నామో అక్కడ ఏవో నాగరక చిహ్నాలు ఉన్నట్టున్నాయి. కొంచెం పరిశీలిస్తావా?" అడిగాడు విస్సూ.

ప్రజ్ఞ తన సెన్సర్లు అన్నీ విస్సూ సూచించిన స్థానం మీద కేంద్రీకృతం చేసింది.

అక్కడి నుండి పుష్కలంగా విద్యుదయస్కాంత తరంగాలు వెలువడుతున్నాయి. ప్రత్యేకించి మైక్రోవేవ్ ఫ్రీక్వెన్సీల వద్ద చాలా శక్తి కేంద్రీకృతమై వుంది. పైగా ఆ సంకేతాలు సహజ మూలాల నుండి పుట్టే సంకేతాలలా లేవు. ప్రజ్ఞ ఆ సంకేతాల మీద కొన్ని ప్రాథమిక విశ్లేషణలు చేసి తన నిర్ణయాన్ని ప్రకటించింది.

"మీ పంట పండింది," అంది ప్రజ్ఞ నవ్వుతూ. "ఇక్కడ నిశ్చయంగా నాగరిక ఛాయలు ఉన్నాయి."

అమోఘ్ కి మనసులో చెప్పలేని ఆనందం కలిగింది. అంతవరకు మూసుకుందని భయపడ్డ దారి మెల్లగా తెరుచుకుంటోంది.

అంతలో రాజహంస్ రిసీవర్లలో ఓ కొత్త స్వరం వినిపించింది. కఠినంగా, ఓ కంచుయంత్రం మాట్లాడుతున్నట్టుందా స్వరం.

“మీరు  మేఘాదేశపు వాయు సీమని ఉల్లంఘిస్తున్నారు. వెంటనే మీరెవరో మీ గమ్యం ఏమిటో తెలుపవలసిందని హెచ్చరిక.”

ఆ స్వరం విని రత్న, అమోఘ్ లు బిత్తర పోయారు. ఎక్కడి నుండి వస్తోందా స్వరం? ఎవరిదా స్వరం?

 విస్నూకి కూడా ఏమని స్పందించాలో తెలియలేదు. కొన్ని క్షణాలు ఎవరూ మాట్లాడలేదు.

కాసేపు అయ్యాక మళ్లీ అదే స్వరం పలిగింది.

“అపరిచిత రాకెట్ లోని  ప్రయాణీకులకి హెచ్చరిక. మీరు మేఘ దేశపు వాయు సీమని ఉల్లంఘిస్తున్నారు. వెంటనే మీరెవరో తెలపకపోతే మీ మీద క్షిపణులని ప్రయోగించవలసి ఉంటుంది.”

“మేం భూమి నుండీ వస్తున్నాం,” అన్నాడు ముందు విస్నూ తేరుకుని స్పందిస్తూ. “మా నౌక పేరు రాజహంస. మీ దేశంలోకి ప్రవేశాన్ని కోరుతున్నాం.”

ఓ నిముషం తరువాత మళ్లీ ఆ కంచుకంఠం వినిపించింది.

“మీరు ప్రస్తుతం ఉన్న కక్ష్యలోనే కొనసాగండి. మా వాహనం వచ్చి మిమ్మల్ని కలుసుకుని మా దేశంలోకి తీసుకొస్తుంది.”

కొద్ది నిముషాల్లో ఓ అంతరిక్ష వాహనం రాజహంసకి సమీపంగా వచ్చింది. అది శంకాకారంలో వుంది. ఆధారం ఇరవై అడుగులు, ఎత్తు పదిహేను అడుగులు ఉంటుందేమో. పక్కన ఉన్న చిన్న బూస్టర్లలో ధాటిని కొద్ది కొద్దిగా నియంత్రిస్తూ రాజహంసకి దానికి మధ్య దూరం స్థిరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాడు దాని పైలట్. రాజహంస రిసీవర్లలో మళ్లీ అదే కంచు కంఠం వినిపించింది.

“మీ నౌకకి మా నౌకకి మధ్య ఓ చిన్న ఆకాశ మార్గం లాంటిది ఏర్పాటు చేస్తున్నాను. అందులోంచి మా నౌకలోకి  సులభంగా రావచ్చు.”

అప్పుడు ఆ శంకాకారపు నౌక నుండి ఓ వెడల్పయిన గొట్టం లాంటిది ఏనుగు తొండంలా బయటికి వచ్చింది. ఆ ‘తొండం’ నెమ్మదిగా వచ్చి రాజహంస ఉపరితలాన్ని ఎయిర్లాక్ ఉన్న చోట తాకింది. పైగా ఆ

గొట్టం రబ్బరులా సాగుతోంది. దాని నోరు ఎయిర్లాక్ చుట్టూ విస్తరించి లోపలికి గాలి పోకుండా బలంగా రాజహంస ఉపరితలానికి అంటుకుంది.

“ఇప్పుడు మీ ఎయిర్లాక్ ని సురక్షితంగా తెరవచ్చు,” అని మళ్లీ సందేశం వచ్చింది.

ప్రజ్ఞ రాజహంస ఎయిర్లాక్ ని తెరిచింది. దాని చుట్టూ ఆ గొట్టం నోరు బిగుతుగా బిగుసుకుని వుంది.

“అందరూ వరుసగా ఆకాశమార్గం లోంచి నడుస్తూ మా నౌకలోకి రండి.”

ఎయిర్లాక్ అంచు దాకా నడిచి బయటికి తొంగి చూసిన రత్న కెవ్వు మంది. ఆ గొట్టం పారదర్శకంగా వుంది. అందులోంచి కిందకి చూస్తే కొన్ని మైళ్ల కిందన విస్తరించి వున్న మబ్బుల పొర కనిపిస్తోంది. పైగా ముప్పై అడుగులు పైగా పొడవున్న ఆ గొట్టం స్థిరంగా ఉండక నెమ్మదిగా గాలికి ఊగుతోంది! డాబా మీద పని చేస్తూ కిందకి చూస్తేనే కళ్లు తిరుగుతున్నాయని గగ్గోలు పెట్టే రత్నకి దాని లో నుండీ నడవడం కాదు కదా, దాని పక్క చూస్తేనే గుండె గుభేలు మంటున్నాయి!

అమోఘ్ ఆ గొట్టాన్ని దాని చుట్టూ వ్యాపించి వున్న ఆకాశాన్ని చూసి చిరునవ్వు నవ్వాడు. తనకి ఇదంతా చాలా థ్రిల్లింగా అనిపిస్తోంది. అతి భయంకరమైన రోలర్ కోస్టర్లలో కూడా కేరింతలు కొడుతూ ప్రయాణించే రకం మరి!

“చచ్చినా అందులోకి అడుగుపెట్టే ప్రసక్తే లేదు,” ఖరాఖండిగా చెప్పేసింది రత్న.

అంతలో విస్సూ ఓ చక్కని సూచన చేశాడు.

“ఇదుగో పైలట్ గారు! మీరు మీ నౌకని కాస్త కిందకి దించండి.”

అవతలి నౌక రాజహంస వున్న ఎత్తు కన్నా ఓ పది అడుగులు కిందకి దిగింది.

అమోఘ్, రత్నలతో ఒక్క మాట కూడా అనకుండా విస్సూ చటుక్కున ఆ గొట్టం నోటి దాకా నడిచి అందులోని దూకేశాడు! కన్ను మూసి తెరిచేలోపు అవతలి కొసని చేరుకుని వీనస్ నుండి వచ్చిన నౌకలో కనుమరుగయ్యాడు.

“అయ్యో! విస్సూ! విస్సూ!” అంటూ కంగారు పడింది రత్న. “విస్సూ ఏడి?” అంటూ గొట్టం ముఖంలో తొంగి చూస్తూ వెనుక వున్న అమోఘ్ ని అడిగింది.

రత్నకి బెదురు కాస్త ఎక్కువని తెలిసిన అమోఘ్ వెనుక నుండి ఓ సారి కెవ్వున కేకేశాడు. ఆ చప్పుడుకి తుళ్లిపడి ముందున్న గొట్టంలో పడి జర్రున జారి కన్నుమూసి తెరిచేలోపు అవతలి కొసకి చేరుకుంది రత్న.

ఆమె వెనుకే అమోఘ్ కూడా మిట్టీని చేతుల్లో గట్టిగా పట్టుకుని గొట్టం లోంచి జర్రున జారాడు.

ఎలాగోలా రాజహంస సిబ్బంది వీనస్ నౌకలోకి చేరిపోయారు.

వీనస్ నౌక పైలట్ మనిషి కాడని గుర్తించిన అమోఘ్, రత్న లు ఒక్క క్షణం అవాక్కయ్యారు. వాడొక రోబో. అయితే విస్సూ లాగా చిన్నగా, ముద్దుగా లేడు. ఎత్తుగా, బొద్దుగా, ఉక్కుతో చేసిన మద్దిచెట్టులా ఉన్నాడు. కళ్ల స్థానంలో చింతనిప్పులాంటి ఎర్రని కాంతులు రగులుతున్నాయి.

ఆ వీనస్ రోబో తన సీట్ లోంచి లేచి భూమి నుండి వచ్చిన బృందం వైపు రెండు అడుగులు వేశాడు. నడుస్తుంటే కాళ్ల, కీళ్ల కదలికలకి ఓ ముద్రణ యంత్రం పని చేస్తున్నట్టు చప్పుడు అవుతోంది. మాట్లాడితే ఉరుములు ఉరుముతున్నట్టు ఉంది.

"భలే ఉక్కు రౌడీ తగిలాడు," రత్న అమోఘ్ పక్కకి ఒరిగి చెవిలో గుసగుసగా అంది. నవ్వు ఆపుకోడానికి పెదాలు బిగించాడు అమోఘ్.

"నా పేరు జోరిన్," అంటూ ఆ నల్లని రోబో తనని తాను పరిచయం చేసుకున్నాడు. విస్సూ, అమోఘ్, రత్నలు కూడా తమని తాము పరిచయం చేసుకున్నారు.

వీనస్ నౌక అవరోహణ ప్రారంభించింది. అంతవరకు ఎక్కడో కిందన కనిపించిన మేఘాలు ఇప్పుడు క్రమంగా దగ్గరపడుతున్నాయి. మేఘాలు దగ్గరవుతున్న కొద్ది నౌక వేగం కూడా మందగిస్తున్నట్టు అనిపించింది ఆమోఘ్ కి.

"వేగం తగ్గుతోంది ఏం?" జోరిన్ ని అడిగాడు అమోఘ్.

“అంతరిక్ష యానం నుండి వాయుయానానికి మారుతున్నాం.” అన్నాడు జోరిన్ తల కదపకుండా. “ఇదొక ఆంఫీ షటిల్. అంతరిక్షంలోను, గాల్లోను కూడా ప్రయాణించగలదు. దీన్ని మా దేశం నుండి అంతరిక్షం వరకు దేన్నయినా రవాణా చేయడానికి వాడుతాం.”

అంతలో పెద్ద శబ్దం చేస్తూ వీనస్ నౌక మీద ఓ పెద్ద తిత్తి లాంటిది, పరిమాణం పెరుగుతూ కనిపించింది. అందులోకి ఏదో వాయువు పూరించబడుతున్నట్టు ఉస్సని చప్పుడవుతోంది. నౌకకి ఇరుపక్కలా రెండు చిన్న రెక్కల్లాంటివి బయటికి పొడుచుకొచ్చాయి. దిశా నిర్దేశం చెయ్యడానికి వెనుక పక్క ఓ చుక్కాని ప్రత్యక్షమయ్యింది. రెక్కల అడుగున ఉన్న ప్రొపెల్లర్లు పని చేస్తుంటే సగం గాలిబుడగలా సగం విమానంలా పని చేసే ఆ విచిత్ర ఆకాశయానం సున్నితంగా మబ్బుల పొరలోకి ప్రవేశించింది.

గులాబిరంగు గాలి బుడగ చేత మోయబడుతున్న నల్లని నౌక తెల్లని మబ్బుల మధ్యలో కదులుతుంటే గులాబిరేకుని మోసుకుపోతున్న తేనెటీగ మంచులో ఎగురుతున్నట్టు ఉంది. నౌక ఇంకా ఇంకా కిందకి పోతున్నా మబ్బులు మాత్రం అంతులేనట్టుగా ఉన్నాయి. అమోఘ్ కి ఈ విషయం చాలా వింతగా అనిపించింది.

భూమి మీద మబ్బు పొర చాలా సన్నగా ఉంటుంది. విమానం లో కిందకి దిగుతున్నప్పుడు నిముషం తిరగకుండా మబ్బు పొరను దాటేయొచ్చు. ఈ అనుభవం అమోఘ్ కి ఎన్నో సార్లు కలిగింది. కాని ఇక్కడ అరగంట పైగా ప్రయాణించినా మబ్బులు తమని ఇంకా అన్ని పక్కలా చుట్టుముట్టి ఉన్నాయి.

వీనస్ నుండి వచ్చిన ఆంఫీ షటిల్ వాలు కిటికీల్లోంచి రత్న తమ చుట్టూ వెలసిన హద్దుల్లేని మేఘమండలాన్ని, ఆ వింతైన పొగప్రపంచాన్ని కళ్లింత చేస్తూ చూస్తుండిపోయింది. మెలికలు తిరిగే పొగస్తంభాలు పైన కనిపించని ఆకాశాన్ని ఎక్కడో అడుగున కనిపించని నేలతో సంధిస్తున్నట్టు ఉంది. మబ్బులతోనే కొండలు, లోయలు, గుట్టలు, మిట్టలు, నదులు, ఏళ్లు ఏర్పడినట్టు ఉన్నాయి. చూసే కళ్లు ఉంటే వాటిలోనే పరిచయస్థుల, అపరిచితుల ముఖాల రూపురేఖలు కూడా కనిపిస్తాయి.

“ఏయ్! అమోఘ్! ఆ మబ్బు చూడు,” అంది రత్న ఒక మబ్బుని చూపిస్తూ. “అచ్చం మన టీవీలో ప్రసంగం చెప్పే చిదానంద స్వామిలా లేదూ?”

“అబ్బ! ఏంటి రత్నా ఇక్కడ కూడా..” నవ్వేసి మరో కిటికీ వైపు తిరిగిపోయాడు అమోఘ్.

ఊరేగింపు కొచ్చిన ఏనుగుని తాకి తుర్రుమనే పిల్లల్లా మబ్బు తునకలు ఆంఫీ షటిల్ ని కాస్తంత తాకి ఇట్టే మటుమాయం అవుతున్నాయి. రత్నకి వాటిని తాకాలనిపించింది.

“ఇదుగో ఉక్కు...” అని నాలుక్కరుచుకుని, “ఇదుగో బాబూ! ఓ సారి కిటికీ తెరుస్తావా? చెయ్యి బయట పెట్టాలనుంది,” అభ్యర్థించింది.

“కాలిపోతుంది,” హెచ్చరించాడు  జోరిన్. “అవి సల్ఫ్యూరిక్ ఆసిడ్ మబ్బులు.”

“అవును రత్నా! అపుడే మర్చిపోయావా?” అమోఘ్ గుర్తుచేస్తూ అన్నాడు.

వీనస్ మేఘాల  మీద అంత సేపు రత్న పెంచుకున్న మమకారం అంతలో ఆవిరైపోయింది.



“ఇదే మా దేశ రాజధాని. వజ్రపురి,” నిర్లిప్తంగా ప్రకటించాడు జోరిన్.

ముసురుకున్న మబ్బుల్లోంచి ఎప్పుడు ఊడిపడిందో తెలీదు గాని కిటికీ లో కనిపిస్తున్న ఆ బృహన్నిర్మాణాన్ని చూస్తూ రత్న, అమోఘ్ లు నోరెళ్లబెట్టారు. విస్నూ చెవి చక్రాలు అలజడిగా కదిలాయి. ఇలాంటి నిర్మాణం గురించి తన డేటాబేస్ లన్నీ హడావుడిగా  తిరగేస్తున్నాడేమో. మిట్టీ కూడా తన గొంతుకి పని పెట్టింది.

“ఇదా మీ దేశం,” అర్థం గాక అడిగాడు అమోఘ్.

“దేశాలు మామూలుగా నేల మీద కదా ఉంటాయి...” అని అర్థోక్తిలో ఆపింది రత్న.

“వీనస్ నేల మీద పరిస్థితులు చాలా విపరీతంగా ఉంటాయి. అందుకని మా దేశాన్ని ఇలా మేఘాల మధ్య నిర్మించారు.”

“మరి నేల ఇంకా ఎంత దూరంలో వుంది,” అడిగాడు విస్నూ.

“యాభై కిలోమీటర్లు.”

“యాభై...కిలోమీటర్లా?” అదిరిపడ్డాడు అమోఘ్. భూమి మీద మబ్బులు 2-6 కిమీమీటర్ల ఎత్తుకి మించి వుండవు. “మరి ఇంత ఎత్తు మీద ఎందుకు కట్టారు?”

“వీనస్ నేల మిద పరిస్థితులు విపరీతంగా ఉంటాయి. ఈ ఎత్తులో ఐతే ఉష్ణోగ్రత, వాయు మీడనం భూమి మీద పరిస్థితులకి సన్నిహితంగా ఉంటాయి.”

గాలిలో తేలుతున్న ఆ విచిత్ర నగరం, వజ్రపురి పట్టణం, క్రమంగా దగ్గర పడుతోంది. వ్యాసం మూడు, నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. చదునైన వృత్తాకార పళ్లెం లాంటి తలం మీద బృహత్తరమైన గాజు స్థూపాలు – డోమ్ లు – విస్తరించి వున్నాయి. బోర్లించిన గాజు పాత్ర లాంటి ఓ పెద్ద డోమ్ మొత్తం నగరాన్ని కప్పి వుంది. పైనున్న పెద్ద డోమ్ మీద ఎండ పడి దాని అంచు మీద ఒక చోట తీక్షణంగా మెరుస్తోంది. లోపల ఇంకా ఎన్నో చిన్న డోమ్ లు ఒక దాంట్లో ఒకటి, ఒకదాని పై ఒకటి, పిల్లలు ఆడుకునే సబ్బుబుడగల్లా చిత్రవిచిత్రంగా అమరి వున్నాయి. పళ్లెంలాంటి ‘నేల’ అడుగున కూడా నగరం విస్తరించి వుంది. అయితే కిందకి పోతున్న కొద్ది వ్యాసం సన్నబడుతూ గుండ్రని అడుగు గల పాత్రలా వుంది. అయితే ఇది పారదర్శకంగా లేదు. దానిమ్మపండులో ఒదిగి వున్న గింజల్లా ఆ అడుగుభాగంలో లెక్కలేనన్ని గదులు కిక్కిరిసి వున్నాయి. ఎన్నో గదుల్లోంచి కాంతులు ప్రసరిస్తున్నాయి. మొత్తం నగరం యొక్క అంచులకి  ధృడమైన నానో తంతులతో చెయ్యబడ్డ త్రాళ్లు కట్టి వున్నాయి. ఆ త్రాళ్లకి అవతలి కొసలకి కట్టిన బృహత్తరమైన, రంగురంగుల గాలి బుడగలు ఎండలో అందంగా మిలమిలలాడుతున్నాయి. భూమి మీద వేడిగాలి బుడగల కింద మనుషులని మోసుకుపోయే బుట్టలా ఆ మొత్తం వజ్రపురి నగరం ఆ బృహత్తరమైన బుడగల చేత మోయబడుతోంది.

ఆంఫీ షటిల్ వజ్రపురి నగరానికి అంచున ఉన్న ఒక పోర్ట్ లో ఆగింది.

వజ్రపురి వింతలు చూసుకుంటూ జోరిన్  వెకనే భూమి బృందం నడిచింది.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వేగంగా ముందు నడుస్తున్నాడు ఆ ఉక్కు రాకాసి.

తనని అంటిపెట్టుకుని నడవడానికి తక్కిన రత్న, అమోఘ్, విస్సూలకి చాలా కష్టంగా వుంది. ఇక మిట్టీ అయితే కాళ్లలోని బలవంతా ఉపయోగించి దౌడు తీస్తోంది.

“ఇంతకీ మనం ఎక్కడికి వెళ్తున్నాం జోరిన్?” అడిగాడు అమోఘ్.

“మా అధినేత దగ్గరికి,” వెనక్కి తిరక్కుండానే సమాధానం చెప్పాడు జోరిన్.

“మీ అధినేత పేరేంటి?”

“రోనన్. అమేడ్రియా రోనన్.”

మరో పది నిముషాల నడక తరువాత నగరం కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ ఓ పెద్ద అర్థగోళాకార భవనం వుంది. ఇది పారదర్శకంగా కాక లేత గోధుమ రంగులో వుంది. చుట్టూ తెల్లని స్తంభాల మీద రంగురంగుల జెండాలు ఉన్నాయి.

“ఇది మా రాజధానిలోని మంత్రాలయం,” అన్నాడు జోరిన్ ఆ కార్యాలయాన్ని సమీపిస్తూ.

“ఏంటా జెండాలు?” అడిగాడు అమోఘ్.

“అవి దేశ రాష్ట్రాల చిహ్నాలు. మొత్తం పద్నాలుగు రాష్ట్రాలు ఉన్నాయి.”

భవనానికి బాగా దగ్గర పడ్డాక నడుస్తున్న వాడల్లా ఆగి వెనక్కి తిరిగి  జోరిన్ ఇలా అన్నాడు –

“లోపల పూర్తిగా నిశ్శబ్దంగా ఉండాలి. ఆయన చెప్పేది వినండి. అనవసరమైన  ప్రశ్నలు అడక్కండి.”

మరో రెండు అడుగులు ముందుకేసి భవనం అంచు వద్ద నించుని చెయ్యి పైకెత్తాడు జోరిన్. వెంటనే ఆ ప్రదేశంలో ఓ ద్వారం ఏర్పడి తెరుచుకుంది. జోరిన్ లోపలికి నడిచాడు. వెనకే విస్సూ, మిట్టీ అనుసరించారు. లోపలికి అడుగు పెట్టబోతున్న అమోఘ్ కళ్లని ద్వారం పైన కనిపించిన ఓ చిహ్నం ఆకర్షించింది. ఒక్కసారిగా బిగుసుకుపోయి ముందుకు నడవబోతున్న రత్న చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. రత్న వెనక్కి వెళ్లి పైన కనిపించే చిహ్నం చూసి గొంతులోంచి తన్నుకొస్తున్న కేకని ఆపుకుంది.

జోరిన్ వెనక్కి తిరిగి చూశాడు. చింతనిప్పుల కళ్లలోని కాఠిన్యం చూసి జడుసుకుని రత్న, అమోఘ్ లు లోపలికి ఉరికారు.

అదేదో ప్రభుత్వ కార్యాలయంలా కోలాహలంగా ఉంటుందని ఆశించిన భూమి బృందం, లోపల కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్య పోయింది. లోపల అంతా శూన్యంగా వుంది. కేంద్రంలో మాత్రం తీక్షణమైన తెల్లని తేజం విలసిల్లి వుంది. పరిసరాల వద్ద అంతా చీకటిగా వుంది. అమోఘ్ కి తాను చూసిన ఓ ప్లానెటేరియమ్ గుర్తొచ్చింది.

జోరిన్ ఆ బృందాన్ని ఆ తేజం వున్న చోటి దాకా తీసుకెళ్లి ఆగాడు.

అంతలో కనిపించని డప్పుల ఢమడమ ధ్వానాలు వినిపించాయి. భేరీ నినాదాలు మారుమ్రోగాయి. తెల్లని తేజో భూమిక మీద చూరు దాకా విస్తరించిన ఓ చిత్రం ప్రత్యక్షమయ్యింది. తెరలేకుండా ఏర్పడ్డ ఆ చిత్రం చూసి రత్న నోరెళ్లబెట్టింది. మిట్టీ "గయ్ం" మని అరవబోతే విస్సూ 'ఉష్షు" అని ఊర్కోబెట్టాడు. అదేదో హోలోగ్రామ్ లాంటిది అయ్యుంటుందని సరిపెట్టుకున్నాడు అమోఘ్.

"మేఘదేశానికి స్వాగతం!" చిత్రంలో కనిపించిన ముఖం మాట్లాడింది.

ముఖం యొక్క రూపురేఖలలో స్పష్టత లేదు. మబ్బుల పదార్థంతో ఏర్పడ్డ ముఖంలా వుంది. బూడిద పులిమినట్టు, పొగచూరినట్టు చర్మం. పెదవుల్లో కాస్త ఎరుపు. కళ్లు ఉండే చోట నల్లని గొయ్యిలు. స్వరం మాత్రం మానవ స్వరంలా, పురుషుడి స్వరం లానే వుంది.

"భూమి బృందానికి స్వాగతం. మా మేఘదేశానికి స్వాగతం. వీనస్ గ్రహం యొక్క వాయుమండలం అంతటా మా తేలే ఊళ్లు విస్తరించి వున్నాయి. మీకు కావలసినంత కాలం ఇక్కడ ఉండి మా ఆతిథ్యం స్వీకరించండి. మా జోరిన్ మీకు కావలసినవన్నీ సమకూరుస్తాడు." హోలో చిత్రం పెదవుల మీద చిరునవ్వు విరిసింది.

జోరిన్ నమ్రంగా తల పంకించాడు.

“ఇక సెలవు తీసుకోనా మరి...” మాయం కాబోతున్న హోలో చిత్రం కాస్త చెదిరింది.

“ఒక్క నిముషం గౌరవనీయులైన రోనిన్ గారు!” అమోఘ్ ఆ హోలో చిత్రం దగ్గరిగా  రెండడుగులు వేసి అన్నాడు. “మా చెల్లెల్ని ఎవరో అపహరించారు. తనని అపహరించిన వారు వీనస్ కి వచ్చారని మా అనుమానం. మా ప్రయత్నంలో మీరేమైనా సహాయం చెయ్యగలరా?”

హోలోచిత్రంలో ముఖం మీద చిరునవ్వు మటుమాయం అయ్యింది. జోరిన్ కేసి కళ్లతో ఏదో సంజ్ఞ చేసింది. చిత్రం అర్థాంతరంగా అంతర్థానమయ్యింది.

“పదండి వెళ్దాం...” అంటూ జోరిన్ ముందు నడిచాడు.

అందరూ ఆ సమావేశ మందిరం నుండి బయటికి వచ్చారు.

“హేయ్ జోరిన్!” అరిచాడు అమోఘ్. “మా చెల్లెల్ని అపహరించిన ఆగంతకులు ఇక్కడే ఎక్కడో ఉన్నారు. వాళ్లని ఎక్కడున్నా పట్టుకోవాలి.”

ధృఢమైన పదఘట్టనలతో ఆ చెట్టంత ఉక్కురోబో వెనక్కి తిరిగి చూడకుండా సాగిపోతున్నాడు.

ఉక్రోషం పట్టలేక పరుగెత్తుకెళ్లి జోరిన్ చెయ్యి పట్టుకుని ఆపబోయాడు అమోఘ్. జోరిన్ అమోఘ్ చొక్కా పట్టుకుని ఓ తూనీగని పైకెత్తినట్టుగా గాల్లోకి లేపాడు.

“ఏయ్! నన్ను కిందకి దించు. మర్యాదగా చెప్తున్నాను. కిందకి దించుతావా లేదా?” పెనుగులాడాడు అమోఘ్.

ఓ నిముషం పాటు అలాగే గాల్లోకి ఎత్తి పట్టుకుని అమోఘ్ కేకలు ఆపాక కిందకి దింపాడు.

భూమి బృందానికి తమ పరిస్థితి అర్థమయ్యింది. ఆ తరువాత మళ్లీ ఎవరూ జోరిన్ ఆదేశాలకి అడ్డుచెప్పడానికి ప్రయత్నించలేదు. విహార యాత్రలో టీచర్ ని అనుసరించే ఎల్.కె.జి. పిల్లల్లా ఆ రోబో వెంటే బుద్ధిగా నడిచారు.

ఇంతవరకు తాము చూసిన నగర భాగంలో ఎక్కడా పచ్చదనపు ఛాయలే లేవు. ఇప్పుడు మొట్టమొదటి సారిగా ఒక చోట, రెండు దార్లు కలిసే చోట ఓ చెట్టు కనిపించింది. అది నారింజ చెట్టులా వుంది. అయితే

భూమి మీద కనిపించే నారింజ చెట్టులో ఎత్తులో మూడోవంతు కూడా లేదు. బోన్సాయి చెట్టు కన్నా కాస్త పెద్దగా ఉంది. దాన్ని చూడగానే మిట్టీ ఉత్సాహంగా దగ్గరికి పరుగెత్తింది.

జోరిన్ నడుస్తున్న వాడల్లా ఆగి  మిట్టీ వైపు చూశాడు.

"అయ్యా జోరిన్ గారు! మా మీట్టీ వట్టి అమాయకురాలు. దాన్నేవీ అనకండి పాపం. దానికి నేను చెప్తానుగా," అంటూ రత్న మిట్టీ దగ్గరికి పరుగెత్తింది.

అక్కడి నుండి మిట్టీ పారిపోబోతుంటే చటుక్కుని మిట్టీని అందుకుని పైకెత్తుకుంది. అలా వంగి పట్టుకోబోతున్నప్పుడు తన దృష్టిని కింద పడిన ఓ వస్తువు ఆకర్షించింది. చటుక్కున తీసి గుప్పెట్లో బిగించింది.

"రత్నా! త్వరగా రా!" కేకేశాడు అమోఘ్. ఆలస్యం అవుతే ఏం జరుగుతుందో తనకి బాగా తెలుసు.

రత్న వెనక్కి వచ్చి, "అల్లరి మిట్టీ! ఇక దీని పూచీ నీదే" అంటూ మిట్టీని అమోఘ్ చేతుల్లో కుదేసింది. మిట్టీని అందిస్తూనే తన పిడికిట్లో రహస్యంగా దాచుకున్న వస్తువుని అమోఘ్ చేతుల్లోకి గుట్టుగా చేరవేసింది.

దాన్ని చూడగానే అమోఘ్ దవడ కండరం బిగుసుకుంది. అయితే ఉక్రోషాలు, ఆవేశాలు ప్రదర్శించడానికి ఇది సమయం కాదు. కిమ్మనకుండా ఆ వస్తువుని తన నిక్కరు జేబులో దాచుకున్నాడు.

"ఇప్పుడు మనం తోట చూడడానికి వెళ్తున్నాం," ప్రకటించాడు జోరిన్.

నగరానికి అవతలి కొసన విమానాశ్రయం లాంటిది వుంది. అయితే ఈ విమానాలు భూమి విమానాలలా లేవు. ఇరవయ్యవ శతాబ్దం మొదట్లో యూరప్ లో వాడబడ్డ జెపెలిన్ లలా వున్నాయి. దోసకాయ ఆకారం కలిగి సుమారు ముప్పై మీటర్ల పొడవు కలిగి వున్నాయి. దాని అడుగున గల మందిరంలో ఓ పైలట్, మరో పన్నెండు మంది ప్రయాణీకులకి స్థలం వుంది.

"ఇక్కడి నుండి 'తోట' ప్రస్తుతం ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది," జెపెలిన్-విమానానికి తనే పైలట్ గా నడిపిస్తూ అన్నాడు జోరిన్.

తోట 'ప్రస్తుతం' ఫలానా దూరంలో ఉండడం ఏంటో ఎవరికీ అర్థం కాలేదు. కాని వివరణ కోసం అడిగే ధైర్యం ఎవరికీ లేదు.

"వీనస్ వాయు పొరలో తేలే ఈ ఊళ్లు ఒక చోట స్థిరంగా ఉండవు. గాలికి నెమ్మదిగా అటు ఇటు కొట్టుకుపోతూ ఉంటాయి. కాబట్టి ఏ ఊరు ఎక్కడుందో ఎప్పటికప్పుడు కనిపెట్టుకుంటూ ఉండాలి." జోరిన్ యే పాపం పృథ్వీవాసుల మీద దయదలిచి వివరించాడు.

పేరుకి విమానయానమే గాని, అది పోటెక్కిన గోదారి మీద ఎగిరెగిరి పడుతున్న పడవ గతిలా వుంది. అమోఘ్ కి కిందటి సంవత్సరం తను ఎక్కిన ఓ రాకాసి రోలర్ కోస్టర్ గుర్తొచ్చింది. కొన్ని సార్లు ఉల్కలా రాలిపోతూ ఉంటుంది. కొన్నిసార్లు డేగలా నిటారుగా పైకి దూసుకుపోతుంది. ఏ క్షణం ఆ విచిత్ర యానం విరిగి వక్కలవుతుందా అని అందరూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కూర్చున్నారు. జోరిన్ మాత్రం 'ఇదంతా మామూలే' అన్న ఫక్కీలో నిబ్బరంగా నడుపుతున్నాడు. ఓ అరగంట పాటు ఈ 'ఎత్తిపోతలు' సాగాక ఓ 'ఊరు' దగ్గరపడింది.

చూడడానికి అది కొంచెం వజ్రపురి లాగానే వుంది. అయితే రాజధాని నగరంలో ఎక్కువగా భవనాలు ఉన్నాయి. భవనాల స్థానంలో ఇక్కడ పచ్చని చెట్లు ఉన్నాయి.

"ఇదే తోట," అని ప్రకటించాడు జోరిన్ విమానాన్ని దాని పోర్ట్ లో ఆపుతూ.

లోపలికి అడుగుపెడుతూనే అక్కడ కనిపించిన దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు అమోఘ్.

"ఇది మరో గ్రహం అంటే నమ్మబుద్ధి కావడం లేదు. అచ్చం భూమి మీద హరితగృహాల లాగానే వుంది."

వజ్రపురిలో లోపల కృత్రిమంగా వాతావరణాన్ని నియంత్రించడం వల్ల కాబోలు చల్లగా వుంది. కాని ఇక్కడ తెగ ఉక్కపోస్తోంది.

"మీ భూమి మీద దొరికే ఎన్నో మొక్కలు, ముఖ్యంగా మనుషులు వాడే మొక్కల జాతులు, ఇక్కడ ఉన్నాయి. రెండున్నర వేలకి పైగా మొక్కల జాతులు ఉన్నాయి. కేంద్రంలో పెద్ద చెట్లు, అంచుల దగ్గర కాస్త చిన్న మొక్కలు ఉన్నాయి... బరువు సరిగ్గా తూగాలిగా మరి."

“బరువు తూగడమేంటి? ఇదేమైనా పడవా?” మెల్లగా అమోఘ్ చెవిలో అంది రత్న.

“అవును మరి. ఈ తోటంతా గాల్లో తేలుతోందిగా?”

“అవును కదూ? మర్చేపోయాను.” తన పరిసరాలని  ఓ సారి ఇబ్బందిగా చూసుకుంది రత్న.

“మరీ… మీ తోట… ఎప్పుడూ కూలిపోదా?” ధైర్యం చేసి అడిగింది జోరిన్ ని.

సమాధానం చెప్పకుండా ముందుకు నడిచాడు జోరిన్. అతడు నడుస్తుంటే పచ్చని చెట్ల  మధ్య ఓ నల్లని ఉక్కు చెట్టు నడుస్తున్నట్టు ఉంది.

“వీటిని వీనస్ వాసులు ఇళ్లలో అలంకారంగా వాడుతారు,” అన్నాడు జోరిన్ కుడి పక్క కనిపించే ముళ్లజెముడు మొక్కల్ని చూపిస్తూ.

“కాక్టస్ మొక్కలు,” అన్నాడు విస్సూ. “ఎక్కువ నీరు అవసరం లేకుండా పెరుగుతాయి.”

ఓ బంతి మీద సమంగా మేకులు గుచ్చినట్టున్నాయి కొన్ని. కొన్నిటికి ఒళ్లంతా ముళ్లున్న మెలికలు తిరిగే దేహాలు ఉన్నాయి. బొచ్చుకుక్క తోకలా జాడీ లోంచి పైకొచ్చి కిందకి వంగాయి కొన్ని. మిట్టీ అది చూసి ముచ్చటపడి పరుగెత్తి వెళ్లి వాసనచూడబోయి, కుయ్ మని అరిచి వెనక్కి పరుగెత్తుకొచ్చింది. క్రూరత్వంతో కోమలత్వం కూడినట్టు కొన్నిటికి చక్కని పూలు కూడా ఉన్నాయి. కొన్నిట్లో అయితే నల్లని బంతిలాంటి నిర్మాణంలోంచి పసుపు పచ్చని పూలు పైకి పొడుచుకొచ్చాయి.

“గొబ్బెమ్మల మీద చామంతులు పెట్టినట్టు ఎంత ముద్దుగా ఉన్నాయో!” వాటిని చూసి మురిసిపోయింది రత్న.

కాస్త ముందుకి నడిచాక  ఓ చిన్న కొలను కనిపించింది. అందులో రంగురంగుల అరవిందాలు ఉన్నాయి. తెలుపు, పసుపు, లేత నారింజ రంగు, చిక్కని నీలం… వీనస్ మీద గగన నగరాలకి హంగు కూర్చే పూల రంగులు అనేకం. పద్మాలు అంటే పడి చచ్చే రత్న కి వాటిని చూడగానే అక్కణ్ణుంచి కదలబుద్ధి కాలేదు. జోరిన్ మరో సారి గుర్రుమని చూస్తేగాని ఆమె కాళ్లలో చలనం రాలేదు.

కేంద్రం దగ్గర పడుతున్న కొద్దీ రకరకాల పళ్ల చెట్లు ఎదురవుతున్నాయి.

నిమ్మ, నారింజ, దబ్బకాయ  మొదలుకొని ఎన్నో రకాల సిట్రస్ పళ్ల చెట్లు ఉన్నాయి. ప్రత్యేక మందిరాలలో స్ట్రాబెరీలు, ఆపిల్ చెట్లు కూడా ఉన్నాయి. అరటి చెట్లు చూడగానే అమోఘ్ కి నోరు ఊరింది. తోటలో పళ్ల చెట్లు ఉన్న విభాగం అన్నిటి కన్నా తనకి బాగా నచ్చింది.

పళ్ల చెట్లు ఉన్న చోటికి నడిచి వాటి మధ్య కాసేపు తిరిగాడు అమోఘ్. తోటలో మిగతా ప్రాంతాలకి ఇక్కడికి మధ్య ఓ ముఖ్యమైన తేడా కనిపించింది. మిగతా చోట్ల మొక్కలు కూజాల్లో ఉన్నాయి. ఇక్కడ చెట్లన్నీ నేరుగా మట్టిలోనే పెరుగుతున్నాయి. పళ్ల చెట్లు ఉన్న ప్రాంతం కొన్ని ఎకరాలు ఉంటుంది. కనీసం కొన్ని అడుగుల లోతైనా ఆ చెట్ల వేళ్లు లోపలికి చొచ్చుకుపోతాయి అనుకుంటే... అంత మట్టి ఎక్కడి నుండి వస్తుంది?

అంతలో బ్రహ్మాండమైన శబ్దమై నేలంతా కంపించడం మొదలెట్టింది.

“అమ్మో! తోట కూలిపోతోంది!” అరిచింది రత్న. మిట్టీని ఎత్తుకుని చెట్ల దగ్గరికి పరుగెత్తింది. విస్సూ అక్కడే నించుని తన పరిసరాలని పరిశీలిస్తూ ఉండిపోయాడు.

జోరిన్ మాత్రం అదేమీ పట్టనట్టు నడుస్తూ ముందుకి సాగిపోయాడు. మరో రెండగులు వేసి తక్కిన వాళ్ళు కనిపించకపోయే సరికి వెనక్కి నడిచాడు.

కంపన అలాగే కొనసాగుతోంది గాని నేల బద్దలై, తోట ‘కూలిపోతున్న’ ఛాయలేవీ కనిపించలేదు.

అమోఘ్ ధైర్యం చేసి చెట్ల మధ్య నుండీ బయటికి నడిచాడు.

“ఏంటా శబ్దం?” జోరిన్ ని అడిగాడు అమోఘ్.

“అవి మట్టి పంపులు,” క్లుప్తంగా సమాధానం చెప్పాడు జోరిన్.

“మట్టి పంపులా? అంటే?”

“ఇక్కడి మట్టంతా కింద వీనస్ ఉపరితలం నుండి వస్తుంది. ఈ పంపులు ఇక్కడి దాకా పంప్ చేస్తాయి.”

“యాభై కిలోమీటర్ల ఎత్తుకి మట్టిని పంప్ చేస్తాయా?” నిర్ఘాంతపోయి అడిగాడు అమోఘ్.

“అవును. అయితే దారి పొడవునా ప్రతీ కిలోమీటర్ కి పంప్ లు  ఉంటాయి.”

“అయినా... నీళ్లనో, వాయువులనో పంప్ చేస్తారుగాని మట్టిని ఎలా పంప్ చేస్తారు?”

“కింద వీనస్ ఉపరితలం మీద ముందు పెద్ద డ్రిల్లింగ్ యంత్రాలు మట్టిని తవ్వుతాయి. ఆ మట్టిని బాగా మెత్తగా పొడిచేస్తాయి మరి కొన్ని యంత్రాలు. ఆ పొడిని బాగా గాల్లో కలియబెట్టి, ఆ ధూళిని పైకి పంప్ చేస్తాయి. పైకి వచ్చాక ఆ ధూళిని ఫిల్టర్ చేసి మట్టిని వేరు చేయడం జరుగుతుంది. అదంతా ఈ తోట కింద ఉన్న ఫాక్టరీలో జరుగుతుంది. వాటిలోకి అధిక పీడనం దగ్గర నీరు కలుపుతారు. అలా ఏర్పడ్డ మిశ్రమంలో ఫెర్రో మెగ్నీషియమ్ ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అప్పుడది మీ భూమి మీద దొరికే నల్లరేగడి మట్టిలా తయారవుతుంది. అలాంటి మట్టిలో మొక్కలు ఏపుగా ఎదుగుతాయి.”

అమోఘ్ కి అదంతా ఏదో మహాద్భుతంలా అనిపించింది. యాభై కిలోమీటర్ల పొడవున్న గొట్టం ద్వార నేల లోంచి ఆకాశంలోకి మట్టిని పంప్ చెయ్యడమా? అసలు అది సంభవమేనా? పైగా అంత ఎత్తులో ఆ మట్టితో ఆకాశవనాలు సృష్టించడమా?

అంత వరకు కొన్ని పొట్టి చెట్ల కింద నక్కిన రత్న కాస్త ధైర్యం చేసి చెట్ల కింద నుండి బయటికి వచ్చింది. ఆమె ఒంట్లో ఒణుకు మాత్రం ఇంకా తగ్గలేదు.

“ఇక నా వల్ల కాదు అమోఘ్ బాబూ. నాలుక పిడచకట్టుకుపోతోంది. నోట్లో ఏదో కాస్త పడకపోతే ఇక ఇక్కడే రాలిపోతానేమో.”

“ఓహ్, మర్చేపోయాను. మీరు బాగా అలసిపోయి వుంటారు. రండి టీగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుందురు గాని,” అంటూ జోరిన్ పళ్ల చెట్ల వెనక్కి తీసుకెళ్లాడు.

జోరిన్ ప్రవర్తన అమోఘ్ కి చిత్రంగా అనిపించింది. కొద్దిసేపటి క్రితం అంత కిరాతకంగా ప్రవర్తించింది ఈ... మని... ఈ రోబోయేనా? సైన్స్ లో ఎంత జటిలమైన విషయాన్నైనా కాస్త కష్టపడితే అర్థం చేసుకోవచ్చు గాని పెద్దవాళ్ల మనసులో ఏవుందో కనిపెట్టడం కష్టం అని తనకి ఎప్పుడూ అనిపించేది. కాని రోబోలని, అంటే ఈ కదిలే యంత్రాలని అర్థం చేసుకోవడం కూడా ఇంత కష్టమా?

ఇక రత్న పరిస్థితి వేరు. పెరట్లో రాకెట్ ని చూసినప్పుడే తన చుట్టూ జరుగుతున్న విడ్డూరాల గురించి ఎందుకు? ఏమిటి? మొదలైనవి అడగడం మానేసింది.

విస్సూ తక్కిన ఇద్దరితో బయటికి ఏమీ అనలేదు గాని తన తల లోని కంప్యూటర్ మెదడులో కూడా తాము ఉన్న పరిస్థితి నుండి ఎలా బయట పడాలి అన్న విషయం మీద  కొన్ని స్పష్టమైన పథకాలు ఏర్పడుతున్నాయి.

'టీగృహం' రంగురంగుల అద్దాలతో ఏర్పడ్డ గోడలతో, ఆ గోడల మీద పాకే నానా రకాల పూలున్న లతలతో, మహా సొగసుగా వుంది.

"లోపల బోలెడు రకాల టీ దొరుకుతుంది. కొంత అల్పాహారం కూడా ఉంది. మీకు కావలసింది తీసుకోండి. నేను కాసేపట్లో వస్తాను." భూమి బృందాన్ని అక్కడ వదిలిపెట్టి పెద్ద చప్పుడు చేసే పదఘట్టనలతో వేగంగా నడుచుకుంటూ ఎటో వెళ్లిపోయాడు జోరిన్.

అందరూ లోపలికి అడుగుపెట్టారు. అదో విశలమైన గది. లోపల ప్రత్యేకమైన లైట్లు లేకపోయినా లోపల గోడల మీద, నేల మీద రంగుగాజుల్లోంచి వచ్చే కాంతులు వేసే రంగవల్లులు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గోడల వెంట వున్న పొడవాటి అరుగు మీద వరుసగా బోలెడు జాడీలు ఉన్నాయి. వాటికి కొళాయిలు ఉన్నాయి. పక్కనే కప్పులు ఉన్నాయి. విస్సూ తప్ప ఎవరికి కావలసినంత వాళ్లు తీసుకుని తాగారు. రత్న మిట్టీకి కూడా పట్టింది. అమోదముద్రగా తోకాడిస్తూ, మధ్యమధ్యలో మొరుగుతూ తాగింది మిట్టీ.

అందరికీ కాస్త ప్రాణం లేచొచ్చినట్టు అయ్యింది. ముందు అమోఘ్ గొంతు సవరించుకుంటూ అన్నాడు.

"మనం ఇక్కడ చిక్కుపడిపోయాం. మనమే కాదు అనూ కూడా ఇక్కడే ఎక్కడో ఉంది."

"అలా ఎలా అనగలుగుతున్నావు?" విస్సూ అడిగాడు.

"ఇందాక  మంత్రాలయానికి బయట ఆ మబ్బుల్లో చందమామ చిహ్నం కనిపించింది. అనూ గురించి అడిగితే  దాటేశాడు ఆ రోనిన్."

"మరి ఈ  ఉక్కురాక్షసుడు మంచోడో చెడ్డోడో అర్థం కావడం లేదు," అంది రత్న ఆందోళనగా. "క్షణానికో రకంగా ఉన్నాడు. వాణ్ణి చూస్తేనే భయంగా ఉంటోంది."

"అవును జోరిన్ ని నమ్మడానికి లేదు. ఇలాంటి రోబోలు నాకు తెలుసు. వాటి ప్రవర్తనలో ఒక స్థిరత్వం ఉండాలని లేదు. వాటిని శాసించేవాళ్లు ఎలా చెప్తే అలా నడుచుకుంటాయి," అన్నాడు విస్సూ.

“మరైతే అనూ ఎక్కడుందో ఎలా కనుక్కోవడం బాబూ?” రత్న అడిగింది.

అమోఘ్ నెమ్మదిగా తన జేబులోంచి ఇందాక తనకి వజ్రపురిలో నేల మీద దొరికిన వస్తువు పైకి తీశాడు. అనూ కాలి గజ్జెల్లో ఒకటి. చూడగానే రత్న కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. చటుక్కున తీసి వాటిని ముద్దు పెట్టుకుంది.

“అనూ పాపకి ఏం కాదుకదా అమోఘ్ బాబూ?” బెంబేలు పడుతూ అడిగింది.

“అనూ సురక్షితంగా వుందనే నా నమ్మకం.”

“మరి తనని ఎలా రక్షించడం?”

“ముందు ఇక్కడి నుండి తప్పించుకునే మార్గం ఆలోచించాలి.”

“అందుకు మీకివి కావాలి,” అంటూ విస్సూ తన నడుము వద్ద ఉన్న ఓ రహస్యమైన తలుపు తెరిచి రెండు చిన్న పరికరాలు తీసి ఒకటి అమోఘ్ కి, ఒకటి రత్నకి ఇచ్చాడు. స్ట్రాప్ లేని ఎలక్ట్రానిక్ వాచీలలా వున్నాయి. అరచేతిలో పట్టేటంత వున్నాయి.
“ఇవి కమ్యూనికేటర్లు. సెల్ ఫోన్ల లాంటివి. వీటితో మనం ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చు. కావాలంటే ప్రజ్ఞ కి కూడా డయల్ చెయ్యొచ్చు.” దాని మీద మీటలు ఎలా వాడాలో చెప్పాడు.

“మరి నీకు ఇలాంటి ఫోన్ అక్కర్లేదా?” అడిగాడు అమోఘ్.

“నా ఫోన్ ఇదుగో ఇక్కడ వుంది,” అన్నాడు విస్సూ తన తలని సూచిస్తూ. “నేను ఈ తోట అంచు దాకా వెళ్లి అదనపు విమానాలు ఏవైనా ఉన్నాయేమో చూస్తాను. అమోఘ్ నువ్వు ఈ టీ గృహం వద్దే కాపలా వుండు. జోరిన్ అల్లంత దూరంలో కనిపించగానే నాకు సంకేతం పంపు. రత్నా నువ్వు మిట్టీతో లోపలే వుండు.”
రత్న లోపలే ఓ పుట్టగొడుగు లాంటి కుర్చీ మీద కూర్చుంది. కాస్త భయం వల్లను, కాస్త అలసట వల్లను కళ్లు మూసుకుని తన ఇష్టదేవుణ్ణి, ‘క్రిష్ట’దేవుణ్ణి తలచుకుంది.

“క్రిష్టమూర్తీ! ఈ సంకటం నుండి నువ్వే గట్టెక్కించాలి తండ్రీ.”

అలా ఎంత సేపయ్యిందో తెలియదు. కళ్లు తెరిచి చూసేసరికి మిట్టీ తన ఎదుటే కూర్చుని ఎక్కడో దొరికిన చిక్కుడికాయతో కుస్తీ పడుతోంది. తలుపు వైపు చూసింది. అక్కడ ఏ అలికిడీ లేదు.
"వీళ్లిద్దరూ ఎక్కడి కెళ్లినట్టు? ఇంతసేపైనా రాకపోవడం ఏంటి?"

నెమ్మదిగా ధైర్యం చేసి తలుపు తెరిచింది.

తలుపు బయటే ఉంటాడనుకున్న అమోఘ్ కనిపించలేదు. విస్పూ జాడ కూడా ఎక్కడా లేదు.

అంతలో మిట్టీకి కాస్త దూరంలో ఏదో కనిపించి గోలగోలగా అరవడం మొదలెట్టింది.

"వీనస్ కి వచ్చినా దీని వాలకం మాత్రం మారలేదు," అని విసుక్కుంటూ రత్న దగ్గరికెళ్లి చూసింది.

అరచేతి పరిమాణంలో ఓ రక్తం మరక. పక్కనే అమోఘ్ జేబులో ఉండాల్సిన 'మబ్బు చాటు చందమామ' చిహ్నం.

అప్పుడు రత్న చేసిన ఆర్తనాదానికి  తోటంతా ప్రతిధ్వనించింది.

7. జ్వాలాముఖి చేసిన సాయం

ఏదో చప్పుడై  అమోఘ్ కి తెలివి వచ్చింది. దిగ్గున లేవబోయి “అబ్బా!” అని అరిచి మళ్లీ వెల్లకిల్లా పడ్డాడు.

తలలో వెనుక భాగంలో నొప్పి బాగా తెలుస్తోంది. తల తడుముకుని చూసుకున్నాడు. గట్టిపడ్డ రక్తపు ఛాయలు తెలుస్తున్నాయి.

అసలేం జరిగిందో గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. టీ గృహం బయట నించుని వున్నాడు. అంతలో ఎవరో వెనక నుండి కొట్టారు. ఆ తరువాత ఏం జరిగిందో గుర్తులేదు.

ఇప్పుడు తనెక్కడున్నాడు? తక్కిన వారేరి?

తన పరిసరాలని ఓ సారి పరిశీలనగా చూశాడు. ఇది తోట కాదు. ఏమిటీ ప్రదేశం? చుట్టూ పెద్ద పెద్ద యంత్రాలు ఉన్నాయి. వాటి చప్పుడుకి చివులు చిల్లులు పడుతున్నాయి. కొన్ని యంత్రాలలో మంటలు కనిపిస్తున్నాయి. బారైన కన్వేయర్ బెల్టులు ఆ పెద్ద హాలులో ఆ చివరి నుండి ఈ చివరి దాకా విస్తరించి వున్నాయి. వాటి మీద ఏదో పదార్థం రవాణా అవుతోంది. అవతలి కొసలో ఆ పదార్థం  ఓ పెద్ద తొట్టెలో గలగల మని చప్పుడు చేస్తూ పడుతోంది. మరో కొసలో పెద్ద పెద్ద సిలిండర్లు ఉన్నాయి. వాయువులని నిలువ చెయ్యడానికి వాడే పొడవాటి సిలిండర్లు. ఏం ఫాక్టరీ ఇది?

ఇంతకీ ఇక్కడికి ఎలా వచ్చాడు? ఎవరు తెచ్చారు? ఈ ఫాక్టరీ సంగతేంటో తెలుసుకోవాలి. యంత్రాల మధ్య సన్నని ఇరుకైన దారుల వెంట జాగ్రత్తగా నడుస్తూ వెళ్లాడు. అల్లంత దూరంలో ఓ పెద్ద గుట్టలాంటిది కనిపించింది.  కాస్త దగ్గరికెళ్లి చూశాడు. పాడైపోయిన,  పనికి మాలిన యంత్రభాగాలని అక్కడ పారేసినట్టు ఉన్నారు. తుప్పు పట్టినవి, జిడ్డు కారుతున్నవి, విరిగిపోయినవి…రకరకాల విడిభాగాలు… వాటి మీద ఓ చిన్న మెరిసే నున్నని గుండు లాంటిది కనిపించింది. నిజానికి ఆ గుండు పై భాగం మాత్రమే కనిపిస్తోంది. గుండు అవతలి పక్క ఉన్నట్టుంది. ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత కొద్దీ  అవతలి పక్కకి వెళ్లాడు. ఆ

వస్తువును చూడగానే నోట్లోంచి అప్రయత్నంగా ఓ కేక వెలువడింది. అయితే ఆ ప్రదేశమంతా వ్యాపించిన యంత్రాల ఘోషలో ఆ కేక ఆనవాలు లేకుండా కలిసిపోయింది.

"విస్సూ!" గుట్ట మీద పడి వున్న విస్సూని అమాంతం పైకెత్తి కౌగిలించుకున్నాడు అమోఘ్. విస్సూ నుండి ఎలాంటి స్పందన రాలేదు. కాళ్లలో, చేతుల్లో ఎలాంటి చలనం లేదు. చెవుల వద్ద రంగురంగుల కాంతుల లాస్యం లేదు.

ఎంత ఆపుకుందామనుకున్నా కన్నీళ్లు ఆగలేదు. విస్సూ ని మొదటి నుండీ కూడా ఓ రోబోలా, ఓ యంత్రంలా చూడలేదు. అలా చూడాల్సిన అవకాశం కూడా విస్సూ ఎప్పుడూ ఇవ్వలేదు. ఓ రోబోకి ఉండే ప్రత్యేకమైన పరిజ్ఞానం, సామర్థ్యం, ఒక మనిషికి ఉండే మానవత్వం – రెండూ కలిస్తే అదే విస్సూ. అనూ తప్పిపోయినప్పుడు, ఏం చెయ్యాలో తెలియక అంతా అగమ్య గోచరంగా ఉన్నప్పుడు నిజంగానే దేవుళ్లా మరో లోకం నుండి ఊడిపడ్డాడు. తనకెందుకు అని ఊరుకోకుండా తనని ఇంత దూరం తీసుకువచ్చాడు. దారి తెలియక సతమతమవుతుంటే దారి పొడవునా తోడుగా నిలిచి స్నేహాన్ని పంచాడు. తననిలా నిశ్చేష్టంగా చూస్తాడని అనుకోలేదు అమోఘ్. విస్సూ సన్నని, నాజూకైన టైటానియమ్ దేహాన్ని పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాడు అమోఘ్.

అంతలో తన చేతికి విస్సూ వీపు కింద భాగం వద్ద ఏదో ఖాళీగా ఉన్నట్టు అనిపించింది. వెనక్కి తిప్పి చూస్తే అక్కడ ఓ చిన్న తలుపు తెరిచి ఉండడం కనిపించింది. ఏంటా తలుపు? లోపం ఇక్కడుందా?

విస్సూ లో మళ్లీ చలనం తెప్పించే మార్గం వుందా?

అంతలో ఇందాక విస్సూ తోటలో ఇచ్చిన వాచీ లాంటి పరికరం 'కమ్యూనికేటర్' గుర్తొచ్చింది. జేబు తడుముకుని చూశాడు. హమ్మయ్య! అది జేబులోనే వుంది.

వెంటనే 'ప్రజ్ఞ' కి డయల్ చేశాడు. జరిగింది క్లుప్తంగా చెప్పాడు. విస్సూ పరిస్థితి వివరించాడు.

"అది విస్సూ బ్యాటరీ పాక్ ఉండే సాకెట్ అమోఘ్!" వివరించింది ప్రజ్ఞ. "ఎవరో బ్యాటరీలు తీసేశారు. అయినా ఫరవాలేదు. అదే సాకెట్ లో ఒక మూల ఓ చిన్న బటన్ ఉంటుంది. అది నొక్కితే ఎమర్జెన్సీ పవర్

పని చేస్తుంది. దాంతో కొన్ని గంటల పాటు పని చెయ్యగలడు. మీరు రాజహంసకి తిరిగి వచ్చాక కొత్త బ్యాటరీలు వేసుకోవచ్చు."

ప్రజ్ఞ చెప్పినట్టే చేశాడు అమోఘ్. తలలోనుండి కొన్ని క్షణాల పాటు రకరకాల బీపింగ్ చప్పుళ్లు వెలువడ్డాయి. చెవి చక్రాలు మళ్లీ కాంతులు చిందించాయి.

లేచి తన కాళ్ల మీద నించుంటూ ఏమీ జరగనట్టు "హలో!" అన్నాడు. అమోఘ్ తన చిట్టి రోబో నేస్తాన్ని మనసారా కౌగిలించుకున్నాడు.

ఏం జరిగిందో తనకి తెలిసినంత మేరకు చెప్పాడు. రత్న, మిట్టీలు ఇంకా తోటలొనే ఉండి ఉండాలి. అనూ సంగతి ఇంకా ఏమీ తెలియదు. తను వజ్రపురి లోనే ఉండి ఉండాలి. ఇద్దరినీ వెతికి పట్టుకుని ఇక్కడి నుండి వీలైనంత త్వరగా పారిపోవాలి. అంటే అందుకు తగిన వాహనం కావాలి. ఒక వ్యూహం కావాలి.

ఈ ఫాక్టరీ అంచుల్లో జెపెలెన్-విమానాలు ఏవైనా ఉన్నాయామో చూడాలి. అంటే ఈ ఫాక్టరీ సరిహద్దులు ఎక్కడున్నాయో వెతకాలి.

"విస్సూ! ఇది ఏం ఫాక్టరీ అంటావు?" యంత్రాల పక్కగా సాగే పొడవాటి దారి వెంట ముందుకు నడుస్తూ అడిగాడు అమోఘ్. విస్సూ వెనుకే వస్తున్నాడు.

"స్టీల్ ప్లాంట్ లాంటిదేదో  అయ్యుంటుంది," అన్నాడు విస్సూ చుట్టూ విపరీతంగా రొద చేసే ఆ మహాయంత్రాలని చూస్తూ.

"అయితే ఆ చివర మంటలు కొలుముల నుండి వస్తున్నాయి అంటావా?"

"కావచ్చు."

"కాని స్టీల్ ప్లాంట్ అయితే దీనికి ముడి సరుకు ఎక్కణ్ణుంచి వస్తుందో?"

"ఇందాక తోటకి కావలసిన మట్టి లాగే దీన్ని కూడా వీనస్ నుండీ తవ్వి పైకి పంప్ చేస్తారేమో?"

"అమ్మబాబోయ్! ఉక్కు గనుల నుండి ముడి సరుకు తవ్వి ఇంత ఎత్తుకి పంప్ చెయ్యడమా? అది జరిగేపనేనా?" ఆశ్చర్యపోతూ అన్నాడు అమోఘ్.

కన్వేయర్ బెల్టుల కొసకి చేరుకున్నారు. అందులో నల్లని ముడి సరుకేదో కనిపిస్తుందని ఆశించిన మిత్రులిద్దరూ అందులో కళ్లు మిరుమిట్లు గొలిపేలా కాంతులు చిందే వస్తువులని చూసి ఆశ్చర్యపోయారు.

"ఏంటివి? ఇంతలా మెరుస్తున్నాయి?" బెల్ట్ మీద నుండి కింద తొట్టెలో పడుతున్న వస్తువులని తాకి చూస్తూ అడిగాడు అమోఘ్. "గాజు ముక్కలా?"

"గాజు ముక్కలైతే ఇంతలా మెరుస్తాయా?" అంటూ ఒక పెంకుని చేతిలోకి తీసుకుని పరిశీలనగా చూశాడు విస్సూ. తన కళ్ల కెమేరాల పక్కనే ఉన్న ఎక్స్-రే సోర్స్ తో ఆ పదార్థాన్ని ప్రోబ్ చేసి ఆ వస్తువు రసాయన విన్యాసాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశాడు.

"ఇందులో సిలికా లేదు. ఇందులో ప్రధానంగా ఉన్న మూలకం.. కార్బన్. ఆశ్చర్యంగా వుందే..." అన్నాడు తలెత్తి అమోఘ్ వైపు చూస్తూ.

అమోఘ్ ముఖం విస్సూ చేతిలోని వస్తువు లాగే ధగధగ మెరిసిపోతోంది.

"నక్కని తొక్కావు మిత్రమా!" అన్నాడు అమోఘ్ చిన్నగా ఊళ వేస్తూ. "ఇది గాజు కాదు... వజ్రం!"

"వజ్రాలా? ఓహ్! మీ లోకంలో వాటికి చాలా విలువ కదూ?" అన్నాడు విస్సూ చాలా మామూలుగా.

"కాస్తా కూస్తా కాదు. ముందు ఒక బస్తా ఉంటే చూడు. ఇక్కడి దాకా వచ్చి వట్టి చేతుల్తో వెళ్తే బాగుండదు," అంటూ అమోఘ్ బెల్ట్ మీద నుండి కింద పడుతున్న వజ్రాలని కొన్ని చేతిలోకి తీసుకుని చూశాడు.

"వీళ్ల రాజధాని నగరానికి అలాంటి వింతైన పేరు ఎలా వచ్చిందో ఇప్పుడు అర్థమవుతోంది."

"అయినా ఇంత ఎత్తులో వజ్రాలు ఎక్కడి నుండి వస్తాయబ్బా?" అడిగాడు విస్సూ.

"వీటిని కూడా నేల నుండి తవ్వి తీసి పంప్ చేస్తారా? నమ్మబుద్ధి కావడం లేదు. వీనస్ నేలలో ఏవైనా ప్రత్యేకించి వజ్రాలు పుష్కలంగా దొరుకుతాయా?"

"ఏమో నాకూ తెలీదు. ప్రజ్ఞ కి తెలుస్తుందేమో."

అంతలో అమోఘ్ కళ్లు హాలులో ఒక మూల అమర్చి వున్న సిలిండర్ల వరుస మీద పడింది.
"ఇంతకీ ఆ సిలిండర్లలో ఏముందో? వాటికి ఈ వజ్రాలకి ఏదో సంబంధం ఉండి వుంటుంది." అన్నాడు అమోఘ్.

“వాయువుకి వజ్రాలకి ఏం సంబంధం ఉంటుంది? వజ్రాలలో ఉండేది కార్బన్ కదా?”

అమోఘ్ మెదడులో ఏదో తళుక్కు మంది.

“అర్థమయ్యింది! ఈ వజ్రాలు నేల నుండి వచ్చినవి కావు. గాలి లోంచి ఊడిపడ్డవివి.”

“ఏం మాట్లాడుతున్నావు?”

“వీనస్ వాతావరణంలో కార్బన్ డయాక్సయిడ్ పుష్కలంగా ఉంటుందని ఎక్కడో చదివినట్టు గుర్తు.”

“అవును. వీనస్ గాలిలో 96.5% కార్బన్ డయాక్సయిడే,” అన్నాడు విస్సూ నిర్ధారిస్తూ.

“మరింకేం? ఆ కార్బన్ డయాక్సయిడ్ ని పట్టి, అధిక పీడనం వద్ద ఈ వజ్రాలు సృష్టిస్తున్నట్టు ఉన్నారు.” అన్నాడు అమోఘ్ చేతిలో ఉసిరికాయంత వజ్రాన్ని తీసుకుని తనిఖీ చేస్తూ. “వీనస్ వాసుల సాంకేతిక పరిజ్ఞానం...”

అంతలో పిడుగు పడ్డట్టు బ్రహ్మాండమైన చప్పుడు అయ్యింది. ఆ శబ్దంతో ఫాక్టరీ అంతా మారుమ్రోగింది. ఆ శబ్దం తన వెనుక నుండి వచ్చింది.

వెనక్కు తిరిగి చూశాడు అమోఘ్. చెట్టంత నల్లని ఆకారం కళ్లలో నిప్పులు పోసుకుని పది అడుగుల దూరంలో నించుని ఉన్నాడు జోరిన్! ఎక్కణ్ణుంచి ఊడిపడ్డాడో అర్థం కాలేదు.

ఏం చెయ్యాలో అర్థం గాక స్థాణువై నించుండిపోయాడు అమోఘ్. జోరిన్ మదగజంలా మీదకి లంఘించబోతుంటే అవతలి నుండి విస్సూ చెయ్యి పట్టుకుని గట్టిగా లాగాడు. దాంతో చలనం వచ్చిన అమోఘ్ మెరుపులా కదిలాడు. అమోఘ్, విస్సూలు  యంత్రాల మధ్య లోంచి సాగే పొడవాటి బాటల వెంట పరుగు అందుకున్నారు. చిన్న ఆకారాలు గనుక వేగంగా పరుగెత్త గలుగుతున్నారు. కాని జోరిన్ ది భారీ కాయమే అయినా బలంలో, విస్సూ, అమోఘ్ లకి వాడికి మధ్య  పోలికే లేదు. ఆ దృశ్యం నల్ల చిరుత ఉడుతపిల్లల్ని తరుముతున్నట్టుగా వుంది. జోరిన్ కి వీళ్లకి మధ్య దూరం క్షణక్షణం తరుగుతోంది. అంతలో విస్సూ హఠాత్తుగా మలుపు తిరిగి రెండు యంత్రాల మధ్య ఉన్న సన్నని ఇరుకు బాటలోకి దూరాడు. అమోఘ్ ని కూడా అందులోకి లాక్కెళ్లాడు. ఆ సందులోకి జోరిన్ దూరే ప్రసక్తే లేదు. కోపంతో ఆ ఉక్కు రాక్షసుడు పక్కనే ఉన్న యంత్రాన్ని బలంగా గుద్దాడు. యంత్రపు లోహపు దేహం లోపలికి అతడి ఉక్కు పిడికిలి ఆరు అంగుళాల లోతు రంధ్రం చేసింది.

యంత్రాల మధ్య సందులోకి దూరి అవతల పక్క ఉన్న మరో బాట మీదకి చేరారు అమోఘ్, విస్సూలు. అక్కడి నుండి మళ్లీ వెనక్కు పరుగు అందుకున్నారు. జోరిన్ కాస్త ముందుకు వెళ్లి రెండు సార్లు మలుపు తిరిగి మళ్లీ విస్సూ, అమోఘ్ లని వెంబడించాడు. పరుగు బృందం ఫాక్టరీ అవతలి కొసకి అంటే బెల్ట్ లలోని వజ్రాలు కింద తొట్టెలోకి పడుతున్న స్థానానికి చేరుకుంది.  విస్సూ, అమోఘ్ లు మళ్లీ బెల్ట్ చుట్టూ ప్రదక్షిణ చేసి ఇవతలి బాట మీదకి వచ్చారు.

అప్పుడు విస్సూ మెరుపులా కదిలి బెల్ట్ మీదకి గెంతి, దాని మీద వజ్రాలన్నీ కుడి పక్కన బాట మీద పడేలా బలంగా బెల్ట్ ని బలంగా కదిలించాడు. ఆ బాట మీద వజ్రాల వాన కురిసింది. మళ్లీ కిందకి గెంతి అమోఘ్ తో పాటు పరుగు కొనసాగించాడు విస్సూ. యంత్రాల రొదలో ఈ చప్పుళ్లేవీ జోరిన్ శ్రవణ యంత్రాంగాన్ని చేరలేదు. వాడు కూడా మలుపు తిరిగి విస్సూ, అమోఘ్ ని తరుమబోయాడు. కాని వాడి ఉక్కు పాదాలు వజ్రాల మీద జర్రున జారి బ్రహ్మాండమైన చప్పుడుతో తూలి నేల మీద వెల్లకిల్లా పడ్డాడు. సముద్ర తీరం వద్దకు కొట్టుకొచ్చిన తిమింగలపు నల్లని శరీరం కెరటాల నురగ తొరకల మధ్య చచ్చిపడి వున్నట్టు, ఆ మెరిసే వజ్రాల మధ్య జోరిన్ నల్లని ఉక్కు దేహం నిశ్చేష్టంగా పడి వుంది. లోపలి నుండి పొగలు వస్తున్నాయి.

“వీడు ఇక లేవడు,” చావుబతుకుల్లో ఉన్న రోబోల తీరుతెన్నుల గురించి బాగా తెలిసిన అనుభవంతో అన్నాడు విస్సూ.

“హమ్మయ్య! పద. ఇక ఆలస్యం చెయ్యకుండా ఇక్కడి నుండి బయల్దేరాలి.” అన్నాడు అమోఘ్. “వీడు వచ్చిన జెపెలెన్-విమానం ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటుంది.”

“మరొకటి కూడా ఉంటే బావుంటుంది.” అన్నాడు విస్సూ.

“అవును. నేను అనూ కోసం వెతుకుతాను.  నువ్వు రత్నని, మిట్టీని తీసుకుని ఆంఫీ షటిల్ ని చేరుకో. నేను కూడా అనూని తీసుకుని వీలైనంత త్వరగా మిమ్మల్ని చేరుకుంటాను.”

“కాదు. నేనే అనూని వెతుకుతాను. నేను రోబోని కనుక వజ్రపురిలో  రోబోలలో రోబోగా కలిసిపోతాను. తోటలో ఎవరూ లేరు కనుక నువ్వు రత్న, మిట్టీలని అక్కణ్ణుంచి సులభంగా తప్పించగలవు.”

“సరే అయితే,” అన్నాడు అమోఘ్. విస్సూ అన్నది సబబుగానే అనిపించింది. “కాని నీకు అనూ ఎలా ఉంటుందో మరి తెలుసా?”

“ఈ రోబో మూకల మధ్య ఓ చిన్ని పాపని గుర్తుపట్టలేనా?” అన్నాడు విస్సూ.

“అయితే ఒక్కనిముషం,” అన్నాడు విస్సూ తన జేబులోంచి ఏదో పైకి తీస్తూ. “ఇది నువ్వు తీసుకెళ్లు.”

“ఏంటిది?” అడిగాడు విస్సూ అమోఘ్ చేతిలోని ధగధగ మెరిసే వస్తువుని చూస్తూ.

“ఇది అనూ కట్టుకునే గజ్జెల్లో ఒకటి. ఇందాక వజ్రపురిలో మిట్టీ  వాసన చూసి కనిపెట్టింది. గుర్తుందా? ఓ కూడలి మధ్య ఓ చిన్న మాండరిన్ నారింజ  చెట్టు పక్కన కనిపించింది.”

“ఓ బాగా గుర్తుంది,” అన్నాడు ఫోటోగ్రాఫిక్ స్మృతి గల విస్సూ. “కాని ఇది నాకు అనవసరం కదా?”

“నీకు అనవసరమే. కాని అనూకి అవసరం. నువ్వు తనని రక్షించడానికి వచ్చావంటే నమ్మదు. భయపడుతుంది. ఇది చూపించు చాలు.”

ఇద్దరూ ఫాక్టరీ బయటికి దారి కోసం వెతుక్కుంటూ వడిగా అడుగులు వేశారు.

నడక ఆపకుండానే విస్సూ ప్రజ్ఞ కి డయల్ చేశాడు,

“ప్రజ్ఞా! మేము ఏదో ఫాక్టరీ లాంటి చోట ఉన్నాం. దీని చుట్టు పక్కల జెపెలిన్-విమానాలు ఆగే పోర్ట్ లు ఎక్కడున్నాయో చెప్పగలవా? అలాగే ఇక్కడి నుండి వజ్రపురి ఎక్కడుందో, తోట ఎక్కడుందో – వాటి కో ఆర్డినేట్లు కూడా కావాలి.”

ప్రజ్ఞ పంపిన సమాచారాన్ని విస్సూ, అమోఘ్ లు డౌన్ లోడ్ చేసుకున్నారు. కమ్యూనికేటర్ స్క్రీన్ మీద మూడు మెరిసే బిందువులు కనిపిస్తున్నాయి. వాళ్లు ఉన్న వజ్రపు ఫాక్టరీ సరిగ్గా వజ్రపురికి, తోటకి కాస్త మధ్యస్థంగా వుంది.

“థాంక్యూ ప్రజ్ఞా!” అన్నాడు అమోఘ్.

“మరో దానికి కూడా థాంక్స్ చెప్పాల్సి ఉంటుంది. మీరున్న ఫాక్టరీ వద్ద రెండు జెపెలిన్-విమానాలు ఉన్నాయి. ఒకటి ఉత్తర ద్వార వద్ద, మరొకటి దక్షిణ ద్వారం వద్ద. త్వరగా మీ లక్ష్యాలు సాధించుకుని వెనక్కి రండి.” ప్రజ్ఞ నుండి ప్రసారం ఆగింది.

“ఆల్ ద బెస్ట్ దోస్త్” అన్నాడు అమోఘ్ విస్పూని కౌగిలించుకుంటూ. “అనూని సురక్షితంగా తెచ్చే భారం నీ మీదే వుంది.”

“ఆ విషయం నాకు వదిలేయ్,” అన్నాడు విస్పూ తన నాజూకైన టైటానియమ్ బాహువులతో అమోఘ్ ని పట్టుకుంటూ. “నీక్కూడా ఆల్ ద బెస్ట్.”



భూమి మీద పరిస్థితి ఎలా వున్నా, ఈ వీనస్ నగరంలో, వజ్రపురిలో మాత్రం రోబో కావడం విస్పూకి బాగా కలిసొచ్చింది. భూమి మీద ఎక్కడైనా గస్తీ తిరగాలంటే చీకట్లోను, చెట్ల నీడల్లోని నక్కి నక్కి తిరగాల్సిందే తప్ప, వీధుల్లో రొమ్ము విరుచుకుని తిరిగే భాగ్యం ఒక రోబోకి ఉండదు. కాని వజ్రపురిలో ఇంతవరకు రోబోలు తప్ప మరో శాల్తీని చూసిన పాపాన పోలేదు. పైగా జోరిన్ లాంటి మహాకాయులే కాక తన లాంటి “బాల” రోబోలు కూడా ఇక్కడ అక్కడక్కడా కనిపిస్తున్నారు. ‘నలుగుర్లో రోబోయణా’ అని సులభంగా గుంపులో కలిసిపోవచ్చు.

అనూ గజ్జె దొరికిన మాండరిన్ నారింజ చెట్టు అల్లంత దూరంలో కనిపిస్తోంది. అక్కడే నించుని చుట్టూ ఆరా తీస్తే ప్రమాదం అని విస్పూకి తెలుసు. కాబట్టి ఏమీ ఎరగనట్టు నారింజ చెట్టు పక్కగా ఆ దారి వెంట ముందుకు వెనక్కి కొన్ని సార్లు నడిచాడు. ఆ చెట్టు ఉన్న నాలుగు దార్ల కూడలి పక్కనే ఉన్న ఒక ఇంటి ముందు ఒక రోబో పదే పదే పచార్లు చేస్తున్నాడు.

సరిగ్గా ఒకటిన్నర నిముషాలకి ఒక సారి ఆ చిన్న డోమ్ ఇంటి చుట్టూ గానుగెద్దులా తిరుగుతూ పహరా కాస్తున్నాడు. ఆరు నిముషాలకి ఒక సారి ఆ ఇంట్లోకి వెళ్లి వస్తున్నాడు. బహుశా అనూ ఆ ఇంట్లోనే ఉండి ఉండొచ్చు.

విస్సూ ఆ సందు చివరి దాకా వెళ్లి, మళ్లీ వెనక్కు వస్తున్నప్పుడు సరిగ్గా ఆ రోబోకి కాస్త వెనక్కి వచ్చేలా తన వేగాన్ని దిద్దుకుంటూ వచ్చాడు. రోబో లోపలికి వెళ్లగానే తను కూడా చప్పుడు చెయ్యకుండా లోపలికి దూరాడు. లోపలికి వెళ్లగానే పక్కకి తిరిగి బల్లిలా గోడ మీదకి ఎగబాకి చూరుని అంటిపెట్టుకుని ఉండిపోయాడు. తన పాదాల కింద, మోకాలి చిప్పల పైన ఉండే సక్షన్ పాడ్ లు ఇలాంటి కవాతులు చెయ్యడానికి ఉపయోగపడుతుంటాయి.

ఆ ఇంట్లో ఒకే పెద్ద గది వుంది. అందులో ఒక మూల ఒక చాపం ఆకారపు డెస్క్ గోడ వంపుని అంటిపెట్టుకుని వుంది. ఆ డెస్క్ మీద తల ఆన్చి ఓ చిన్నారి ఓ బంతిలాంటి కుర్చీ మీద కూర్చుని వుంది. అది అనూ అని గుర్తించడానికి విస్సూకి కష్టం కాలేదు.

ఆ పాప పక్కనే ఆహారం వున్న పళ్లెం వుంది. పళ్లేన్ని అనూ వద్దకి తోస్తూ ఆ రోబో 'గుర్రు" మన్న శబ్దం లాంటిది చేశాడు.

తల పైకి ఎత్తకుండానే అనూ తల అడ్డుగా ఊపింది.

కొద్ది క్షణాలు అక్కడే నించుని రోబో టక్కుటక్కు మని నడుచుకుంటూ బయటికి వెళ్లిపోయాడు. తలుపులు మూసుకున్నాక లోపల పూర్తి నిశ్శబ్దం నెలకొంది.

రోబో వెళ్లి పోయాడని తెలిశాక అనూ తలెత్తి తలుపు వైపు చూసింది. కళ్లలోంచి తన్నుకొస్తున్న నీరు తన గౌను అంచుతో తుడుచుకుంది.

ఆ చిన్నారి బాధని అనుభూతి చెందకపోయినా, ఆమె కష్టాన్ని సులభంగా గ్రహించాడు విస్సూ. జరజర కిందకి పాకి అనూ ముందు ప్రత్యక్షమై "హలో!" అన్నాడు.

ఎదురుగా కనిపించిన ఈ వింత ఆకారాన్ని చూడగానే ఓ గావుకేక పెట్టి పక్కనే వున్న పళ్లేన్ని విసిరి కొట్టింది. మీదికొస్తున్న ఆ 'ఫ్లయింగ్ సాసర్' బాట నుండి పక్కకి గెంతి తప్పించుకున్నాడు విస్సూ.

ప్రయత్నం విఫలం అయ్యిందని తెలిసి విసరడానికి ఇంకేవైనా ఉందేమో నని చుట్టూ చూసింది అనూ. డెస్క్ మీద కొన్ని నారింజపళ్లు నీటుగా టెట్రహెడ్రన్ ఆకారంలో అమర్చి వున్నాయి.

“అనూ! ఇంకేం విసరకు. నేను మంచాణ్ణి. నిన్ను రక్షించడానికి వచ్చాను.”

ఓ నారింజ ఫిరంగి గుండులా విస్సూ మీదకి దూసుకొచ్చింది.

“”అనూ! నా మాట నమ్ము. నేనే కాదు, మీ అన్నయ్య అమోఘ్…” మరో పండు ఎగిరింది “మీ ఇంట్లో పని చేసే రత్న..” పళ్ల వాన ఆగలేదు. “అంతే కాదు నీకు చాలా ఇష్టమైన మిట్టి కూడా…” ఎగరబోయిన పండు చేతిలోనే ఆగిపోయింది.

“అంతే కాదు. ఇదుగో చూడు… ఇది నీదేగా,” అమోఘ్ ఇచ్చిన గజ్జె పైకి తీసి చూపించాడు.

అది చూసి తన కాలి వైపు చూసుకుంది. నిజంగానే తన కాళ్ల మీద ఉండాల్సిన గజ్జెలు లేవు.

విస్సూ వైపు చూసి చిరునవ్వు నవ్వింది.

“మరి ఇక్కణ్ణుంచి ఎంచక్కా పారిపోదామా?” అడిగాడు విస్సూ.

కొండపల్లి బొమ్మలా తలాడించింది అనూ.



జెపెలిన్ విమానం తోటని సమీపిస్తుంటే అమోఘ్ తలలో బోలెడు ఆలోచనలు అలజడిగా కదులుతున్నాయి. రత్న, మిట్టీ ఎలా వున్నారు? ఆ రాక్షసుడు వాళ్లని ఏమీ చెయ్యలేదు గద? రత్న బాగా బెంగపడి వుంటుందేమో? తను, అనూ స్కూల్ నుండి ఓ గంట ఆలస్యంగా వస్తేనే ఇక మిన్ను విరిగి పెన్ను మీద పడినంత హడావుడి చేస్తుంది. వీలైనంత త్వరగా రత్నని, మిట్టీని వెతికి పట్టుకుని అక్కడి నుండి తప్పించాలి.

అల్లంత దూరంలో పోర్ట్ ఒకటి కనిపించింది. నెమ్మదిగా విమానం పోర్ట్ కి కొన్ని అడుగుల దూరానికి వచ్చింది. మామూలుగా అయితే విమానం అంత దగ్గరికి రాగానే పోర్ట్ లో వున్న సాకెట్ మీద ఉండే ఒక

తలుపు తెరుచుకుంటుంది. జెపెలిన్ 'ముక్కు' ఆ సాకెట్ లోకి ఆకర్షించబడి అందులో సరిగ్గా ఇమిడిపోతుంది. అంతేకాక పోర్ట్ నుండి బయటికి పొడుచుకొచ్చే రెండు కాంటీలీవర్ లు విమానం రెక్కల కింద ఆసరాగా ఏర్పడతాయి. ఈ సారి మరి ఎందుచేతనో అలాంటి పరిణామాలేవీ పోర్ట్ లో కనిపించలేదు.

తోటకి పరిధి మీద మరెక్కడైనా అలాంటి పోర్ట్ వుందేమో చూద్దామని తోట చుట్టూ ప్రదక్షిణ మొదలెట్టాడు. కాని సుమారు 12 కిమీల చుట్టు కొలత ఉండే ఆ తోట చుట్టూ తిరగాలంటే కొంత సమయం వృధా అవుతుంది. తన వద్ద బొత్తిగా లేనిది ప్రస్తుతం సమయం ఒక్కటే. అప్పుడు మెరుపులా ఓ ఆలోచన వచ్చింది.

తనుగా ఈ పరిశోధనలన్నీ చేసే బదులు ప్రజ్ఞ ని అడిగేస్తే పోలా? తనకి తెలిస్తే వెంటనే చెప్తుంది. వెంటనే ప్రజ్ఞకి డయల్ చేశాడు.

"ప్రజ్ఞా! తోట దగ్గర ఉన్నాను. ఇక్కడ విమానాన్ని డాక్ చేద్దామని ప్రయత్నిస్తున్నాను. రత్న, మిట్టీలని తోటలోంచి బయటికి తేవాలి. కాని పోర్ట్ దగ్గర విమానాన్ని డాక్ చెయ్యడానికి సాధ్యం కావడం లేదు. ఏమయ్యుంటుందో అర్థం కావడం లేదు. ఈ తోట పరిధి మీద మరేదైనా పోర్ట్ వుందా?"

కొన్ని క్షణాల ఆలస్యంగా ప్రజ్ఞ నుండి సమాధానం వచ్చింది.
"తప్పకుండా ఉంది. నువ్వు ఉన్న చోటి నుండి తోట చుట్టూ సవ్య దిశలో వెళ్తే మూడు కిలోమీటర్ల దూరంలో మరో పోర్ట్ వుంది. విమానాన్ని డాక్ కానివ్వడం లేదు అంటే భద్రతా కారణాల వల్ల దాన్ని లాక్ చేసి వుంటారు."

"థాంక్స్ ప్రజ్ఞా! వెంటనే అక్కడికి బయల్దేరుతాను."

"ఒక్క నిముషం ఆగు! ఇక్కడి నుండి హాక్ చేసి ఆ పోర్ట్ ని నేను తెరిపించగలనేమో చూస్తాను."

"హాక్ చేస్తావా? ఇలాంటి కళలు కూడా వున్నాయా నీకు?"

"ఇప్పుడే ఏం చూశావ్? ఒక్క నిముషం…" కొన్ని క్షణాల ఆలస్యం… "సారీ అమోఘ్! రెండు పోర్ట్ ల వద్ద తలుపులు లాక్ చెయ్యబడ్డాయి. ఆ కోడ్ ని భేదించడం సాధ్యం కావడం లేదు."

అమోఘ్ మనసులో కలవరం బయల్దేరింది.

"మరి రత్న, మిట్టీలని బయటికి తేవడం ఎలా?"

"ఒక్క నిముషం ఉండు." రత్నకి డయల్ చేసింది ప్రజ్ఞ.

"హలో! ఎవరూ?"

""రత్నా! నేను," అన్నాడు అమోఘ్.

"అమోఘ్ బాబూ" అవతలి నుండి రత్న గొంతు వినిపించగానే అమోఘ్ మనసు కాస్త తేలికపడింది. "రత్నా! నువ్వు తోటలోనే వున్నావుగా?"

"అవును బాబూ! నువ్వు ఎక్కడున్నావు బాబూ? నువ్వు, విస్సూ క్షేమమేగా?"

"మాకేం కాలేదు.  మిట్టీ నీతోనే వుందా?"

"అవును ఇదుగో," అంది రత్న కమ్యూనికేటర్ ని మిట్టీ చెవి దగ్గర పెడుతూ. మిట్టీ తన ప్రస్తావన వినిపించగానే ఉత్సాహంగా మొరిగింది.

"ఇదుగో రత్నా! ఒక్క మాట. నేను తోట బయటే ఒక జెపెలిన్-విమానంలో వున్నాను. అయితే తోటలోకి రావడానికి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజ్ఞ సహాయం చెయ్యడానికి ప్రయత్నిస్తోంది. కమ్యూనికేటర్ దగ్గరే పెట్టుకో. కాసేపట్లో వచ్చి నిన్ను, మిట్టీని ఇక్కడి నుండి తీసుకెళ్తాను."

"అలాగే బాబూ. నీ కాల్ కోసం ఎదురుచూస్తూ ఉంటాం. నువ్వు జాగ్రత్త."

తన నిస్సహాయ స్థితి అమోఘ్ ని లోపలి నుండి దొలిచేస్తోంది. అనూ విషయంలో ఇప్పటికే చెప్పుకోలేని అపరాధభావంతో లోలోపల కుమిలిపోతున్నాడు. అందుకే అనూ కోసం విస్సూ  వెళ్తానంటే అయిష్టంగానైనా ఒప్పుకున్నాడు. తన వల్ల పొరబాటు అయినా విస్సూ వల్ల కాకపోవచ్చని ఒక ఆశ. కాని రత్న విషయంలో తను పొరబాటు చేస్తే ఇక జన్మలో తనని తాను క్షమించుకోలేడు. కాబట్టి పరిస్థితి  మీద ఆశ వదులుకోకుండా మళ్లీ విమానం లో తోట చుట్టూ ప్రదక్షిణ చెయ్యడానికి బయల్దేరాడు. అంత ఎత్తు నుండి ప్రజ్ఞకి ఏం తెలుస్తుంది? తను పొరబడి ఉండొచ్చుగా? తనే స్వయంగా వెళ్లి చూస్తే ఏదైనా సాధ్యమవుతుందేమో?

అయిదు నిముషాలలో రెండవ పోర్ట్ ని చేరుకున్నాడు. అక్కడ కూడా మళ్లీ అదే అనుభవం ఎదురయ్యింది. ఎంత ప్రయత్నించినా డాక్ చెయ్యడానికి సాధ్యం కాలేదు.

అయినా పట్టుదలగా ఇంకా తోట చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పోయాడు. తలలో ఆలోచనలు రేసు గుర్రాల్లా పరిగెడుతున్నాయి. ఉన్నట్లుండి స్కూల్లో నేర్చుకున్న ఒక పాఠం గుర్తొచ్చింది. 'దారులన్నీ మూసుకుపోయినప్పుడు సమస్యని కొత్త కోణం నుండి చూడడానికి ప్రయత్నించు,' అని వాళ్ల హెడ్ మాస్టర్ ఎన్నో సార్లు అనేవాడు. దాన్నే లేటరల్ తింకింగ్ అంటారని కూడా చెప్పాడు. ఇప్పుడు నిజంగానే దారులన్నీ మూసుకుపోయాయి. మరి కొత్త కోణం నుండి ఎలా చూడడం? అప్పుడు మెదడులో ఓ ఆలోచన తళుక్కు మంది.

ఇంతసేపు తను లోపలికి వెళ్లి రత్నని కలుసుకోవడం గురించి ఆలోచిస్తున్నాడు. అందుకు ఈ పోర్ట్ అడ్డొస్తోంది. కాని రత్నానే బయటికి రమ్మంటే?

ఆలోచన బానే వుంది గాని రత్న బయటికి ఎలా వస్తుంది? ఎక్కణ్ణుంచి వస్తుంది? తోట చుట్టూ ఉన్న డోమ్ యొక్క రక్షణ లోంచి బయటికి వస్తే, బయటి గాలి చర్మానికి కొద్ది నిముషాలు సోకిందంటే చాలు, ఆసిడ్ ప్రభావానికి చర్మం తీవ్రంగా కాలిపోతుంది. మరెలా?

అంతలో ఓ బలమైన గాలి వీచింది. తోట పరిధి చుట్టూ సుమారు ఇరవై, ముప్పై అడుగుల దూరంలో నెమ్మదిగా సంచరిస్తున్న తన విమానం గాలి వాటుకు ఓ వంద అడుగుల దూరానికి పైగా కొట్టుకుపోయింది.

అప్పుడు కనిపించిందది.

తోట అడుగు నుండి బయటికి వస్తూ కింద అగాధంలోకి  పోతున్న ఓ వెడల్పయిన గొట్టం. ఇందాక జోరిన్ చెప్పిన గొట్టం ఇదే అయ్యుంటుంది. దీంట్లోంచే వీనస్ ఉపరితలం నుండి తోట వరకు మట్టిని పంప్ చేస్తూ ఉంటారు.

జాగ్రత్తగా చూస్తే ఆ గొట్టం చుట్టూ పెనవేసుకుంటూ పై నుండి కిందికి పోతున్న ఓ మెట్ల దారి కనిపించింది. యాభై కిలోమీటర్ల పొడవైన గొట్టం చుట్టూ మెలికలు తిరిగే స్పైరల్ మెట్ల దారి ఉండడం చాలా ఆశ్చర్యంగా అనిపించింది. గొట్టం లోంచి మట్టి పైకి వచ్చేటట్టు అయితే ఇక ఈ మెట్లు దేనికి? ఎవరి కోసం?

వెంటనే ప్రజ్ఞకి డయల్ చేసి తనకి కనిపించిన మెట్ల దారి గురించి చెప్పి అడిగాడు.

"ఆ మెట్లదారి ఎందుకు అయ్యుంటుంది అంటావ్?"

"ఇలాంటి పొడవాటి గొట్టాలతో గ్రహోపరితలం నుండి ఆకాశంలోకి సరుకులు రవాణా చేసే విధానాన్ని మరి కొన్ని గ్రహాల మీద కూడా చూశాను. వీటిని స్పేస్ ఎలివేటర్లు అంటారు. దాని మీద ఏవైనా రిపెయిర్లు వస్తే ఆ మెట్ల దారి మీద కిందకి దిగి వెళ్లి మరమ్మత్తులు చేస్తుంటారు."

"మరి ఆ మెట్లు ఎంత దూరం పోతాయి?"

"మొత్తం వీనస్ ఉపరితలం వరకు పోతున్నాయి. అంటే యాభై కిలోమీటర్లు."

"బాగానే వుంది. కాని అన్ని మెట్లు ఉన్నప్పుడు భూమి మీద అయితే మధ్య మధ్యలో లాండింగ్ లు ఉంటాయి. అంటే మెట్లు ఎక్కే వారు మధ్యమధ్యలో కాస్త ఆగి విశ్రాంతి తీసుకోడానికి వేదికలు లాంటివి ఉంటాయి కదా?"

"నిజమే. ఇక్కడ కూడా ఉంటాయేమో మరి తెలియదు. ఇంత ఎత్తు నుండి కచ్చితంగా తెలుసుకోవడం కష్టం."

"అయితే ఉండు. నేనే చూస్తాను," అంటూ విమానాన్ని చుట్టూ ముసిరిన మబ్బుల్ని ఛేదించుకుంటూ కిందకి పోనిచ్చాడు.

ఇరవై, ముప్పై మీటర్లకి మించి మెట్ల దారి కనిపించడం లేదు. రెండొందలు, మూడొందలు,... ఆరొందలు మీటర్లు దిగొచ్చినా ఇంకా మెట్లు నిరాఘాటంగా కిందకి పోతున్నాయే తప్ప ఎక్కడా విరామ వేదిక లాంటిది కనిపించలేదు.

కాని ఈ సారి మాత్రం వెనక్కి తిరిగి పోకూడదు అనుకున్నాడు. ఎలాగైనా ఈ మార్గంలో పరిష్కారాన్ని వెతకాల్సిందే.

తొమ్మిది వందలు... ఒక కిలోమీటర్ ...

“కనిపించింది, కనిపించింది!” ఉత్సాహం పట్టలేక అరిచాడు అమోఘ్. “చాలా విశాలమైన వేదిక. అక్కడ మనుషుల్ని, రోబోల్నే కాదు, ఏకంగా ఈ జెపెలిన్ విమానాన్ని కూడా నిలపొచ్చు.”

వెంటనే రత్నకి డయల్ చేశాడు.

“రత్నా! నేను తోట లోకి రాలేను. నువ్వే బయటికి రావాలి. కొన్ని మెట్లు దిగి కిందకి రావాలి.”

అమోఘ్ తన పరిష్కారాన్ని వివరించాడు. అది విన్న రత్నకి కాసేపు నోటంట మాట రాలేదు.

“తోట అడుగున్న వున్న ప్రాసెసింగ్ ప్లాంట్ ని చేరుకోడానికి తోటలో అక్కడక్కడ ప్రవేశ ద్వారాలు ఉండి ఉండాలి.” రత్న నుండి సమాధానం లేదు.

“రత్నా వింటున్నావా?...” మళ్లీ అడిగాడు అమోఘ్. “నీ చుట్టూ ఏవైనా కనిపిస్తుందేమో ఓ సారి చూడు...”

వెంటనే తేరుకుని తన పరిసరాలని పరిశీలించింది రత్న. అల్లంత దూరంలో ఓ కొమ్మ మాటున చిన్న బంకర్ లాంటిది వుంది.

“ఓ బంకర్ కనిపిస్తోంది. అదే అయ్యుంటుంది.” అంటూ ఆ బంకర్ వైపు పరుగెత్తింది. వెనకే మిట్టీ పరుగు అందుకుంది.

బంకర్ తలుపు తీయగానే కిందకి పోతున్న మెట్లు కనిపించాయి. ముందు వెనుక చూడకుండా వడిగా మెట్లు దిగింది.

కింద బాగా చీకటిగా ఉంది. దూరంగా గోడల మీద ఉన్న చిన్న లైట్ల మసక కాంతిలో పెద్ద పెద్ద యంత్రాలేవో కనిపిస్తున్నాయి.

“ప్రాసెసింగ్ ప్లాంట్ లో ఉన్నాను,” అంది రత్న కమ్యూనికేటర్ లో.

“అక్కడి నుండి ఇంకా కిందకి పోవడానికి మెట్లు ఉండాలి. ఆ మెట్లకి తీసుకుపోయే ద్వారం లాంటిది ఏదో ఉండాలి.”

కొన్ని నిముషాల వెతుకులాట తరువాత కనిపించింది. నేల లోనే ఓ తలుపు ఉంది. వడిగా దాని వైపు అడుగులు వేసింది.

అంతలో "రత్నా ఆగు!" అన్న అమోఘ్ కేకకి రత్న తలుపు తీయబోతూ ఆగింది.

"కిందకి మెట్లు దిగాలంటే నువ్వు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి," అన్నాడు అమోఘ్. తన గొంతులో మునుపు లేని ఆందోళన ధ్వనిస్తోంది.

"నువ్వు బయటికి వెళ్తే వీనస్ వాతావరణంతో సంపర్కంలోకి వస్తావు. అది ప్రమాదకరం. అందుకు రక్షణగా ప్రత్యేకమైన సూట్ లు ఏవో ఉండి ఉండాలి."

"సూట్లా?" అంది రత్న నీరసగంగా. చంద్రమండలం మీద ఆ భారీ సూటు వేసుకుని పడుతూలేస్తూ పడ్డ తిప్పలు వేగంగా మనసులో మెదిలాయి.

మనసులో తిట్టుకుంటూనే ప్లాంట్ అంతా వెతికింది. గోడలకి ఆనుకుని కొన్ని అలమరల లాంటివి కనిపించాయి. అందులో ఉన్నాయి – సూట్లు! ఆ పక్కనే మరో అరలో హెల్మెట్లు, ఆ పక్కనే చిన్నపాటి ఆక్సిజన్ సిలిండర్లు.

మూడిటినీ కలిపి ఎలా వేసుకోవాలో వివరించాడు అమోఘ్.

"మరి మిట్టీకి లేదా, సూటు?" అంది సూటు అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

"అవును కదూ? మర్చే పోయాను. అక్కడే మరి మిట్టీకి కూడా ఏవైనా సూటు వుందేమో చూస్తావా?"

ఐదునిముషాల వెతుకులాట తరువాత రత్న అంది. "లాభం లేదు. చిన్న సూట్లు లేవిక్కడ. అన్నీ ఒకే సైజులో ఉన్నాయి."

"మరెలాగబ్బా?" ఒక క్షణం ఆలోచించి అన్నాడు. "మిట్టీ ని నీ సూట్ లోనే పైన కాస్త జిప్ తెరిచి దాచేసుకో. చిన్నదే కదా? పట్టేస్తుందేమో చూడు."

మిట్టీతోను, సూట్ తోను కాసేపు కుస్తీ పట్టాక అంది రత్న.

"తల పైకి పొడుచుకొస్తోంది!"

“లాభం లేదు. ఇంకేదైనా చెయ్యాలి.” కాసేపు ఆలోచించి తనే అన్నాడు. “చుట్టూ ఏవైనా ప్లాస్టిక్ షీట్ల లాంటివి ఉన్నాయేమో చూడు.”

వెతుకుతూ ఉంటే ఒక పెద్ద పెట్టె కనిపించింది. దాని మీద ఏవో చిత్రమైన అక్షరాలు ఉన్నాయి.

“ఇక్కడేదో పెట్టె ఉంది. దాని మీద ఏవో అక్షరాలు ఉన్నాయి. తెరవచ్చా?”

“ఒక్క నిముషం. ఆ అక్షరాలు నీ కమ్యూనికేటర్ తో ఫోటో తీసి పంపు.”

రత్న పంపిన చిత్రాన్ని ప్రజ్ఞకి పంపించి అడిగాడు అమోఘ్.

“ప్రజ్ఞా! ఈ అక్షరాలు ఏంటో కాస్త చెప్పగలవా ప్లీజ్?”

ప్రజ్ఞ నుండి సమాధానం క్షణాల్లో వచ్చింది.

“ఎతిలిన్ టెట్రాఫ్లూరో ఎతిలిన్. మామూలు భాషలో చెప్పాలంటే ఒక రకమైన ప్లాస్టిక్. హరితగృహాల్లో వాడుతారు. తోట పైన డోమ్ లో ఇదే వాడుతారేమో.”

అమోఘ్ చెప్పినట్టే ఆ ప్లాస్టిక్ షీట్లతో మిట్టీని తనకి కట్టేసుకుంది. తను పీల్చే ఆక్సిజన్ ఇప్పుడు మిట్టీకి కూడా అందుతోంది. ఇందాక కనిపెట్టిన తలుపు దగ్గరికి ఇబ్బంది పడుతూ నడిచింది. తలుపు తెరవడానికి వంగబోయింది. వంగడమే కష్టంగా ఉంటే, తలుపు గడియ తిప్పడానికి ఇంకా కష్టంగా అనిపించింది.

“ఈ తలుపు తెరవడానికి కష్టంగా ఉంది.” అంది ఆయాసపడుతూ.

“తలుపుకి అవతల పక్కకి వెళ్లి నీ బరువు అంతా మోపుతూ పైకి లాగు.”

రత్న అలాగే చేసింది.  ఖస్సు మన్న చప్పుడుతో తలుపు తెరుచుకుంది.

“ఏంటి ఇందులోంచి గాలి వస్తోంది?” అంది రత్న కాస్త బెంబేలు పడుతూ.

“అదేదో ఏంటీ చాంబర్ లాంటిది అయ్యుంటుంది. బయట గాలి, తోటలో గాలితో కలిసిపోకుండా ఇలాంటి గది కాపాడుతుంది. గదిలోకి వెళ్లాక పైన తలుపు గట్టిగా మూయడం మర్చిపోకు.”

కమ్యూనికేటర్ లోంచి వినిపిస్తున్న అమోఘ్ ఆదేశాలని ఓ స్కూలు పిల్లలా బుద్ధిగా అమలుచేసింది రత్న.

కొడుకు దామోదర్ రావుని వీపుకి కట్టుకుని యుద్ధానికి వెళ్లిన ఝాన్సీ లక్ష్మీబాయిలా, మిట్టీని తన సూట్ లో దాచుకుని భయంకరమైన వీనస్ వాతావరణం లోకి అడుగు పెట్టడానికి సిద్ధమయ్యింది రత్న.

కింద తలుపు తెరవగానే ఉప్పున తెల్లని పొగలు ఏంటీ చాంబర్ అంతా వ్యాపించాయి. గదిలో పరిస్థితి కాస్త తెరిపి పడ్డాక కాళ్లతో తడుముకుంటూ తలుపు లోంచి కిందకి, మెట్లమీదకి అడుగు పెట్టింది. లోపల నించి వస్తున్న మిట్టీ మూలుగులు పట్టించుకునే స్థితిలో లేదు ఆమె.

ముందు భయపడినంత భయంకరంగా లేదు. బయట పొగ ఎంత ప్రమాదకరమైనది అయినా తన సూట్ ఇచ్చే రక్షణ వల్ల తనకేమీ తెలియడం లేదు. వీలైనంత త్వరగా ఈ మెట్లు దిగి కిందన అమోఘ్ ని కలుసుకోవాలి. రత్న మనసులో ఈ లక్ష్యం స్థిరంగా రూపుదిద్దుకుంది.

ఓ ఇరవై మెట్లు దిగగానే అంతవరకు చుట్టూ ముసిరిన మబ్బులు కాస్త పలచన అయ్యాయి. ఇంకా ఎంత దూరం దిగాలో తెలుసుకుందామని కిందకి చూసింది. ఆ దృశ్యానికి రత్న గుండె గుభేలు మంది. గర్భగుళ్లో తెరలు తెరవగానే దైవసాక్షాత్కారం అయినట్టు అల్లంత దూరంలో నిప్పులు కక్కుతున్న అగ్నిపర్వతాలతో కుతకుతలాడుతూ కొలిమిలా రగిలిపోతున్న దారుణమైన వీనస్ ఉపరితలం దర్శనమిచ్చింది.

“క్రిష్ణమూర్తీ! నాకు, మిట్టీకి ఇక నువ్వే దిక్కు!”

కళ్లు మూసుకుని తన చిరకాల అదృశ్య స్నేహితుణ్ణి తలచుకుంది. అంతవరకు లేని శక్తి, ఆత్మవిశ్వాసం ఆ క్షణం తన చేతుల్లోకి ప్రవహించింది.

తమాయించుకుని మెట్ల పక్క కమ్మీని ఆ క్షణం గట్టిగా పట్టుకోకపోయుంటే ఓ గంట సేపు వీనస్ వాయుమండలం గుండా కింద పడి, ఆ కొలిమిలో తనూ, మిట్టీ ఆహుతి అయ్యుండేవారే.

“రత్నా! ఏవయ్యింది దిగుతున్నావా?” కమ్యూనికేటర్ లో అమోఘ్ గొంతు వినగానే ప్రాణం లేచొచ్చినట్టు అయ్యింది.

అంతలో అల్లంత దూరంలో అమోఘ్ ఉన్న జెపెలిన్-విమానం కనిపించింది. వీనస్ ఉపరితలం నుండి ఇక్కడి దాకా విస్తరించిన ఆ గొట్టం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాడు.

“ఇంకా ఎంత దూరం అమోఘ్ బాబూ?” అడిగింది రత్న. ముఖం మీద ముచ్చెమటలు పడుతున్నాయి.

“ఇదుగో వచ్చేశావు. ఇంకొన్ని అడుగులు అంతే.” అమోఘ్ కి ఆ సమయంలో అబద్ధం చెప్పక తప్పలేదు. ఇంకా ఐదువేల అడుగులు ఉన్నాయని చెప్తే రత్న అక్కణ్ణుంచి పూవులా రాలిపోతుంది.

ఆగని మాటలతో రత్న కష్టం తెలియకుండా మచ్చిక చేస్తూ, ప్రోత్సహిస్తూ నెమ్మదిగా, ధైర్యం చెప్తూ ఆమెకి కార్యభారం తెలీకుండా శ్రమపడ్డాడు అమోఘ్. వయసులో చిన్నవాడైనా తనలో అంత శక్తి, ఓర్పు, మానసిక పరిపాకం ఉన్నాయని అంతవరకు తనకే తెలీదు.

ఒక్కొక్క అడుగే వేసుకుంటూ రత్న తన అవరోహణ కొనసాగించింది. అలాంటి సమయంలో కూడా తన చిన్ననాటి అనుభూతి ఒకటి గుర్తొచ్చింది. తనకప్పుడు పట్టున పదేళ్లు కూడా ఉండవు. తను పుట్టి పెరిగిన పల్లెలో ఒక పొడవాటి స్తంభం మీద వాటర్  టాంకు వుండేది. ఊరంతటికీ నీరు అక్కడి నుండే వస్తుంది. తన క్లాసులో పిల్లలు అంతా ఒకసారి సరదాగా ఆ టాంక్ పైకెక్కాలని నిశ్చయించుకున్నారు. ముందు రానని మొరాయించింది తను. “ఛీ ఛీ బెదురుగొడ్డు!” అని అబ్బాయిలు ఆటపట్టిస్తే ఉక్రోషం వచ్చి తనూ బయల్దేరింది. పైకెక్కినప్పుడు వెనకా ముందూ చూసుకోకుండా ఎక్కిపోయింది. తిరిగి కిందకి చూసుకుంటే ప్రాణం పోయినట్టయ్యింది. గట్టిగా కళ్లు మూసుకుని ఇక అక్కడి నుండి కదలనని కూర్చుంది. బడి హెడ్ మాస్టరు, ఇద్దరు టీచర్లు, ఒక ప్యూను కలిసి పైకెక్కి తనని కిందికి తీసుకురావడానికి గంట సేపు పట్టింది.

అది జరిగి పదేళ్లు దాటింది. అప్పటికి ఇప్పటికి మధ్య ఎన్నో భయాలు అధిగమించింది. కాని ఎత్తు అంటే భయం మాత్రం పూర్తిగా పోలేదు. ఎప్పుడు ఎత్తు ఎక్కాల్సిన సందర్భం వచ్చినా తప్పుకునేది. కాని ఈ సారి ఆ సవాల్ ని ఎదుర్కోక తప్పదు. గుండె దిటవు చేసుకుని నెమ్మదిగా అడుగులేస్తూ కిందకి దిగుతూ పోయింది.

అడుగున మెట్ల చుట్టూ కట్టిన వేదిక దగ్గపడుతోంది. మరో వంద అడుగులు అంతే. అమోఘ్ అంతలో తన జెపెలిన్ విమానాన్ని ఆ వేదిక మీద లాండ్ చేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ విమానం హెలికాప్టర్ లా ఉన్న చోటే నిలువుగా కిందకి దిగగలిగే సామర్థ్యం గలిగి ఉండడం ఇప్పుడు తనకి కలిసొచ్చింది. విమానం మరీ బరువైనది కాక పోయినా అ వేదిక అంత బరువుని తీసుకుగలిగేట్టు లేదు. విమానం లాండ్ కాగానే

వేదిక బరువుని కింద నుండి భరించే జాయింట్లు కిర్రుమని మూలిగాయి. వేదిక ఒక పక్కకి ఒరగడం స్పష్టంగా తెలుస్తోంది.

“రత్నా! త్వరగా రా! ఇక్కడ ఎక్కువ సేపు నిలవడం సాధ్యం కాదు.” కమ్యూనికేటర్ లో అరిచాడు అమోఘ్.

ఒంట్లో ఎలాగో శక్తి తెచ్చుకుని ఇక మిగిలిన ఆఖరు మెట్లు వడివడిగా కిందకి దిగి విమానాన్ని చేరుకుంది రత్న.

విమానం తలుపు తెరిచి రత్న లోపలికి దూకడం, బరువు మోయలేక పెద్ద చప్పుడుతో వేదికలో ఒక భాగం విరిగి పడడం, విల్లు విడిచిన బాణంలా విమానం వీనస్ వాయువులలోకి దూసుకుపోవడం – మూడూ ఒక్కసారే జరిగాయి.

రత్న, మిట్టీలని సురక్షితంగా విమానంలోకి ఎక్కించుకున్నాక అమోఘ్ ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇక ఈ వీనస్ బందీఖానా నుండి బయటపడే ముహూర్తం ఎంతో దూరంలో లేదు.

ఉత్సాహంగా విస్సూ కి డయల్ చేశాడు.

“విస్సూ! రత్న, మిట్టీలు ఇప్పుడు సురక్షితంగా నా దగ్గరే ఉన్నారు. నువ్వు ఎక్కడున్నావు?”

విస్సూ దగ్గర్నుండి సమాధానం ఆగాగి వస్తున్నట్టు బలహీనంగా వచ్చింది.

“అనూని రక్షించగలిగాను… ఇద్దరం ఆంఫీ షటిల్ లో …”

నేపథ్యంలో పేలుళ్ళు వినిపిస్తున్నాయి.

“విస్సూ! ఏం మాట్లాడుతున్నావు? సరిగ్గా వినిపించడంలేదు. వెనక ఆ శబ్దాలేంటి?”

“కింద నుండి మా వైపు షూట్ చేస్తున్నారు… బులెట్లు…”

“అన్నయ్యా!” వెనుక నుండి అనూ గొంతు వినిపించింది.

అమోఘ్ మనసులో ఒక్కసారిగా సంతోషం వెల్లువయ్యింది.

"అనూ… అనూ"

అవతలి నుండి మళ్లీ సమాధానం లేదు.

అమోఘ్ కి తన ప్రపంచం అంతా తలక్రిందులు అయినట్టు అయ్యింది. ఇప్పుడిప్పుడే గండం గట్టెక్కుతోంది అనుకుంటూ ఉంటే మళ్లీ ఈ పరిణామం ఏంటి?

"ఏవయ్యింది అమోఘ్ బాబూ?" ఆదుర్దాగా అడిగింది రత్న.

"ఏమో తెలియడం లేదు రత్నా. విస్సూ సరిగ్గా మాట్లాడడం లేదు. ఎక్కడున్నాడో, ఎలా వున్నాడో కూడా తెలీదు."

"అనూ పాప దొరికిందా?"

"అనూ మాట కూడా వినిపించింది…"

"మరిప్పుడెలా?"

అమోఘ్ సమాధానం చెప్పలేదు. ఏం చెప్పాలో కూడా తెలియదు. విస్సూ ఆంఫీ షటిల్ లో వచ్చి తమని తీసుకెళ్తే తప్ప వేరే గత్యంతరం లేదు. ఈ విమానంలో అంతరిక్షం లోకి వెళ్లి రాజహంసని చేరుకోవడం అసంభవం. అసలు తమ మాట అలా ఉంచి విస్సూ, అనూలు సురక్షితంగా ఉన్నారో లేదో కూడా తెలీదు.

అంతలో విమానంలో ఏదో కంపన మొదలయ్యింది. ఆ కుదుపుకి రత్న ఉలిక్కి పడింది.

"అమోఘ్ బాబూ! ఏం జరుగుతోంది. లోపల అంతా కదిలిపోతోంది."

అమోఘ్ తేరుకుని ఫ్యూయెల్ రీడింగ్ వైపు చూశాడు. ప్రమాదకరంగా తక్కువ స్థాయిలో ఉంది. అల్లంత దూరంలో కింద ఓ అగ్నిపర్వతం కనిపిస్తోంది. మహోగ్రంగా కుతకుతలాడే లావాని వెళ్లగక్కుతోంది. విమానం నేరుగా ఆ దిశలోనే సాగుతోంది.

అగ్నిపర్వతాలు విస్ఫోటం చెందుతున్నప్పుడు వెల్లువలా బయటికి ప్రవహించే లావాతో పాటు బోలెడంత మసి, పొగ, ఇతర పదార్థాలెన్నో వాతావరణంలోకి బలంగా ఎగజిమ్మబడతాయి. అలాంటి సమయంలో బారైన పొగ స్తంభాలు ఏర్పడతాయి. భూమి మీద అయితే అలాంటి పొగ స్తంభాలు కొన్ని పదుల కిలోమీటర్ల ఎత్తు వరకు కూడా కొన్ని సందర్భాల్లో విస్తరిస్తాయి. భూమి మీద విమానాల పైలట్ లు

అగ్నిపర్వత విస్ఫోటాలు  జరుగుతున్న స్థలాల గురించి ముందే తెలుసుకుని దాని దరిదాపులకి వెళ్లకుండా జాగ్రత్త పడతారు. ఆ వేడెక్కిన పొగలో  చిక్కుకుంటే విమానం నాశనమై నేలపాలు అవ్వడం ఖాయం.

కాని అమోఘ్ పైలట్ కాడు. అయినా అసలు కింద ఎక్కడో నేల మీద జరుగుతున్న పరిణామాలకి తన ప్రస్తుత పరిస్థితికి మధ్య సంబంధాన్ని గుర్తించడానికి ప్రస్తుతం తన మనసులో లేదు. అతడి మనసులో ఆలోచనలు స్తంభించిపోయాయి. పరిస్థితులకి స్పందించి ప్రమాదం లోంచి బయటపడే మార్గాల గురించి ఆలోచించే స్థితిలో లేడు.

“అమోఘ్ బాబూ! అటు చూశావా? కిందన ఆ కొండ లోంచి బోలెడు పొగ పైకొస్తోంది. మన విమానం అటే పోతోంది....”

అమోఘ్ పరధ్యానంగా  రత్న చూపించిన కొండ వైపు చూశాడు. కొన్ని క్షణాలు అటే చూస్తూ ఉండిపోయాడు. పైకి తన్నుకొస్తున్న నల్లని పొగలని గమనించాడు. తన మానసిక యవనిక మీద ఏవో చిత్రాలు కదిలాయి. చిన్నప్పుడు చదివిన ఓ పుస్తకం గుర్తొచ్చింది. ఏదో సైన్స్ ఫిక్షన్ నవల. అగ్ని పర్వతం లోంచి పైకి తన్నుకొస్తున్న లావా...దాని మీద సవారి చేస్తున్న ఓ తెప్ప.. అందులో ప్రయాణం చేస్తున్న కొందరు వ్యక్తులు... ఆ చిత్రం మనసు తెర మీద మెదిలింది. ఆ జ్ఞాపకానికి ప్రస్తుతం తను ఎదుర్కుంటున్న సంకట పరిస్థితికి మధ్య ఏదో పోలిక గోచరించింది. అమోఘ్ పెదాల మీద ఓ సన్నని చిరునవ్వు లాస్యం చేసింది.

“థాంక్యూ రత్నా! ఆ పొగలే ఇప్పుడు మనని ఇంటికి చేర్చుతాయి. చూస్తూ ఉండు.” అంటూ ప్రజ్ఞకి డయల్ చేశాడు.

“ప్రజ్ఞా! మేం ఉన్న ఎత్తు వరకు రాజహంస దిగి రాగలదా?”

“లేదు అమోఘ్. చాలా కష్టం. దిగినా మీతో రాందెవూ ఇంచుమించు అసంభవం. పైగా ఇంధనం కూడా కాస్త తక్కువగా ఉంది. వాయుమండలం లోకి దిగి వస్తే మళ్లీ మిగిలిన ఇంధనం భూమి దాకా రాకపోవచ్చు.”

“సరే అయితే ఇది చెప్పు. మేం ఓ  పెద్ద అగ్నిపర్వతం దరిదాపుల్లో ఉన్నాం. అదేంటో చెప్పగలవా ప్లీజ్?”

“వీనస్ గ్రహం అగ్నిపర్వతాలకి పెట్టింది పేరు. ఇక్కడ మొత్తం 1,600 కి పైగా పెద్ద పెద్ద అగ్నిపర్వతాలు…”

“ప్రజ్ఞా! ప్లీజ్.  ఉపన్యాసానికి ఇప్పుడు తీరిక లేదు. దయచేసి అడిగింది చెప్పు.”

“సారీ… ఏదో అలవాటుగా… మీకు కనిపిస్తున్న అగ్నిపర్వతం పేరు మాట్ మాన్స్. దాని ఎత్తు 8 కిలోమీటర్లు. వీనస్ మీద తక్కిన అగ్నిపర్వతాలలా కాక…”

“దాని లోంచి పైకి తన్నుకొస్తున్న పొగ ఎంత ఎత్తు వరకు పోతుంది?”

“వట్టి పొగే అయితే నలభై, యాభై కిలోమీటర్ల వరకు పోతుంది. కాని దాని వల్ల చుట్టూ గాల్లో రేగే సంవహన తరంగాలు… అదే కన్వెక్షన్ కరెంట్స్ … వాటి ప్రభావం 100 కిలోమీటర్ల పై దాకా కూడా పోవచ్చు.”

“థాంక్యూ ప్రజ్ఞా! మాతో సమాగమానికి సిద్ధంకా!”

అంటూ కాల్ కట్ చేశాడు అమోఘ్.

రత్న ఏదో అనబోతుంటే హుష్ అని ఆమె నోరు మూయించాడు.

“బెల్టు బిగించుకుని, కళ్ళు మూసుకుని కూర్చో. బయట ఏం జరిగినా పట్టించుకోకు.” అంటూ థ్రాటిల్ ని బలంగా ముందుకు తోశాడు.

విమానం వేగం పుంజుకుని నల్లని పొగ మబ్బుల్లోకి దూసుకుపోయింది.

పొగ లోపలికి ప్రవేశించగానే వరద నీట్లో చిక్కుక్కున్న చేపపిల్లలా విమానం గిలగిల లాడింది. అంతవరకు సాఫీగా ముందుకు ప్రయాణించిన విమానం ఇప్పుడు దిక్కు తెన్ను లేకుండా ఎటో కొట్టుకుపోతోంది. ఏది పైనో, ఏది కిందో, ఏది ముందో, ఏది వెనుకో తెలియని భయంకర గందరగోళ పరిస్థితి. చుట్టూ క్రమ్ముకున్న ప్రచండ వాయువుల ముష్టి ఘాతాలకి ఏ క్షణమైనా ఆ ఆకాశయానం తుత్తునియలయ్యే ప్రమాదం వుంది. లోపలి ప్రయాణీకులకి నెమ్మదిగా స్పృహ సన్నగిల్లి మైకం కమ్ముతోంది. ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితులు ఎదురైనప్పుడు, భరించరాని అనుభవాలు పెక్కిరించినప్పుడు మనసు పట్టుసడలుతుందేమో. క్షణాలు, నిముషాలు, ఘడియలు… అలా ఎంత సేపు జరిగిందో తెలియదు.

“అమోఘ్! అమోఘ్!” కమ్యూనికేటర్లో తన పేరు వినిపించే సరికి తేరుకుని కళ్లు తెరిచాడు అమోఘ్. మునుపటి వాయువుల ప్రళయ లాస్యం ఆగిపోయింది. చుట్టూ చిమ్మ చీకటి. కాక్ పిట్ లోంచి చూస్తే మబ్బులు కాక ముత్యాల్లాంటి తారలు కనిపిస్తున్నాయి. అంతరిక్షపు చేలాంచలాలని తాకుతున్న అనుభూతి.

“అమోఘ్! “ మళ్లీ తనని పిలుస్తున్న గొంతు వినిపించింది.

“ఎవరది? విస్సూ? నువ్వా?” అమోఘ్ స్పందించాడు.

“అవును. మీ విమానానికి దగ్గర్లోనే ఉన్నాను. మీ కిటీలో లోంచి చూస్తే 2 ఓ క్లాక్ దిశలో నేను ఆంఫీ షటిల్ లో వున్నాను… కనిపించానా?”

అంతలో రత్న కూడా కళ్లు తెరిచింది. తాము ఎక్కడున్నామో నెమ్మదిగా తనకి అర్థమవుతోంది. స్పీకర్ లో విస్సూ గొంతు వినిపించి మనసు కాస్త కుదుటపడి నిట్టూర్చింది.

అల్లంత దూరంలో చిచ్చుబుడ్డి ఆకారంలో కిందనుండి నిప్పులు కక్కుతూ ఓ ఆంఫీ షటిల్ కనిపించింది. మొదట్లో వీనస్ ఉపరితలానికి తమని చేర్చిన ఆంఫీ షటిల్ అదే కాబోలు.

ఆంఫీ షటిల్ క్రమంగా తమకి దగ్గర పడుతోంది.

“అమోఘ్! ఇద్దరూ విమానం లోంచి ఎజెక్ట్ అవ్వండి.” విస్సూ ఆదేశించాడు.

“ఏంటి నువ్వనేది?” అమోఘ్ అడిగాడు ఆదుర్దాగా.

“ఏం ఫరవాలేదు. నేను పట్టుకుంటాగా.”

పెద్ద చప్పుడుతో విమానం లోంచి అమోఘ్, రత్నలు ఉన్న సీట్లు బయటికి విసిరేయబడ్డాయి. రత్న తొడుక్కున్న సూట్ లో మిట్టీ ఎప్పట్లాగే ఒదిగిపోయి వుంది. ఇద్దరూ పల్టీలు కొడుతూ అంతరిక్షంలో చెరో దిశలో కొట్టుకుపోతున్నారు. రత్న ఇంకా తోట నుండీ కిందికి దిగుతున్నప్పుడు వేసుకున్న సూట్ లోనే వుంది. అందులో ఆక్సిజన్ సిలిండర్ ఉండడం వల్ల అంతరిక్షంలో తనకి ఊపిరి తీసుకోవడం సాధ్యపడింది. కాని అమోఘ్ ఏ విధమైన రక్షణా లేకుండా అంతరిక్షంలో కొట్టుకుపోతున్నాడు. ఊపిరాడక నిస్సహాయంగా పెనుగులాడుతున్నాడు.

ఆంఫీ షటిల్ నుండి రెండు పొడవాటి  త్రాళ్లు బయటికి దూసుకొచ్చాయి. వాటి కొసలలలో గ్రిప్పర్ లు ఉన్నాయి.

రెండు త్రాళ్లు చెరో వ్యక్తిని వెంబడించి పట్టుకున్నాయి. ముందు రత్నని, మిట్టీతో పాటు, ఆంఫీ షటిల్ లోని వించ్ లాంటి యంత్రం లోపలికి లాగడం మొదలెట్టింది. రత్న, మిట్టీలు పూర్తిగా లోపలికి చేరిన తరువాత అమోఘ్ ని లోపలికి లాగడం మొదలెట్టింది.

కొద్ది క్షణాల తరువాత అమోఘ్  కూడా షటిల్ లోకి చేరాడు. ఎగశ్వాసకి ఛాతీ ఎగిరెగిరి పడుతోంది. ఊపిరి తీసుకోడానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.  విస్సూ చుట్టూ వెతికి ఆక్సిజన్ మాస్క్ తెచ్చి అమోఘ్ నోటికి, ముక్కుకి తగిలించాడు. అయినా శ్వాస అందక పెనుగులాడుతున్నాడు.



“ఏమయ్యిండి బాబూ?” అమోఘ్ ని కుదుపుతూ అంది రత్న. “ఏంటంత ఆయాసపడుతున్నావు? తలగడ కింద తల పెట్టుకుని పడుకోవద్దని అమ్మగారు ఎన్ని సార్లు చెప్పినా వినిపించుకోవు కదా?” అమోఘ్ ముఖాన్ని కప్పిన భారీ తలగడని పక్కకి పడేస్తూ అంది రత్న.

నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు అమోఘ్. ఎదురుగా రత్న నవ్వుతూ కనిపించింది. మంచం పక్కగా కిందకి వేలాడుతున్న చేతిని మిట్టీ హుషారుగా నాకేస్తోంది.

“ఏం రాజాగారు తొమ్మిదైనా ఇలాగే ముసుగేసుకుని పడుకుంటారా? లేక  లేచేదేపైనా వుందా?”

ఎదురుగా అమ్మ! అప్పటికే లేచి, స్నానం చేసి, చక్కగా ముస్తాబై, పెద్ద బొట్టుతో, నిండైన నవ్వు ముఖంతో... అమ్మ ముఖాన్ని చూస్తేనే ప్రాణం లేచొచ్చినట్టయ్యింది. కాని   ఎక్కడున్నాడో, ఏం జరుగుతోందో తెలీని అయోమయమైన మనోస్థితి  ఇంకా తన ముఖం మీద తాండవిస్తోంది.

“ఏపైనా కల గన్నావా బాబూ?” కాస్త కవ్విస్తూ అడిగింది రత్న.
“ఏ నెప్ట్యూనో, వీనస్సో రాత్రంతా విహరించి వచ్చినట్టు కలగని ఉంటాడు,” అంది ప్రమీల నవ్వుతూ.

“అనూ వచ్చేసిందా?” నెమ్మదిగా మంచం మీంచి లేస్తూ అడిగాడు అమోఘ్.

“అమ్మగారు పోరుపెడితే లేచి ఇప్పుడే స్నానికెళ్లింది. వచ్చేస్తుంది. త్వరగా లే బాబూ. లేస్తే పక్క సర్దాలి.” కింద పడ్డ తలగడలని మంచం పైన పెడుతూ అంది రత్న. “ఇవాళ బోలెడు పని వుంది.”

అమోఘ్ కి ఏమీ అర్థం కావడం లేదు. రత్న ఏపైనా దాస్తోందా? అలా ఏమీ ఎరగనట్టు మాట్లాడుందేం?

“ఒరేయ్ బుజ్జీ! ఇక లేచి స్నానం చేసి తయారుకా. నాన్నగారు కూడా మరో గంటలో వచ్చేస్తారు. నువ్వు, అనూ ఇవాళ కావాలంటే స్కూల్ మానేయండి. మధ్యాహ్నం అందరం కలిసి పిక్నిక్ కి వెళ్దాం,” అంటూ అమోఘ్ బుగ్గలు పుణికి, తల మీద ముద్దు పెట్టుకుంది ప్రమీల.

“అబ్బ! ఏం కంపు రా నాయనా? తల స్నానం చేసి ఎన్నాళ్లయ్యింది? నేను లేకపోతే ఇంట్లో ఏదీ సరిగ్గా జరగదేమో,” అంది ప్రమీల మెత్తగా అమోఘ్ తల మీద కొడుతూ. “ముందా మాసిన బట్టలు విప్పు. స్కూలు యూనిఫామ్ కూడా మార్చుకోకుండా పడుకున్నారన్నమాట దొరగారు.”

అమోఘ్ తన బట్టల వైపు చూసుకున్నాడు. మొత్తం గ్రహాలన్నీ చుట్టొచ్చినంతగా బట్టలు మట్టికొట్టుకుపోయి వున్నాయి.

ముందు రాత్రి జరిగిందంతా కలా, నిజమా? తేల్చుకోలేక సతమతమవుతున్నాడు.

బద్ధకంగా లేచి వొళ్లు విరుచుకుని మాసిన బట్టలు విడిచేసి తువ్వాలు కట్టుకున్నాడు.

అంతలో ఎవరో గదిలోకి దుమారంలా దూసుకొచ్చి “హేయ్!” అని అరుస్తూ వెనుకనుండి అమోఘ్ ని బలంగా తోశారు. అమోఘ్ మంచం మీద బోర్లా పడ్డాడు.

“రాక్షసి!” అని తిట్టుకుంటూ లేచి చేతికి అందిన దిండుతో గిల్లికజ్జాకి సిద్ధంగా ఉన్న చెల్లెలి మీద దాడి చేశాడు.

దిండు దెబ్బకి తన పౌరుషం దెబ్బతిన్న అనూహ్య శివంగిలా విరుచుకుపడి పక్కనే పడి వున్న మాసిన నిక్కరుతో అమోఘ్ ని బలంగా కొట్టింది.

“అబ్బా!” అని అరిచి పక్క మీద కుప్పకూలిపోయాడు అమోఘ్. వెంటనే ఓపిక తెచ్చుకుని లేచి అనూ మీద చెయ్యెత్త బోయాడు. కెవ్వున అరిచి గదిలోంచి తుర్రుమంది ఆ చిన్నారి.

వెంటపడబోయినప్పుడు కట్టుకున్న తువ్వాలు పట్టుసడల బోతుంటే, మానమర్యాదలు కాపాడుకోవడం కోసం ఎత్తిన చెయ్యిని దించి తువ్వాల్ని అదుపు చేసుకున్నాడు అమోఘ్. మనసులోనే శివంగి చెల్లెలితో సంధి చేసుకుని మళ్లీ మంచం మీద చతికిల బడ్డాడు.

నిక్కరుతో కొడితే అంత బలంగా తగలడమేమిటి? విస్తుపోయి నిక్కరులో ఏవుందో నని తీసి జేబులు తడిమాడు.

ఉసిరికాయ పరిమాణంలో కఠినంగా ఉందది. కిటిలోంచి పడుతున్న ఎండలో మిలమిల మెరుస్తున్న వజ్రం!

ఒక్కసారిగా తన సందేహాలన్నీ పటాపంచలయ్యాయి.

నిన్నటి సాహసాల తీయని స్మృతులన్నీ నెమరు వేసుకుంటూ ఆనందంగా ఆ చెదరిన పక్క మీదే మళ్లీ హాయిగా మేను వాల్చాడు అమోఘ్.

